సాక్షి 24|7

విశాఖ సిటీ

మంగళవారం 29-8-2017

చోరీల.. సెల్‌చల్



వారం క్రితం..ఓ మహిళ రూ.5వేల విలువైన సెల్‌ఫోన్ పోగొట్టుకుంది.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆగమేఘాల మీద స్పందించారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఫోన్ రికవరీ చేసి ఆమెకు అందించారు..

గత నెల 20న ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని కాలేజీకి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సమయంలో రూ.25 వేల విలువైన తన సెల్ పోగొట్టుకుంది. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాదాపు 40 రోజులు గడిచాయి. ఇప్పటికీ ఆ కేసు తేలలేదు..

- నగరంలో పెరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలు
- వీటి చోరీల కోసమే ప్రత్యేకంగా ముఠాలు
- సెల్ పోతే మీసేవలోనే ఫిర్యాదు చేయాలట
- సామాన్యుల కేసులపై స్పందించని పోలీసులు
- గత ఏడాది కాలంలో రికవరీలు శూన్యం

మొదటి కేసులో ఒక్కరోజులోనే పోయిన సెల్‌ను దొరకబుచ్చుకోగలిగిన పోలీసులు.. రెండో కేసులో 40 రోజులైనా ఎందుకు పట్టుకోలేకపోయారు?..

ఎందుకంటే.. మొదటి కేసులోని బాధిత మహిళ ఓ మంత్రిగారి బంధువు కావడం.. ఆయన ఉన్నతాధికారికి ఫోన్ చేయడమే ఆలస్యం పోలీసులు శరవేగంగా స్పందించారు. అదే రెండో కేసులో బాధిత యువతి సామాన్యురాలే మరి!

ఇంకో విచిత్రమేమిటంటే..

ఏదైనా చోరీ జరిగి.. వస్తువులను పోగొట్టుకున్నా.. సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాం. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు..

కానీ.. సెల్‌ఫోన్ల విషయంలో నేరుగా స్టేషన్‌కు వెళ్లడానికి వీలుకాదు..

మీసేవ కేంద్రానికి వెళ్లి రుసుము కట్టి ఫిర్యాదు నమోదు చేస్తే.. ఆన్‌లైన్ దాన్ని సంబంధిత స్టేషన్‌కు పంపుతారు.. ఆ తర్వాతే పోలీసులు తీరిగ్గా దర్యాప్తు చేపడతారట!..

ఇదంతా జరిగేసరికి పుణ్యకాలం గడిచిపోతుంది.. సెల్‌ఫోన్ చోరీ కేసులు పరిష్కారం కాకపోవడానికి ఇదీ ఒక కారణమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దీనివల్ల సెల్‌ఫోన్ పోయినా.. చాలామంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

- విశాఖ సిటీ

12లో

ఫోన్లు.. చోరీలు.. గణాంకాలు

నెలకు సగటున చోరీల సంఖ్య	520
నమోదవుతున్న కేసులు	30
రికవరీలు(ప్రమాదంలో)	0



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల

కన్నెర్ర

ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఒప్పంద ఉద్యోగులు

6లో



ఆటల్లో మేటి సౌకర్యాలు ఏపాటి

- క్రీడల్లో రాణిస్తున్న విశాఖ క్రీడాకారులు
- పతకాల పంట పండిస్తున్న వైనం
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే అయినా సత్తా చాటుతున్న యువతులు

sports

జాతీయ క్రీడా దినోత్సవ ప్రత్యేక కథనాలు

సెంటర్‌స్ప్రెడ్‌లో..

జిల్లాలో

జలవిలయం



- పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ
- జలదిగ్బంధంలో గిరిజన గ్రామాలు

16లో

- పర్యావరణహితంగా పార్కు
- అలనాటి విశాఖను తలపించే మినియేచర్ విలేజ్
- ముడసర్లోవ పార్క్‌పై వుడా సమీక్ష
- హాజరైన సీనియర్ ఆర్కిటెక్ట్

ముడసర్లోవకు సరికొత్త హంగులు



విశాఖ సిటీ:

ముడసర్లోవ పార్కును సహజ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 26 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కు అభివృద్ధి జరగనుంది. ఇందులో 10 ఎకరాలకు పైగా ఉన్న పచ్చదనాన్ని హరించకుండా.. నేచురల్ పార్కుగా మార్చాలని వుడా అధికారులు నిర్ణయించారు. సిటీ సెంట్రల్ పార్కును అభివృద్ధి చేసిన తరహాలో.. ముడసర్లోవకు అత్యాధునిక హంగులు కల్పిస్తూ పర్యావరణానికి ఎలాంటి హానీ జరగకుండా డిజైన్లను రూపొందించనున్నారు. ఇందుకోసం గతంలో డిజైన్లు అందించిన సీనియర్ ఆర్కిటెక్ట్ రాజ్‌ఎక్స్‌పిడిత్, ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి, వుడా వీసీ బసంత్‌కుమార్, సీయూపీ భవానీశంకర్, ఎస్టేట్ ఆఫీసర్ వసంత రాయుడు సోమవారం ముడసర్లోవ పార్కును పరిశీలించారు. అందులో ఉన్న ప్రకృతి అందాలు ఏ మాత్రం చెక్కుచెదరకుండా కాపాడుకుంటూనే అత్యాధునిక సాంకేతికతతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.


ఈ తరహాలోనే మినియేచర్ విలేజ్ ఏర్పాటు చేస్తారు

సహజ అందాలు చెదరకుండా..: ముడసర్లోవలో ఉన్న సహజ అందాలు చెక్కు చెదరకుండా మిగిలిన 15 ఎకరాల్లో విశాలమైన పార్కుగా అభివృద్ధి చేయనున్నారు. పార్కుకు ఆనుకొని ఉన్న రిజర్వాయర్‌ను డిస్ట్రాయ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. పార్కుకు వచ్చేవారు రిజర్వాయర్‌లోని నీటిని కాలుష్య కాసారంగా మార్చకుండా చుట్టూ బారికేడ్లు తరహా నిర్మాణాలు చేపట్టేలా డిజైన్లలో మార్పులు చేయనున్నారు. దీనికితోడు క్యాచ్‌మెంట్ ఏరియాను సైతం నాశనం చేయకూడదని నిర్ణయిం చారు. మొదటి విడతలో ఈ తరహా అభివృద్ధి చేసి.. రెండో విడతలో అమ్యూజ్‌మెంట్‌పై దృష్టి సారించనున్నారు. రైడింగ్‌లు వంటివి లేకుండా నిర్మాణాలు చేపట్టనున్నారు.

చుట్టూ కొండలు.. ఏళ్ల కాలం నాటి వృక్షాలు.. పక్కనే విశాలమైన రిజర్వాయర్.. ఈ అందాలే పట్టుగొమ్మలుగా.. ముడసర్లోవ పార్కును తీర్చిదిద్దనున్నారు. తొలి విడతలో నేచర్ పార్కుగా.. రెండో విడతతో నేచురల్ అమ్యూజ్‌మెంట్ ఏర్పాటు చేయనున్నారు. 1920-30లో విశాఖపట్నం ఎలా ఉండేదో ఆ అందాల్ని సాక్షాత్కరింపజేసేలా ఏర్పాటు చేయనున్న మినియేచర్ విలేజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

శతాబ్ద కాలం నాటి వైజాగ్ ఏర్పాటు

పార్కు అభివృద్ధిలో భాగంగా రెండో విడతలో నేచురల్ అమ్యూజ్‌మెంట్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా పార్కుకు ప్రత్యేక ఆకర్షణగా మినియేచర్ విలేజ్ ఏర్పాటు చేయనున్నారు. 1920–30 కాలంలో విశాఖపట్నం ఎలా ఉండేది. అప్పటి నిర్మాణాలు, ఆచార వ్యవహారాలు ఉట్టిపడేలా విశాఖపట్నం స్వరూపాన్ని మినియేచర్ విలేజ్‌గా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దేశంలో ఇప్పటివరకూ మినియేచర్ విలేజ్ ఎక్కడా లేదు. ఇది ఏర్పాటైతే పార్కుకు విదేశీ పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 1000–1500 చదరపు గజాల విస్తీర్ణంలో అలనాటి విశాఖ మినియేచర్ విలేజ్ అందాలు కనువిందు చేయనున్నాయి.

వన భోజనాలకు ఏర్పాట్లు: మొదటి విడతలో నేచర్ పార్కుగా ముడసర్లోవని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దశాబ్దాల కాలం నాటి భారీ మర్రిచెట్టుతో పాటు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి తోటల్ని ప్రత్యేక అందాలుగా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. దట్టంగా పరచుకున్న మామిడి తోటను కార్తీక మాసంలో వనభోజనాలకు, పిక్నిక్ ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు ఔషధ మొక్కల్ని పార్కు మొత్తం నాటాలని నిర్ణయించారు. తొగరు మొదలైన ఔషధ మొక్కలతో పాటు సువాసనలు వెదజల్లుతూ.. ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని పంచే మొక్కలు పెంచనున్నారు.


మాట్లాడుతున్న వుడా వీసీ బసంత్‌కుమార్, సీనియర్ ఆర్కిటెక్ట్ రాజ్ ఎక్స్‌పిడిత్, ఏపీ అర్బన్‌గ్రీనింగ్ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి

రెండో విడతలో ఆదాయ మార్గం



సాధారణ ప్రజలకు ఆహ్లాదంతోపాటు భిన్న వర్గాలకు అనువుగా ఉండే వివిధ రకాల ఆదాయ వనరులు సమకూరేలా పార్కు నిర్మించాలని భావిస్తున్నాం. తొలి విడతలో నేచర్ పార్కుగా.. మలి విడతలో వుడాకు ఆదాయం తీసుకొచ్చే రెవెన్యూ మార్గాలతో పాటు అమ్యూజ్‌మెంట్ నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– బసంత్‌కుమార్, వుడా వీసీ

ఔషధ మొక్కల నర్సరీ ఏర్పాటు



నేచర్ ముడసర్లోవ పార్కు అందాలకు ఆలవాలంగా ఉంది. దీన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించేలా ఔషధ మొక్కల్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మొరిండా, బ్రెడ్డీలియా, కెరిసా మొదలైన చెట్లతో పాటు అటవీ ప్రాంతంలో దొరికే టాప్–100 ఔషధ, సువాసన భరిత మొక్కల్ని నాటుతాం. ఔషధ మొక్కల నర్సరీ కూడా విశాఖలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

–ఎస్. చంద్ర మోహన్‌రెడ్డి,
ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ

అందర్నీ ఆకట్టుకుంటుంది



నా డిజైన్లలో పచ్చదనానికి, పర్యావరణానికి పెద్ద పీట వేస్తాను. నా ఆలోచనలకు అనుగుణంగానే ముడసర్లోవ ప్రాంతం ఉంది. అందర్నీ ఆకట్టుకునేలా పర్యావరణానికి విఘాతం కలగకుండా పార్కు డిజైన్లను చేపడతాను. గతంలో ఉన్న డిజైన్లకు మరికొంత నేచర్ సొబగులద్ది త్వరలోనే వుడాకు సమర్పిస్తాను. డిజైన్లు పూర్తయ్యాక అంచనా వ్యయం తెలుస్తుంది.

–రాజ్ ఎక్స్‌పిడిత్, సీనియర్ ఆర్కిటెక్ట్

రైల్వేలో ‘స్వచ్ఛత పక్వాడా’


రైల్వే క్వార్టర్లను శుభ్రపరుస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): రైల్వే ఆధ్వర్యంలో జరుగుతున్న ‘స్వచ్ఛత పక్వాడా’ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాళ్లు, రిటైనింగ్ రూంలు, రైళ్లు, రైల్వే ఉద్యోగుల కాలనీలు, పాఠశాలల్లోని వాటర్ ప్లాంట్స్‌ను ఆకస్మిక తనిఖీలు చేశారు. శుద్ధమైన మంచినీటిని ప్రయాణికులకు అందించే లక్ష్యంతో అన్ని చోట్లా తనిఖీలు చేపట్టారు. వాటర్ వెండింగ్ మెషిన్ల వద్ద ఉన్న మంచినీటినీ పరీక్షించారు. ఈ సందర్భంగా వివిధ రైల్వే కాలనీల్లోని డ్రెయిన్లనూ సిబ్బంది శుభ్రపరిచారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక


సెలక్షన్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

గాజువాక: వచ్చే నెల 24 నుంచి 27వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో నిర్వహించనున్న 20వ అంతర్జాతీయ బాలబాలికల కబడ్డీ పోటీలకు జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన జట్ల ఎంపిక పోటీల్లో బాలురు 300 మంది, బాలికలు 180 మంది పాల్గొనగా నిర్వాహకులు ఒక్కో జట్టులో 20 మంది సభ్యులతో రెండు జట్లను ఎంపిక చేశారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు ఈ రెండు జట్ల క్రీడాకారులకు శిక్షణ నిర్వహిస్తామని విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ అనంతరం రెండు జట్లలో 12 మంది క్రీడాకారుల చొప్పున తుది జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. సెలక్షన్స్ ప్రక్రియలో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పి.అప్పారావు, పి.సత్యనారాయణ, ఎన్.మంగరాజు, పల్లా రమణ, ఎం.గణపతిరావు, వై.వి.శ్రీనివాస్, పి.రాము, కాళి ప్రసాద్, నర్సింగరావు, ఎం.అప్పారావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం





ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న వైదికులు

- వచ్చే నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు నిర్వహణ
- నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణస్వామి వ్రతాలు రద్దు
- సుప్రభాత సేవ, ఆరాధన టిక్కెట్లు నిలుపుదల

సింహాచలం (పెందుర్తి):

సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. స్వామివారికి జరిగే నిత్య పూజలు, విశేష ఉత్సవాలు, వార్షిక ఉత్సవాలు, చందనోత్సవం, కల్యాణోత్సవం తదితర వాటిల్లో పూజా విధంగా ఏవిధమైన దోషాలు చేసినా.. వాటిని నివృత్తి చేసేందుకు ఏటా భాద్రపద ఏకాదశి నుంచి ఐదు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం పరిపాటి. దీనిలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఒకటో తేదీన రాత్రి 7 గంటలకు మృత్యుంగ్రహణం, అంకురార్పణతో పవిత్రోత్సవాలను ప్రారంభిస్తారు. 2వ తేదీన ఉదయం విశేష హోమాలు, పారాయణాలు, రాత్రి ఆదివాసములు, పారాయణలు నిర్వహిస్తారు. 3వ తేదీ రాత్రి పవిత్రసమర్పణ, 4వ తేదీ రాత్రి పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 5వతేదీ ఉదయం ఏకాంత స్నపనం నిర్వహించనున్నారు. స్వామివారి ఉత్సవ మూర్తులైె గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేసి పై కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రాత్రి 7 గంటల వరకే దర్శనాలు

పవిత్రోత్సవాలు సందర్భంగా ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు రాత్రి 7 గంటల తర్వాత స్వామివారి దర్శనాలు భక్తులకు లభించవని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులంతా ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

ఆర్జిత సేవలు రద్దు

పవిత్రోత్సవాలు సందర్భంగా ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు పలు ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణస్వామి వ్రతాలను రద్దు చేసినట్టు చెప్పారు. అలాగే సుప్రభాతసేవ, ఉదయం ఆరాధన, రాత్రి ఆరాధన టిక్కెట్లు లభించవని తెలిపారు. 3వ తేదీ ఉదయం జరగాల్సిన స్వర్ణపుష్పార్చన పూజను రద్దు చేసినట్టు తెలిపారు.

పవిత్రాలు సిద్ధం

పవిత్రోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి, ఆలయానికి, ఆలయంలో వేంజేసే దేవతామూర్తులకు సమర్పించాల్సిన పవిత్రాలను సోమవారం ఆలయ అధికార, వైదిక వర్గాలు సిద్ధం చేశారు.

సంక్షిప్తంగా..

జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా పీఎస్ నాయుడు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీఎస్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ న్యాయ శాఖ సెక్రటరీ దుప్పల వెంకటరమణ సోమవారం రాత్రి జీవో ఆర్టీ నెం.710 పేరిట నోటిఫికేషన్ జారీ చేశారు.

పలు దేవాలయాలకు నిధులు

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలోని కల్యాణలోవలో శ్రీ కళ్యాణ పోతురాజుబాబు ఆలయ నిర్మాణానికి టీటీడీ దేవస్థానం నుంచి రూ.12 లక్షలు మంజూరు చేశారు. అదే విధంగా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలోని కల్యాణమండపం మరమ్మతుల కోసం టీటీడీ నుంచి రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆదేశాలు జారీ చేశారు.

యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.3 కోట్లు

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్మించనున్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.3కోట్లు మంజూరు చేస్తూ ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

జీవన్‌బాబుపై సస్పెన్షన్ ఎత్తివేత

వికలాంగ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఏసీబీకి చిక్కి సస్పెన్షన్ గురైన కె.జీవన్‌బాబుపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కే.సునీత ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవో 89ను జారీ చేశారు.

ఏఆర్‌ఎస్‌ఐలకు ఒక రోజు శిక్షణ

అల్లిపురం (విశాఖ దక్షిణ) : ఆర్మ్‌డ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 53 మందికి సోమవారం ఒక రోజు వర్కుషాప్ నిర్వహించారు. సిటీ ట్రైనింగ్ సెంటర్ (సీటీసీ)లో మూడు నెలల పాటు జరగనున్న శిక్షణలో భాగంగా ద్రోణా కన్సల్టెన్సీ మోటివేషన్ శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా శిక్షణలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్లకు మోటివేషన్ , ఆత్మవిశ్వాసం (కాన్ఫిడెన్స్), చేపట్టిన పనిని నిర్విరామంగా కొనసాగించే పట్టుదల, కార్యసాధన శక్తి గురించి వివరించారు.

స్వర్ణభారతి స్టేడియంలో స్పోర్ట్స్‌డే

విశాఖస్పోర్ట్స్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. షెడ్యూల్ ప్రకారం సాగరతీరంలో క్రీడాకారులతో కార్నివాల్ ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు మంగళవారం నిర్వహించాల్సి ఉంది. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా వేదికను మార్చాల్సి వచ్చిందని డీఎస్‌డీవో జూన్ గాలియట్ తెలిపారు. ఉదయం ఆరు గంటలకల్లా కార్యక్రమంలో పాల్గొనేవారు హాజరుకావల్సిందిగా కోరారు.

పులస @4 వేలు

- గోదావరి జిల్లాల నుంచి విశాఖకు..
- కొనుగోలుకు ధనికుల ఆసక్తి

సాక్షి, విశాఖపట్నం:

చేపల్లో రారాజుగా పిలిచే పులస చేప ఇప్పుడు విశాఖ నగర మార్కెట్లో లభ్యమవుతోంది. పులస చేప పేరు వింటేనే చెవులు కోసుకునే మాంసాహార ప్రియులకు ఇది అందుబాటులోకి వచ్చింది. కిలో వేల రూపాయలు పలికే ఈ చేపకు ఎంతో గిరాకీ. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నదిలోకి కొత్తనీరు బాగా వచ్చి చేరుతోంది. దీంతో అక్కడ పులస లభ్యత ఆశాజనకంగా ఉంటోంది. అక్కడ నుంచి మత్స్యకారులు నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న సిటీ సెంట్రల్ ఫిష్ మార్కెట్‌లో కిలో రూ.3 నుంచి 4 వేల వరకు అమ్ముతున్నారు. ఆదివారం ఉదయం వేళ పులస చేపలను ఈ మార్కెట్‌కు తెస్తున్నారు. వీటి ధర వేలల్లో పలుకుతుండడంతో ఇక్కడ మార్కెట్లో ఆదివారం పూట 40 నుంచి 50 వరకు తీసుకొస్తున్నారు. మిగతా రోజుల్లో తక్కువ సంఖ్యలోను, ముందుగా ఆర్డరిచ్చిన వారికి తెచ్చి ఇస్తున్నారు. కిలో పులస చేప రూ.4 వేల వరకు పలుకుతుండడంతో సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో పులసను పోలివుండే ఇలసలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో వీటి ధర రూ.700 నుంచి 800 వరకు ఉంది. ఈ ఇలసలు కోల్‌కతా సమీపంలో గంగా నదిలో లభ్యమవుతాయి. అక్కడ నుంచి రైళ్లలో ఇక్కడకు తెచ్చి అమ్ముతున్నారు. అయితే పులస, ఇలసల మధ్య తేడాను పోల్చుకోవడం ఒకింత కష్టం. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఇలసలనే పులసలుగా అమ్మేస్తుంటారు. మరో నెల రోజుల పాటే అసలైన పులసలు లభ్యమవుతాయి.



మత్స్యకార మహిళ చేతిలో పులస చేప

ఏయూ సమాచారం



ఒకటి నుంచి పీజీ ఈసెట్ కౌన్సెలింగ్

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీ ఈసెట్ 2017 కౌన్సెలింగ్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. 1న ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్‌సీ, క్రీడా విభాగాలలో అన్ని ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరుపుతారు. 2న 1–600 ర్యాంకులు, 3న 601–1,350, 4న 1,351–2,100, 5న 2,101–2,850, 6న 2,851–3,850, 7న 3,851–చివరి ర్యాంకు వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతారు. ఆన్‌లైన్‌లో క్రెడిట్, డెబిట్ కార్డ్‌తో ఫీజు చెల్లించి రశీదును పొందాల్సి ఉంటుంది. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ప్రొవిజినల్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలు, స్టడీ సర్టిఫికెట్‌లు, రెసిడెన్స్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, రెండు సెట్‌లు జెరాక్స్ ప్రతులు తీసుకురావాలి.

దూరవిద్య ప్రవేశాలు ప్రారంభం

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, పీజీ డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు, రూ.200 అపరాధ రుసుముతో నవంబరు 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. సైన్స్, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎల్‌ఎల్‌ఎం దరఖాస్తు ధర రూ. 250, పోస్టులో రూ.300, ఇతర కోర్సులకు రూ. 40, (పోస్టులో 80). పూర్తి వివరాలకు www. andhrauniversity.edu.in/sde వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఎంబీఏ, ఎంసీఏ నోటిఫికేషన్

ఎంబీఏలో రెండేళ్ల, మూడేళ్ల కాలపరిమితి కలిగిన హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్ కోర్సు, మూడేళ్ల కాలపరిమితి కలిగిన ఎంసీఏ కోర్సును ఏయూ దూరవిద్య కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఐసెట్‌లో ర్యాంక్ సాధించిన వారు, ఏయూ దూరవిద్య కేంద్రం నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు అర్హులే. ఏయూ నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్షకు ఈ నెల 31లోగా రూ 300 దరఖాస్తు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రూ. 300 అపరాధ సుముసుతో సెప్టెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 17న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఐసెట్ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ సాధించిన వారు నవంబర్ 1 వరకు నేరుగా చేరవచ్చు. రూ 300 అపరాధ సుముతో నవంబర్ 11వ తేదీ వరకు ప్రవేవాలు కల్పిస్తారు.

స్పెషల్ డ్రైవ్ పరీక్షలు వాయిదా

ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలో జరగాల్సిన పీజీ, సెప్టెంబర్ 6 నుంచి జరగాల్సిన యూజీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలను వాయిదా వేశారు. పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలి.

పర్యాటక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు అంశాలలో పోటీలను నిర్వహిసున్నారు. పోస్టర్‌పెయింటింగ్, పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్, టూరిజం ఫొటోగ్రఫీ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు పై అంశాలలో పాల్గొవచ్చు. ఈ నెల 30వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి.ఇతరసమాచారంఏయూవెబ్‌సైట్ www.andhrauniversity.edu.in నుంచి ఏయూ సమన్వయకర్త ఆచార్య ఎన్.సాంబశివరావు (9848170274) నుంచి పొందవచ్చు. – ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు)

11 నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

అగనంపూడి (గాజువాక) : వచ్చే నెల 11వ తేదీ నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌వో–1) పరీక్షలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్ విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు, ప్రాథమిక పాఠశాలలకు 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పరీక్షల తేదీల్లో ప్రాథమిక పాఠశాలలకు ఉదయం పది నుంచి 12 వరకు, ఉన్నత పాఠశాలల్లో రెండు పేపర్లు ఉన్న విద్యార్థులకు (8, 9, 10 తరగతులకు) ఉదయం 10 నుంచి 12.45 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.45 వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విశాఖ సిటీ | మంగళవారం | ఆగస్టు | 29 | 2017 సాక్షి

భవిష్యం

మేషం: ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. మిత్రులతో స్వల్ప వివాదాలు. ఆలోచనలు కలసిరావు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

వృషభం: పనులు విజయవంతంగా సాగుతాయి. ఆప్తుల నుంచి శుభవార్తలు. వాహనయోగం. చర్చల్లో పురోగతి. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.



మిథునం: అప్రయత్న కార్యసిద్ధి. ప్రముఖుల నుంచి ముఖ్య సందేశం. వస్తులాభాలు. పాతమిత్రుల కలయిక. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూల పరిస్థితి.

కర్కాటకం: శ్రమ తప్పదు. పనుల్లో అవాంతరాలు. వ్యయప్రయాసలు. అనారోగ్యం. కుటుంబసభ్యులతో వివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళం.

సింహం: వ్యవహారాలలో అవరోధాలు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబంలో చికాకులు. ఆరోగ్యభంగం. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో మార్పులు.

కన్య: కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు. ఆర్థిక ప్రగతి. నూతనోత్సాహంతో ముందడుగు వేస్తారు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు.

తుల: వ్యవహారాలలో అవరోధాలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

వృశ్చికం: కుటుంబంలో శుభకార్యాలు. ఆకస్మిక ధన, వస్తులాభాలు. చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. వ్యాపార విస్తరణ. ఉద్యోగులకు నూతనోత్సాహం.

ధనుస్సు: ఆదాయానికి మించిన ఖర్చులు. బంధువులతో అకారణంగా విరోధాలు. దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప చికాకులు.

మకరం: కుటుంబసభ్యులతో సఖ్యత. విందు వినోదాలు. యత్నకార్యసిద్ధి. వస్తులాభాలు. పాతమిత్రుల కలయిక. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు.

కుంభం: అనుకూల సమాచారం. ఇంటాబయటా ప్రోత్సాహం. ఆర్థికాభివృద్ధి. భూవివాదాల పరిష్కారం. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.

మీనం: కుటుంబ, ఆరోగ్య సమస్యలు. వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. మిత్రులతో కలహాలు. వ్యాపారాలు నిరాశాజనకంగా ఉంటాయి. ఉద్యోగులకు పనిభారం.

– సింహంభట్ల సుబ్బారావు

రిటైల్ రంగంలో ఉచిత ఉపాధి శిక్షణ

సీతంపేట (విశాఖ ఉత్తరం): నిరుద్యోగ యువతీ యువకులకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కంప్యూటర్స్, రిటైల్ రంగంలో ఉపాధి కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొనాంజ హ్యూమన్ రిసోర్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా యువతకు మూడు నెలల పాటు శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణా సమయంలో ఉచిత హాస్టల్ సదుపాయం, యూనిఫారం, టీచింగ్ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, రిటైల్ రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, వెస్ట్ గోదావరి జిల్లాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బీవీకే కళాశాల వద్ద గల బొనాంజ హ్యూమన్ రిసోర్స్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు 9985228575, 7032454555 ఫోన్ నంబరుకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీపీఎస్ విధానం రద్దు కోరుతూ నేడు ధర్నా

ఆరిలోవ(విశాఖ తూర్పు): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ఉపాధ్యాయ సంఘాలు, వివిధ శాఖల ఉద్యోగులు భారీ ఎత్తున ధర్నా చేపట్టనున్నారు. ఈ ధర్నా జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్.టి.ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటారన్నారు.

డిసెంబర్‌లో అంతర వర్సిటీల టెన్నిస్ పోటీలు

సాగర్‌నగర్ (విశాఖతూర్పు) : భారత విశ్వవిద్యాలయాల సంఘం(ఏఐయూ) సూచనల మేరకు ఈ ఏడాది డిసెంబర్ నుంచి గీతం వర్సిటీ వేదికగా దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల టెన్నిస్ (మహిళలు)పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఏఐయూ సభ్యత్వం గల విశ్వవిద్యాలయాలు తమ మహిళా టెన్నిస్ జట్ల వివరాలను అక్టోబర్ 30లోగా అందజేయాలని కోరారు. విశ్వవిద్యాలయ జట్ల వివరాలను పంపే వారు ఏఐయూ వార్షిక సభ్యత్వ రుసుము చెల్లించి ఉండాలని సూచించారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెం నరసింహనగర్‌లోని గణేష్ బార్‌ను తొలగించాలంటూ మహిళల ఆందోళన
- ఉదయం 10గంటలకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన
- ఉదయం 10 గంటలకు బీచ్‌రోడ్డులోగల గిడుగు రామూర్తి పంతుల విగ్రహం వద్ద 154 జయంతి కార్యక్రమం
- ఉదయం 10.15 గంటలకు బాలబాపు భవన్‌లో ఆర్‌టీఈ ఫోరం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం
- ఉదయం 10.30 గంటలకు సీఐటీయూ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా
- ఉదయం 10.30 గంటలకు కంచరపాలెం ఆర్పీ పేట జీవీఎంసీ స్కూల్‌లో పుస్తకాల పంపిణీ
- ఉదయం 11 గంటలకు జీవీఎంసీ విగ్రహం వద్ద ఏపీఎస్‌ఆర్టీసీ హైర్ బస్ వర్కర్ల యూనియన్ ధర్నా
- సాయంత్రం 4 గంటలకు ఎంవీపీ కాలనీలో రాధాష్టమి వేడుకలు
- సాయంత్రం 5.30గంటలకు సమైక్యభారతి ఆధ్వర్యంలో వన్‌టౌన్ రీడింగ్ రూమ్‌లో తెలుగు భాషా దినోత్సవం .

విశాఖ బులియన్

గోల్డ్ 24 క్యారట్స్ 10గ్రా.	29,650
గోల్డ్ 22 క్యారట్స్ 10గ్రా.	27,950
వెండి కిలో ధర	41,500

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	362.00
విజయనగరం	366.00
శ్రీకాకుళం	366.00

వెండితెర తెలుగు / హిందీ / ఇంగ్లీష్





వివేకం : కామేశ్వరి : మద్దిలపాలెం : ఫోన్: 6525600, 11.00, 2.30, 6.15, 9.45, లీలామహల్, విశాఖపట్నం, ఫోన్: 2562480, 11.00, 2.30, 6.30, 9.15,సంగం : విశాఖపట్నం: ఫోన్: 2747150, 11.00, 2.30, 6.15, 9.15, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-2 : (104 ఏరియా) ఫోన్: 2558658, 6.00, 9.00, వీ మ్యాక్స్ సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

వీఐపీ-2 : శ్రీవెంకటేశ్వర : విశాఖ పట్నం, ఫోన్: 2565566, 11.00, 2.30, 6.30, 9.30, గోకుల్, విశాఖపట్నం: 11.00, 2.30, 6.15, 9.30, సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ

అర్జున్‌రెడ్డి : మెలోడి: ఫోన్: 10.45, 2.30, 6.15, 10.00, కిన్నెర : మద్దిలపాలెం: 6525600, 11.00, 2.30,6.15, 9.45, సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్ ఎ2

ఆనందో బ్రహ్మ : శారద : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15 10.00, వీ మ్యాక్స్ స్క్రీన్-2, 11.15, 2.30, 6.15, 10.00, శ్రీకన్య విశాఖపట్నం : 11.00, 2.30, 6.30, 9.30,

నేనేరాజు నేనే మంత్రి : జ్యోతి : విశాఖ పట్నం. ఫోన్: 2788788, 11.00,2.30, 6.15,9.30, శ్రీరామా : విశాఖపట్నం ఫోన్: 2552445, 11.00, 2.45, 6.15, 9.45, ఊర్వశి : కంచరపాలెం, 10.45, 2.00, 5.35, 9.00 సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

జయ జానకి నాయక : శరత్ విశాఖ పట్నం: ఫోన్: 2747151,11.00, 2.30, 6.15, 9.45, రమాదేవి : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.30,2.30, 6.30, 10.00, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-1(104 ఏరియా) ఫోన్: 2558658, 10.45 2.00, 5.35, 8.40.

లై : వెంకటేశ్వర : ఫోన్: 2565 566, 11.00, 2.30, 6.15, 9.30,

నక్షత్రం : వీ మ్యాక్స్ స్క్రీన్-1 ఫోన్: 6060999, 10.30, 1.45, 5.40, 8.45,

ఫిదా : జగదాంబ : ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15, 10.00, సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్,

గౌతమ్‌నంద : పరమేశ్వరి : కంచర పాలెం 10.30, 1.45, 5.40, 8.45,

తిరుమల సమాచారం



- తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండి, క్యూ వెలుపలకు వచ్చింది.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం : గదుల వివరాలు:

- ఉచిత గదులు – ఖాళీ లేవు
- రూ.50 గదులు – ఖాళీ లేవు
- రూ.100 గదులు – ఖాళీ లేవు
- రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

- సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
- వసంతోత్సవం – ఖాళీ లేవు
- ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు
- మంగళవారం ప్రత్యేక సేవ : అష్టదళపాదపద్మారాధన

వాతావరణం

రానున్న 24 గంటల్లో గుజరాత్, కొంకణ్, అలాగే ముంబైలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తూర్పు రాజస్తాన్, పశ్చిమ మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళలో మోస్తరు వర్షం పడుతుంది. దక్షిణ తమిళనాడు మినహా మిగిలిన ప్రాంతాల్లో చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

విశాఖపట్నం వాతావరణం

గరిష్టం కనిష్టం

237208°//24.08°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.2	26.6
కోల్‌కతా	32.2	26.4
బెంగళూరు	26.2	20.5
ముంబై	28.7	24.2
చెన్నై	31.8	27.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
ఒంగోలు	34.0/26.8	నల్లగొండ	30.0/25.4
అనంతపురం	33.0/24.2	ఆదిలాబాద్	30.0/22.1
గుంటూరు	32.8/24.8	ఏలూరు	29.7/25.6
నెల్లూరు	32.6/25.6	తాడేపల్లిగూడెం	29.7/25.6
చిత్తూరు	32.5/26.5	ఖమ్మం	29.2/21.4
తిరుపతి	32.5/26.5	కరీంనగర్	29.1/26.0
కడప	31.2/25.5	నిజామాబాద్	28.9/24.0
వరంగల్	30.7/24.5	కాకినాడ	28.1/26.0
శ్రీకాకుళం	30.6/25.5	హైదరాబాద్	27.1/22.3
విజయనగరం	30.6/25.5	రంగారెడ్డి	27.1/22.3
విజయవాడ	30.3/25.2	విశాఖపట్నం	27.0/24.0
మహబూబ్‌నగర్	30.3/23.7	రాజమండ్రి	26.7/25.6
కర్నూలు	30.2/23.4	మెదక్	26.6/21.3

బుల్లితెర W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్


ఉ.06.45	నిరీక్షణ
ఉ.07.00	న్యూస్ 360
ఉ.07.30	కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00	కాకినాడ ఓట్
ఉ.09.30	మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00	కాకినాడ ఓట్
ఉ.10.30	కాకినాడ ఓట్
మ.02.30	కాకినాడ ఓట్
సా.04.30	కాకినాడ ఓట్
సా.05.00	కాకినాడ ఓట్
సా.05.30	ఉర్దూ న్యూస్
రా.07.30	పొలిటికల్ కారిడార్
రా.08.00	ఫోర్త్ ఎస్టేట్
రా.09.00	న్యూస్ 360
రా.09.30	మ్యాగజీన్ స్టోరీ
రా.10.30	స్క్రీన్‌ప్లే
రా.11.30	న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్

ఉ.07.00 సోగ్గాడి పెళ్ళాం
ఉ.09.30 గోపి గోడమీద పిల్లి
మ.12.00 జెమిని
మ.03.00 అల్లరి ప్రియుడు
రా.09.00 బంగారు బుల్లోడు




మూవీస్ నౌ

ఉ.08.50 హూ యామ్ ఐ?
ఉ.11.05 మోడరన్ టైమ్స్
మ.12.50 ఆక్టోపస్సీ
సా.04.35 ట్రెమోర్స్ 2
రా.06.35 యాంట్-మ్యాన్



హెచ్‌బీవో

ఉ.06.40 రష్ అవర్ 2
ఉ.11.59 మ్యాన్ ఆఫ్ స్టీల్
మ.02.28 ద ఇటాలియన్ జాబ్
సా.04.26 వెల్కమ్ టు ద జంగిల్
రా.09.00 ద హ్యాంగోవర్-2



స్టార్ గోల్డ్

ఉ.06.50 రామాయణ: ద ఎపిక్
ఉ.09.05 వాంటెడ్
మ.12.20 ధృవ
మ.03.40 గంగాజల్
సా.06.55 సింగం రిటర్న్స్



మా మూవీస్

ఉ.07.00 సిసింద్రీ
ఉ.09.00 హలో బ్రదర్
మ.12.00 ఆవిడా మా ఆవిడే
మ.03.00 రాజన్న
సా.05.00 శిరిడి సాయి



జీ క్లాసిక్

ఉ.06.29 గోపిచంద్ జాసూస్
ఉ.09.24 శిఖర్
మ.12.25 దీవార్
మ.03.05 రంగ్
రా.10.42 భవానీ జంక్షన్

సా..గుతున్న సిట్ దర్యాప్తు

- ముగిసిన గడువు... పొడిగింపుపై జారీ కానీ జీవో
- కొనసాగుతున్న సందిగ్ధత

సాక్షి, విశాఖపట్నం :

సిట్ విచారణ గడువు సోమవారంతో ముగిసింది. దశాబ్దాల నాటి రికార్డులతో ముడిపడి ఉండడం... ఒకేసారి నాలుగైదు విభాగాలకు చెందిన రికార్డులను అధ్యయనం చేసి, క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత కానీ ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో దర్యాప్తు ఆశించిన వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు నాన్ సిట్ పరిధిలో 105, సిట్ పరిధిలో 106 అర్జీలను మాత్రమే పరిష్కరించగలిగారు. విశాఖ భూ కుంభకోణంపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 20న జీవో జారీ చేయగా... దర్యాప్తు మాత్రం 28 నుంచి ప్రారంభమైంది. జారీ చేసిన జీవో తేదీని పరిగణనలోకి తీసుకుంటే సిట్ గడువు ముగిసి వారం రోజులు దాటిపోయింది. పోనీ దర్యాప్తు ఆరంభమైన తేదీని పరిగణనలోకి తీసుకుంటే సోమవారంతో గడువు ముగిసింది. గడువు పొడిగింపుపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడక పోవడంతో సందిగ్ధత కొనసాగుతోంది. జీవో జారీ తేదీకి ముందు రోజే గడువు పొడిగింపుపై సిట్ చీఫ్ లేఖ రాసినా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ వివరణ కోరగా గడువు పొడిగింపుపై ఇంకా ఉత్తర్వులు వెలువడలేదని, అయితే ప్రభుత్వం వద్ద ఫైల్ సర్క్యులేట్ అవుతుందని, ఒకటి రెండ్రోజుల్లోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు



సిట్ కార్యాలయం

వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. తుదపరి ఉత్తర్వులు వచ్చే వరకు విచారణ ఆపే ప్రసక్తే లేదని, తమ పని తాము చేసుకు పోతున్నామని చెప్పుకొచ్చారు. మరో వైపు సిట్ సిఫార్సులను పరిశీలిస్తే కబ్జాకోరులతో కుమ్మక్కై అధికారుల ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారో తేటతెల్లమవుతోంది.

టీడీపీ వార్డు అధ్యక్షుని భూ కబ్జా

టీడీపీ 40వ వార్డు అధ్యక్షుడు ఎండీ జకీరుద్దీన్ మద్రిపాలెంలోని సర్వే నెం.86, 99లో ఉన్న కోట్లాది రూపాయల విలువైన యూఎల్‌సీ స్థలానికి సంబంధించిన రికార్డులను టాంపర్ చేసి మరీ కబ్జా చేశారు. 1981 డిసెంబర్‌లో జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్‌లో ఆ భూములు యూఎల్‌సీ ల్యాండ్స్‌గా ప్రకటించారు. అయినా సరే అధికారుల అండదండలతో అడ్డగోలుగా ఆ భూముల్లో పాగా వేశారు.

సిట్ చర్యలు : ఈ వ్యవహారంపై కోర్టులో వాజ్యం ఉన్నందున తక్షణమే ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ కావాలని ఆదేశించింది. సర్వే నెం. 86/2ఏ1,2,3, 86/2బీ2,3,4, 2బీఏ,2బీ1బీలలో ఉన్న యూఎల్‌సీ ల్యాండ్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

చెరువును కబ్జా చేసేశారు

నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామంలో సర్వే నెం.562/4లో ఉన్న 4.40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుడివాడ చెరువును తోటకూర రామరాజు అనే వ్యక్తి ఆక్రమించుకున్నారు. అక్కడితో ఆగకుండా ఆ చెరువు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం పొందారు. చెరువు కబ్జా విషయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత నర్సీపట్నం ఆర్డీవో, తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన చినబాబు సిట్‌కు ఫిర్యాదు చేశారు.

సిట్ చర్యలు : వాటర్ బాడీస్‌ను రక్షించాల్సిన అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేయడం పట్ల సిట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గుడివాడ సత్యవతి పేరిట జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ రద్దు చేయాలని ఆదేశించింది. బాధ్యులైన అధికారులతో పాటు ఆక్రమణదారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమునిపట్నం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. విశాఖ ఎంవీపీ కాలనీలో ఉంటున్న కర్రోతు మోహన్‌కృష్ణ(50) పూర్ణామార్కెట్‌లో కొబ్బరి బొండాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వినాయక చవితి రోజున భీమిలిలోని బంధువులను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తుండగా బీచ్‌రోడ్డులోని కె.నగరపాలెం సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గర్తించి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


మళ్ల లక్ష్మి సంధ్యాదేవి (ఫైల్)

సీతమ్మధార : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూ కాలనీ శ్రీకన్య థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న వివాహిత మళ్ల లక్ష్మి సంధ్యాదేవి (28) ఈ నెల 23న ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి బుద్దా కాళిదాస్ ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ భాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తమ కుమార్తెకు ఫిట్స్ ఉందని పేర్కొన్నారు.

ఎలుకల మందు తాగి యువకుడి ఆత్మహత్య

అల్లిపురం (విశాఖ దక్షిణం) : ఎలుకల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జీవీ రమణ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కోర్టు ఎదురుగా గల ఎస్‌బీఐ కాలనీకి చెందిన మైలపల్లి స్వామిశేఖర్(29) అనకాపల్లి సర్కిల్ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి చోడవరం ప్రాంతానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతోపాటు స్వామిశేఖర్ అనుచిత ప్రవర్తన వల్ల ఆరునెలల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శేఖర్ మనస్తాపానికి గురై మద్యానికి బానిసగా మారిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో శేఖర్ ఎలుకల మందు తాగటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని సోదరుడు అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పైపులైన్ మరమ్మతులు వాయిదా

ద్వారకానగర్ : రైవాడ నుంచి నగరవాసులకు మంచినీరు సరఫరా చేసే గ్రావిటీ పైపులైన్ మరమ్మతులు ఆగస్టు 28, 29వ తేదీలలో నిర్వహించాలని ముందు నిర్ణయించినప్పటికీ మళ్లీ వాయిదా వేసినట్లు జీవీఎంసీ మంచినీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు బి.కేశవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, వర్షాల వల్ల మరమ్మతులను వాయిదా వేశామని తెలిపారు. మరలా ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని తెలిపారు. బుచ్చిరాజుపాలెం, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు కూడలి, గోపాలపట్నం పరిసర ప్రాంతాలు, మాధవధార, మురళీనగర్, మద్రిపాలెం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, సీతమ్మధార పంపు హౌస్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, హెచ్‌బీ కాలనీ ప్రాంతం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, ఏఎస్‌ఆర్ నగర్, కంచరపాలెం మెట్ట, హైవేకు ఇరువైపులా గల ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు. ఎప్పటిలాగే రోజూ నీరు సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్ట్

పెదవాల్తేరు (విశాఖ తూర్పు) : భార్యను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలో గల హెచ్‌బీ కాలనీ దుర్గానగర్‌లో 18 రోజుల క్రితం పరిమలశ్రీ(22) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి తండ్రి సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా పరిమలశ్రీ భర్త రాజగిరి భీమేష్(27) ఉద్యోగం చేయకుండా ఇంట్లో ఉంటూ భార్యను వేధించడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని తేలింది. ఈ మేరకు భీమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఎంవీపీ పోలీసులు తెలిపారు.

వృద్ధురాలికి గాయాలు

కశింకోట(అనకాపల్లి): మండలంలోని బయ్యవరం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. అదనపు ఎస్‌ఐ టి.నరసింగరావు అందించిన వివరాల ప్రకారం.. విసన్నపేట గ్రామానికి చెందిన దాసరి అచ్చియ్యమ్మ (60) అనకాపల్లిలో పెరుగు అమ్ముకొంటూ జీవనం సాగిస్తోంది. పెరుగు తయారీకి అవసరమైన పాల కోసం కశింకోట వచ్చి,తిరిగి తనగ్రామం వెళుతూ బయ్యావరం వద్ద రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స జరిపించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు స్థలంపై సమీక్ష

విశాఖ స్పోర్ట్స్ : విశాఖకు కేటాయించిన ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణలో జాప్యం జరుగుతున్నందున ప్రత్యామ్నాయ స్థలాల కోసం క్రీడల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం సమీక్ష చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉడా వీసీ బసంతకుమార్, జాయింట్ కలెక్టర్ సృజన, జిల్లా అధికారులు పాల్గొన్నారు. గండిగుండంలో స్థల సేకరణ జాప్యం కానున్నందున ప్రత్యామ్నాయ స్థలం కోసం చర్చించారు. కొమ్మాదిలో క్రీడల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నిర్మించడం కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కావాల్సిన స్థల లభ్యతపై ఆనందపురం తహసీల్దార్ ఈశ్వరరావు వివరించారు. నగరం వెలుపల ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను కలెక్టర్‌కు తహసీల్దార్ భాస్కరరెడ్డి గూగుల్ మ్యాప్‌ల ద్వారా వివరించారు. నగరం వెలుపల స్థలాభావం నెలకొన్నందున మరింత మెరుగైన స్థలం కోసం అన్వేషిస్తే బాగుంటుందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అభిప్రాయం వ్యక్తం చేశారు.

యారాడ, అగనంపూడిలో పరిశీలన


సమీక్షలో ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్,జేసీ సృజన

సమీక్ష అనంతరం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అధికారులను వెంటబెట్టుకుని యారాడ, అగనంపూడి ప్రాంతాలను సందర్శించారు. ఈ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఉడా వీసీ బసంతకుమార్, జాయింట్ కలెక్టర్ సృజన, ట్రైనీ కలెక్టర్ స్మితాసింగ్, డీఎస్‌డీవో జాన్‌గాలియట్, ఉడా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీటీసీ సభ్యుడికి రెండేళ్ల జైలు శిక్ష

సబ్బవరం : ఓ మహిళను మోసం చేసిన కేసులో సబ్బవరం మండలం వంగలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావుకు రెండేళ్ల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ అనకాపల్లి పదో అదనపు సెషన్స్ జడ్జి నాగేశ్వరరావు తీర్పు చెప్పారని సబ్బవరం ఏఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి మండలం శారదనగర్‌కు చెందిన ఉప్పలపాటి వెంకట సూర్యనారాయణ భార్య మహాలక్ష్మి కొన్నేళ్ల క్రితం శ్రీనివాసరావుకు రూ.35 లక్షలు అప్పుగా ఇచ్చారు. అనంతరం అప్పుగా ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వమని కోరినా ప్రయోజనం లేకపోవడంతో 2015 ఆగస్టు 15న తన అక్కతో కలిసి వంగలి వెళ్లి శ్రీనివాసరావును తన అప్పు తీర్చమని కోరింది. అందుకు కోపగించిన శ్రీనివాసరావు తమపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడని మహాలక్ష్మి సబ్బవరం పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టుకు నివేదించారు. విచారణ అనంతరం గత ఏడాది ఏప్రిల్‌లో శ్రీనివాసరావుకు రెండేళ్ల జైలు, రూ.2 వేల జరిమాన విధిస్తూ అనకాపల్లి రెండో అదనపు మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. అయితే ముద్దాయి శ్రీనివాసరావు అప్పీలు చేసుకోగా సోమవారం అనకాపల్లి పదో అదనపు సెషన్స్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు పూర్వపరాలను పరిశీలించి దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు నిందితుడిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారని ఏఎస్‌ఐ చిరంజీవి చెప్పారు.


యర్రా శ్రీనివాసరావు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయానికి ర్యాలీగా తరలివస్తున్న విద్యుత్ ఒప్పంద ఉద్యోగులు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల కన్నెర్ర

- క్రమబద్ధీకరణ హామీ నెరవేర్చకపోవడంపై ఆగ్రహం
- ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన ఆందోళన

సీతమ్మధార(విశాఖ ఉత్తర): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు కన్నెర్ర చేశారు. ఎన్నికల హామీని నెరవేర్చకపోవడంపై మండి పడ్డారు. తమకు ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ మేరకు సోమవారం మద్దిలపాలెం కళాభారతిలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సభకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 1200 మంది కార్మికులు తరలివచ్చారు. సభ అనంతరం వీరంతా ర్యాలీగా తరలివెళ్లి సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.కాశీమధుబాబు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు నిత్యం శ్రమించి సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంటే యాజమాన్యం మాత్రం వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో కాంట్రాక్టు కార్మికుల్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని చెప్పారు. సంస్థలో 25 వేల మంది కార్మికులు పనిచేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీ విద్యుత్ శాఖ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడో పార్టీ ఒప్పందం వ్యవస్థను రద్దు చేసి సుప్రీంకోర్టు ఉత్తర్వులు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరంతరం రాష్ట్రంలోని ఇళ్లలో కరెంట్ వెలుగులు నింపుతున్న కాంట్రాక్టు కార్మికుల ఇళ్లలో చీకట్లు అలముకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంస్థ అధికారులు శేషుకుమార్, చంద్రశేఖర్ కార్మికులతో చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో బీసీ సంఘం అధ్యక్షుడు జె.కృష్ణమూర్తి, వివిధ పర్మినెంట్ ట్రేడ్ యూనియన్ నాయకులు, అసోసియేషన్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి

పెదవాల్తేరు(విశాఖ తూర్పు): రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పని చేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ధర్నాకు ముందుగా కళాభారతిలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వడంలేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంలేదని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ విధి నిర్వహణలో చనిపోయిన ఒప్పంద కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షలు నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఉత్తర్వులు జారీ కాలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నాయకులు

కేజీహెచ్ కాంట్రాక్టర్‌ను తొలగించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): లైంగిక వేధింపులకు పాల్పడిన కేజీహెచ్ కాంట్రాక్టర్‌ను వెంటనే తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని యల్లమ్మతోటలో ఉన్న నండూరి ప్రసాదరావు భవన్‌లో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. కేజీహెచ్‌లో 250 మంది కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లుగా కేజీహెచ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఓ మహిళ పట్ల కాంట్రాక్టర్, పీఆర్వో ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడడంతో ఆమె అట్రాసిటీ యాక్ట్ కింద కేసు పెట్టిందని, సాక్ష్యాధారాలు ఉండడంతో పోలీసులు ఆయనను జైలుకు పంపారని తెలిపారు. అయితే ఆమెపై కక్షతో అక్రమంగా ఉద్యోగం నిలిపి వేశారని చెప్పారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడుతున్న దళిత మహిళకు అండగా ఉండాల్సిన కేజీహెచ్ అధికారులు, కార్మిక సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, కేవీపీఎస్ అధ్యక్షుడు ఆర్పీ రాజు, ఉపాధ్యక్షుడు వై.రాజు, ఐద్వా నగర కార్యదర్శి ఆర్.ఎన్.మాధవి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ ప్రతినిధి ఎం.సుబ్బారావు, ఏపీఎంఎస్ఆర్‌యూ ప్రతినిధి కె.వి.పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

వర్షంలోనూ క్యూకట్టిన అర్జీదారులు

- గ్రీవెన్స్ సెల్‌కు 208 ఫిర్యాదులు
- డయల్ యువర్ కలెక్టర్‌కు 13 ఫోన్ కాల్స్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు):

వర్షంలో కూడా కలెక్టరేట్ అర్జీదారులతో కిటకిటలాడింది. సోమవారం ఉదయం నుంచి వర్షం పడుతున్నా లెక్కచేయకుండా తమ సమస్యలు విన్నవించుకునేందుకు అర్జీదారులు క్యూకట్టారు. 208 ఫిర్యాదులు గ్రీవెన్స్ సెల్‌కు అందాయి. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన అర్జీదారులు నుంచి వినతులను స్వీకరించారు. వచ్చిన వినతుల్లో ఎక్కువగా గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 కాల్స్

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 మంది అర్జీదారులు ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వెలడించారు. జేసీ సృజన ఫోన్ ద్వారా అర్జీదారుల నుంచి వినతులు తీసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు సత్వరమే వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతులు అందిస్తున్న అర్జీదారులు

జీవీఎంసీ గ్రీవెన్ సెల్‌కు 72 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ మూర్తి

ద్వారకానగర్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 72 ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ అదనపు కమిషనర్ జి.వి.వి.ఎస్.మూర్తి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తూ.. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన 72 ఫిర్యాదుల్లో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 25 ఫిర్యాదులు, ఒకటో జోన్‌కు 9, నాలుగో జోన్‌కు 3, ఐదో జోన్‌కు 30, ఆరో జోన్‌కు 5 ఉన్నాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్‌కు 30, ప్రజారోగ్య విభాగానికి 4, ప్రధాన ఇంజినీరు విభాగానికి 22, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ విభాగానికి 12, అదనపు కమిషనర్ (జనరల్) సీ–సెక్షన్‌కు 1, ఇతర వాటికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయి.

డయల్ యువర్ కమిషనర్‌కు 18 ఫిర్యాదులు

జీవీఎంసీ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 18 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ సమాధానం చెప్పారు. ఒకటో జోన్‌కు 2, మూడో జోన్‌కు 6, నాలుగో జోన్‌కు 1, ఐదో జోన్‌కు 4, ఆరో జోన్‌కు 3, అనకాపల్లి జోన్‌కు 1, అసిస్టెంట్ ఇంజినీరు(ఐటీ) విభాగానికి 1 ఫిర్యాదులు అందాయి. క్షేత్ర పర్యటనలో ఈ అర్జీలపై పరిశీలన జరిపి మూడు రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను వర్మ ఆదేశించారు.

ఎదగాలంటే భయం

మొక్క విలాపం



కొమ్మలు నరికేయడంతో మిగిలిన మోడు

ఆనందపురం: హలో ఫ్రెండ్స్.. నేను మొక్కను. విత్తు వేసిన నాటి నుంచి ఎంత చక్కగా నన్ను సంరక్షించారు. చక్కగా నీళ్ల పోస్తున్నారు. పశువులు మా దరికి రాకుండా చుట్టూ ఫెన్సింగ్ కట్టారు. ఎంతో అపురూపంగా పెంచుతున్నారని మురిసిపోయాను. కార్బన్‌డయాక్సైడ్ పీల్చి ఆక్సిజన్‌ను విడుదల చేస్తానని, కాలుష్యాన్ని తగ్గిస్తానని నా ప్రాధాన్యాన్ని గుర్తించారు కదా అని ఆనందించాను. మీ సంరక్షణతో నేనూ చక్కగా పెరుగుతున్నాను. నా పక్కన ఉన్న చెట్లు కూడా నీడనిస్తూ ఠీవీగా నిలబడి ఉండేవి. వాటిని చూస్తే భలే ధైర్యంగా ఉండేదిలే. పెద్దవాళ్లుంటే ఆ భరోసా వేరు కదా..

ఇంతలో ఒకరోజు..

ఆ రోజు తలచుకుంటేనే నాకు భయమేస్తోంది. ఎవరో విద్యుత్ శాఖ సిబ్బంది అట వచ్చారు. పైన విద్యుత్ లైన్లకు తగులుతున్నాయంటూ గొడ్డళ్లతో నా కళ్ల ముందే చెట్టు కొమ్మలను విచక్షణారహితంగా నరికేసి మోడు చేసేశారు. కన్నీరుమున్నీరైన ఆ చెట్టు బాధ నన్ను కలవరపరిచింది. జీవచ్ఛవంలా మిగిలిన దానిని చూస్తే కళ్లనీళ్లు తిరిగాయి. తననే కాదు ఇంకా.. ఆనందపురం జంక్షన్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా లొడగలవానిపాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా మూడేళ్లుగా పెంచిన 20 మొక్కలను చెట్లయ్యాక ఇలాగే నరికేశారంట. గొట్టిపల్లి, కుసులువాడ, గుడిలోవ, తర్లువాడ, వేములవలస అన్నిప్రాంతాల్లోనూ ఇలాగే తొలగించామని ఆ సిబ్బంది చెప్పుకుంటుంటే విన్నాను. నా పై ప్రాణాలు పైనే పోయాయి. అమ్మో.. ఎదిగితే నన్ను కూడా ఇలాగే చంపేస్తారేమో?



పెరిగితే.. వైర్ల కింద ఉన్నానని నన్నూ నరికేస్తారుగా..

తప్పు మీది.. శిక్ష మాకా?

అసలు ముందు మమ్మల్ని విద్యుత్ లైన్ల కింద ఎందుకు వేశారు? పెరిగాక ఎందుకు చంపేస్తున్నారు. ముందే సురక్షిత ప్రాంతాల్లో వేయవచ్చు కదా. మీకు ఖర్చు తగ్గుతుంది కదా. ఏపుగా పెరగాలంటేనే భయం వేస్తుంది. ఏం చేయగలను నేను? మీ అనాలోచిత చర్యలకు మమ్మల్ని బలి చేస్తారా? తప్పు మీది.. శిక్ష మాకా? ఇదేమి న్యాయం?

సమాచార భద్రతకు సైబర్ సేవలు అవసరం



సంగివలస అనిట్స్‌లో వర్క్‌షాపులో పాల్గొన్న అవధాని

తగరపువలస: ప్రస్తుత సమాజంలో అన్ని పరికరాలు కృత్రిమ మేధస్సుతో పని చేస్తున్నాయని, దీని ద్వారా వచ్చే సమాచారం పొందుపరచడానికి సైబర్ సేవలు అవసరమని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.అవధాని అన్నారు. సంగివలస అనిట్స్‌లో ఐటీ విభాగం సోమవారం ప్రారంభమైన 'సైబర్ సెక్యూరిటీ..ఎథికల్ హాకింగ్' వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. సైబర్ విజ్ఞానం నేర్చుకోవడానికి మన వద్ద మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి వర్కుషాపుల ద్వారా యువ సైబర్ సైన్యాన్ని తయారుచేసుకోవచ్చన్నారు. కళాశాల ఐటీ విభాగాధిపతి సురేష్ చిట్టినేని మాట్లాడుతూ సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు ఈ వర్కుషాపు ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ టీవీ హనుమంతరావు మాట్లాడుతూ యువకులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ పరికరాల భద్రత సైబర్ సెక్యూరిటీల వలనే సాధ్యమన్నారు. కళాశాల డైరెక్టర్ ఆర్.గోవర్ధనరావు, అధ్యాపకుడు మహేష్‌రాజు, జి.శ్రీనివాస్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-1 గ్రీవెన్స్‌కు వర్షం ఎఫెక్ట్



జెడ్సీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మధురవాడ: జీవీఎంసీ జోన్-1 మధురవాడ కార్యాలయంలో సోమవారం జెడ్సీ పీఎం సత్యవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వాణికి 9 అర్జీలు మాత్రమే వచ్చాయి. వర్షం కారణంగా అర్జీదారుల రద్దీ తగ్గింది. ఇంజినీరింగ్ విభాగానికి 2, పట్టణ ప్రణాళికా విభాగానికి 3, పారిశుద్ధ్య విభాగానికి 2, తాగునీటి సరఫరా, విద్యుత్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ నేత గుమ్మడి మధు, పౌర సంక్షేమ సంఘం గౌర వాధ్యక్షుడు మల్లువలస జగదీశ్వరరావు ఫిర్యాదులు ఇచ్చిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి యోగా ఉచిత శిక్షణ

కొమ్మాది: యోగభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉచిత యోగ తరగతులు ప్రారంభం కానున్నాయని యోగ గురువు పైడం నాయుడు తెలిపారు. జీవీఎంసీ నాలుగోవార్డు కొమ్మాది ఆశీర్వాద్ నిలయంలో ఉదయం 5.30 నుంచి 6 గంట వరకు, సాయంత్రం 5.15 నుంచి 6.15 వరకు.. పీఎంపాలెంలో ఉదయం 10.15 నుంచి 11.15 వరకు తరగతులు నిర్వహించనున్నామని చెప్పారు. 9866621269 నంబరుకు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

మరికొన్ని జోన్ వార్తలు 14లో

నిరక్షరాస్యుల జాబితా సిద్ధం చేయండి

పద్మనాభం: ఎనిమిదో విడత సాక్షరభారత్ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి నుంచే వయోజన నిరక్షరాస్యుల జాబితాను సిద్ధం చేసుకోవాలని జిల్లా లోక్ శిక్షా సమితి అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుగుణాకరరావు గ్రామ కో-ఆర్డినేటర్లకు సూచించారు. మండలంలోని అనంతవరంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీకి 60 మంది చొప్పున 18 నుంచి 65 ఏళ్ల లోపు వయసు గల నిరక్షరాస్యులను గుర్తించి జాబితాలను రూపొందించుకోవాలన్నారు. అందరూ అక్షరాస్యులు కావాలని కోరుతూ గ్రామంలో సాక్షర భారత్ గ్రామ కో-ఆర్డినేటర్లు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ కె.పైడినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగణాకరరావు

అక్రమంగా తరలిస్తున్న పెయ్యిదూడలు పట్టివేత


ఆనందపురం : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న దూడ పెయ్యిలను సోమవారం పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనలో ఇరువురి పై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, బుడుమూరు నుంచి 10 దూడ పెయ్యిలను వ్యాన్‌లో ఎక్కించి విశాఖ వైపు తరలిస్తున్నారు. కాగా విజయనగరానికి చెందిన గో సంరక్షణ సమితి ప్రతినిధులు వ్యాన్‌ను వెల్లంకి జాతీయ రహదారిపై అడ్డుకుని పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేవని తెలుసుకొని వ్యాన్‌తో సహా దూడ పెయ్యిలను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు దూడ పెయ్యిలు కబేళాకు తరలిస్తున్నట్టు అనుమానించిన పోలీసులు ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దూడ పెయ్యిలను జంతు రక్షణ శాలకు అప్పగించడానికి నిర్ణయించారు. కేసును ఎస్‌ఐ ఎన్.గణేష్ దర్యాప్తు చేస్తున్నారు.

మంగమారిపేటలో వెలుగులు

కొమ్మాది: భీమిలి రూరల్ మండలం కె. నగరపాలెం పంచాయతీ మంగమారిపేటలో రెండు నెలలుగా అనేక చోట్ల వీధి లైట్లు స్తంభాలకు వేలాడుతూ ప్రమాద స్థాయిలో ఉన్న ఈ లైట్లను ఎట్టకేలకు అధికారులు స్పందించి సరిచేశారు. 24న లైట్లను సరిచేయరూ అనే శీర్షికతో సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు సోమవారం పలు చోట్ల వెలగని వీధి లైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



నాడు



నేడు

మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పద్మనాభం: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో కన్వీనర్ రెడ్డిపల్లి జగదీష్ బాబు పిలుపునిచ్చారు. మండల విద్యావనరుల కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం మిలియన్ మార్చ్ పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు విడుదల చేశారు. జగదీష్‌బాబు మాట్లాడుతూ పెన్షన్‌ను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులంతా కార్యక్రమంలో పాల్గొని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంపై వ్యతిరేకతను వ్యక్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బోని సూర్యనారాయణ, బోని సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన తప్పనిసరి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఈఎస్‌ఐ చిట్టివలస బ్రాంచ్ బీఎం రఘునాథ్

తగరపువలస: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐ) చిట్టివలస బ్రాంచ్ మేనేజర్ రఘునాథ్ సూచించారు. సంక్షేమ పథకాలపై స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. కార్మికులకు వర్తించే పథకాలు, బీమా సదుపాయాల గురించి వివరించారు. ఇటీవల కార్మిక చట్టాల్లో వచ్చిన సవరణలు తెలియజేశారు. కార్యక్రమంలో భీమిలి పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు కార్మికులతో పాటు ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వైద్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అక్రమాలపై 67 ఫిర్యాదులు

- సీఎం డ్యాష్ బోర్డులో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులు
- విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

విశాఖసిటీ :

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అక్రమ అంతస్తుల రూపంలో ఎదిగిపోతోంది. అనుమతుల మంజూరు విషయంలో దోచుకోవడమే తమ ప్రథమ ఉద్యోగంగా భావిస్తూ పనులు చక్కపెట్టుకుంటున్న ఘనులు పెరిగిపోతున్నారు. అక్రమంగా ఫ్లోర్లు నిర్మించుకునేందుకు బాహాటంగానే బేరసారాలు సాగించేస్తూ.. అందినకాడికి దోచుకుంటున్నారు. గ్రీవెన్స్‌లో ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల అవినీతి వ్యవహారాలపై ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై చర్యలు మాత్రం శూన్యమనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో సీఎం డ్యాష్ బోర్డుకు ఫిర్యాదులు చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది. వివిధ విభాగాలకు సంబంధించి సీఎం డ్యాష్ బోర్డుకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయవచ్చు. నేరుగా అమరావతిలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా డ్యాష్ బోర్డుకు ఫిర్యాదులు వెళ్తాయి. అక్కడి అధికారులు ఫిర్యాదుల్ని పరిశీలించి వివిధ విభాగాలకు ఫిర్యాదుల జాబితాను పంపిస్తారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి తదుపరి చర్యల్ని తిరిగి డ్యాష్ బోర్డుకు సంబంధిత అధికారులు పంపించాలి. ఇలా డ్యాష్ బోర్డుకు ఫిర్యాదులు చెయ్యొచ్చని తెలుసుకున్న నగరవాసులు నేరుగా అక్కడికే ఫిర్యాదులు చేసేస్తున్నారు. ఈ మధ్య కాలంలో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంపై 67 ఫిర్యాదులు వెళ్లాయి. వీటిని పరిశీలించి టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులకు డ్యాష్ బోర్డు నుంచి జాబితా వచ్చింది. వాటిపై విచారణ ప్రారంభించారు. చాలా ఫిర్యాదుల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అవినీతి అంశాల్ని స్పష్టంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఏ పనికి ఏ ఉద్యోగి ఎంత లంచం అడిగారు.. ఎప్పుడిచ్చారనే విషయాల్ని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ మొత్తం 67 ఫిర్యాదులపై టౌన్ ప్లానింగ్ విభాగ ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఫిర్యాదులు చేసిన వారిని పిలిపించి.. ఉద్యోగులు ఎలా అవినీతికి పాల్పడ్డారో వివరంగా చెప్పాలని విచారణ అడుగుతున్నారు. మొత్తం ఫిర్యాదులపై విచారణ చేపట్టి.. నిజానిజాలు నిర్ధారించుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

వ్యాపారవేత్త దేవళ్లు కన్నుమూత

ద్వారకానగర్ (విశాఖ దక్షిణ): నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కేతవరపు దేవళ్లు (83) సోమవారం ఉదయం ద్వారకానగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయన ప్రస్తుతం ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య హోటల్ చైర్మన్‌గా, గాజువాకలో కన్య, శ్రీకన్య థియేటర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం జీవితకాల సభ్యునిగా, వాసవిక్లబ్ సభ్యునిగా కొనసాగున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. దేవుళ్ల భౌతికకాయాన్ని ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాస్, సాయిరాం హోటల్స్ అధినేత సత్యనారాయణ, నగరానికి చెందిన పలువురు వ్యాపారవేత్తలు, సినిమా థియేటర్ల యజమానులు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం

ముంచంగిపుట్టు : ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం తిరిగి ఉత్పత్తి ప్రారంభించింది. ఈ విద్యుత్ కేంద్రం 1,2,4,5 నంబర్లు గల జనరేటర్‌ల సహాయంతో 75 మెగావాట్లు విద్యుదుత్పత్తి జరుగుతోంది. శనివారం మధ్యాహ్నం నుంచి సాంకేతిక కారణాలతో ఇక్కడ విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. బొడ్డవరం వద్ద ఫీడర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో మాచ్‌ఖండ్‌లో వినియోగంలో ఉన్న 1,2,4,5 జనరేటర్లపై దాని ప్రభావం పడి అవి మొరాయించాయి. ప్రాజెక్టు సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఆదివారం ఉదయనికి నాలుగు జనరేటర్‌లు వినియోగంలోకి తిసుకు వచ్చారు. బలిమెలకు 6వేల క్యూసెక్కులు నీరు విడుదల..



ప్రమాదస్థాయికి చేరిన డుడుమ జలాశయం

ఈ విద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ జలాశయంలో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. డుడుమ జలాశయం నీటి సామర్థ్యం 2590 అడుగులు కాగా సోమవారం నాటికి 2589 అడుగులు నమోదు అయింది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది 7,8 నంబర్లు గేట్లు ఎత్తి వేసి బలిమెల రిజర్వాయర్‌కు 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పలకాలి అందరి నోట.. తెలుగు మాట



నేడు తెలుగు భాషా దినోత్సవం

'పంచదార కన్న పనస తొనల కన్న
తీయని తేనె కన్న తెలుగు మిన్న'

తెలుగు భాషలోని మాధుర్యాన్ని చాటిచెప్పే పదబంధమిది. భాషలోని ఆ తీయదనం చవిచూడాలే తప్ప మాటలకందని భావమది. అమ్మదనం నిండిన తెలుగులో ప్రతిపదం అర్థవంతం. కొల్లలుగా వస్తున్న కొత్త పదాలను కూడా స్వాగతించి, ఆతిథ్యమిచ్చి తనలో కలుపుకొని మరింత విస్తృతమైంది. అంతటి విశాల మనసు గల మన అమ్మభాషను పరభాషా వ్యామోహంతో దూరం చేసుకుంటే మన అస్తిత్వానికే ముప్పు వాటిల్లగలదు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం. కేవలం పండితులకే పరిమితమైన ఆంధ్రసాహిత్యం సామాన్యులకూ అర్థం కావాలని తపించి, వ్యావహారిక భాష కోసం ఉద్యమించి, విజయం సాధించారు గిడుగు రామ్మూర్తి పంతులు. ఆయన జయంతి రోజు ఆయన తపనను మనందరం స్మరించుకోవాలి. తెలుగువారంతా భాషాసంరక్షణకు నడుం బిగించాలనేదే భాషా ప్రియుల ఆకాంక్ష.

- విశాఖ-కల్చరల్

పండితులు కొనియాడిన భాష

'ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాల్పస్య తపసఫలం'
తెలుగు వాడిగా పుట్టడం, తెలుగు భాష మాట్లాడటం ఎన్నో ఏళ్ల తపస్సు ఫలం' అని కొనియాడారు తమిళ పండితుడు అప్పయ్య దీక్షితులు. అంతటి కమ్మనైన భాషను సజీవం చేయవలసిన బాధ్యత మనందరిదీ.

తెలుగు భాష రక్షణ ఇలా..

- తెలుగు భాష కుటుంబం నుంచే అమలు కావాలి.
- తెలుగు రచయితలను ప్రోత్సహించాలి. వారు రాసిన పుస్తకాలను ముద్రించి సమాజానికి అందించాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాల్లో తెలుగులోనే మాట్లాడాలనే నిబంధనలు రావాలి.
- తెలుగు ఔన్నత్యాన్ని పాఠ్యగ్రంథాల్లో ప్రవేశపెట్టాలి.
- విద్యార్థి దశ నుంచే మాతృభాషపై మమకారం పెంచాలి.
- తెలుగు కావ్యాల్లోని సామాజిక గతాన్ని సమాజానికి చాటి చెప్పాలి.
- తెలుగు గ్రంథాలయాన్ని విస్తృతంగాఏర్పాటు చేయాలి.
- జానపదాలు, జానపద కళాకారులపై విస్తృత ప్రచారం చేయాలి.
- తెలుగు సాహిత్యంలో పరిశోధనలు కొనసాగాలి.

తెలుగుకు పూర్వ వైభవం తేవాలి



తెలుగు భాష ఖ్యాతి ఈనాటిది కాదు. ప్రపంచ దేశాల్లో ఆనాడే తెలుగు వైభవాన్ని చాటి చెప్పారు. అంతటి ఘనచరిత గల తెలుగు అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరడం బాధాకరం. తెలుగు భాష పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. విస్తృత కార్యక్రమాలు చేపట్టాలి.

–రామతీర్థ, సాహితీవేత్త

తెలుగు సాహిత్యాన్ని సమాజానికి అందించాలి



తెలుగు భాష దినదినాభివృద్ధి చెందాలంటే సాహిత్యం అత్యుత్తమ స్థాయిలో రాణించాలి. ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు విశిష్ట స్థానం ఉంది. తెలుగు కవులను ప్రోత్సహించి, వారు రచించిన పుస్తకాలను ప్రభుత్వమే అచ్చు వేయించాలి.

– శేఖరమంత్రి ప్రభాకరరావు, కార్యదర్శి, సహృదయ సాహితీ సంస్థ

పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి చేయాలి



ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు మాట్లాడితే నేరమన్నట్టు శిక్ష విధిస్తున్నారు. ఇది మారాలి. కార్పొరేట్ పాఠశాలల్లో సైతం ఆరో తరగతి వరకు తెలుగు తప్పనిసరి చేయాలి. పరభాషా వ్యామోహంలో నేడు తెలుగును ప్రజలకు దూరం చేస్తున్నారు. తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి.

–నరవ ప్రకాశరావు, విద్యాహక్కుచట్టం రాష్ట్ర కన్వీనర్

భాషా పరిరక్షణ అత్యవసరం



తెలుగు భాషా ప్రాభవ వర్ణన అక్షరాలకు అందనిది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు ఎంతో విశిష్టత ఉంది. అంతటి తెలుగు నేడు ఆంగ్లభాషా మమకార సుడిలో గతి తప్పుతోంది. మన భాషను పరిరక్షించుకోకపోతే కాలగర్భంలో కలసిపోయే ప్రమాదం ఉంది.

– వృద్ధుల కల్యాణ రామారావు, సాహితీవేత్త, సాహిత్య సురభి వ్యవస్థాపకులు

మొదటి భాషగా గుర్తించాలి



తెలుగువారి సహృదయత, సాహితీరసికత, నిరుపమానం. తెలుగు భాషను పరిపాలనా భాషగా అమలు చేయాలి. ప్రభుత్వ శాఖలు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నడపాలి. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు తెలుగుభాషను మొదటి భాషగా గుర్తించాలి. తెలుగు నిఘంటువులు, వ్యాకరణాలు కొత్తవి తీసుకు రావాలి. అప్పుడే వ్యవహారిక భాషాసాహిత్యం సుసంపన్నమవుతుంది.

–ప్రొ.వెలమల సిమ్మన్న, ఏయూ విశ్రాంత ఆచార్యులు

ప్రజా సహకారం అవసరం



తెలుగు భాషపై ప్రతి ఒక్కరికీ మమకారం, అంకిత భావం ఉండాలి. నిజమైన భావప్రేరణ, ప్రగతి, మాతృభాష వల్లే వస్తుంది. స్వభాషలో విద్య ఉంటే మనకు స్వరాజ్యం ఎప్పుడో వచ్చేదని గాంధీజీ ఆనాడే రాశారు. మాతృభాషలో విద్యాబోధన వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. మన తెలుగు భాషను పరిరక్షించుకుందాం. తెలుగును బోధనా భాషగా అమలు చేయడానికి ప్రజలు కూడా సహకరించాలి.

– పేరాం జయశీలరావు, సాహితీవేత్త.

ఉద్యమించాల్సిన తరుణం



ప్రస్తుతం భాష పరిస్థితి, మన వ్యవహారశైలి, ప్రభుత్వ విధానాలు భాష మనుగడకు విఘాతం కలించేలా ఉన్నాయి. ఆంగ్లంపై మోజు, ఆ భాష చదివితే తప్ప మనుగడ ఉండదన్న భయం మనల్ని తెలుగుకు దూరం చేస్తున్నాయి. తెలుగు రాయడం, చదవడం, తప్పుల్లేకుండా మాట్లాడటం నేటి రోజుల్లో కష్టమైపోతోంది. తెలుగు మాధ్యమ పాఠశాలలు మూతపడిపోతున్నాయి. ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అశనిపాతం లాంటిది. తెలుగు భాషలోని మాధుర్యాన్ని వర్ణిస్తూనో.. గొప్పతనాన్ని కీర్తిస్తూనో.. కాలయాపన చేయడానికి ఇది సందర్భం కాదు. భాషాభిమానులతో ఏకమై తెలుగు పరిరక్షణ కోసం ఉద్యమస్థాయిలో పనిచేయాల్సిన తరుణమిది.

–గరిమెళ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు, నవోదయ విద్యాలయ

అమ్మభాష అజరామరం కావాలి



దేశంలో ఎక్కడా లేని పోకడలు తెలుగు రాష్ట్రాల్లోనే కనిపిస్తున్నాయి. ఈ తీరు మారాలి. కమ్మనైన తెలుగు భాష శిరోధార్యం కావాలి. మేం ఆంగ్లభాషకు వ్యతిరేకం కాదు. కానీ ప్రాథమిక విద్యాబోధన అనేది తప్పనిసరిగా మాతృభాషలోనే జరగాలి. భావవ్యక్తీకరణ సులభతరమయ్యేది అమ్మభాషలోనే. అప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. చరిత్రను భావితరాలకు అందించే శక్తి భాషకే ఉంది. ఆంధ్రభాష అజరామరం కావాలి.

–ఫణిశయన సూరి, పరవస్తు పద్య పీఠం వ్యవస్థాపకుడు



నేటి కార్యక్రమాలు

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా నగరంలో నేడు నిర్వహించే కార్యక్రమాలు

- ఉదయం 9 గంటలకు భారతీయ తెలుగు సమితి ఆధ్వర్యంలో జడ్జి కోర్టు ఎదురుగా ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద 'పెద్ద బాలశిక్ష లక్ష ప్రతులు లక్ష్య దీక్ష'.
- ఉదయం 10 గంటలకు బీచ్‌రోడ్డులోని గిడుగు రామ్మూర్తి విగ్రహం వద్ద జయంత్యుత్సవం
- ఉదయం 10.15 గంటలకు: ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ బాబాపు భవన్‌లో పాఠశాల విద్యార్థులకు 'తెలుగు మాధ్యమం తొలగింపు అంగీకారమా? అనే అంశంపై వక్తృత్వ పోటీలు
- ఉదయం 10.30 గంటలకు మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవం
- సాయంత్రం 5 గంటలకు సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి 154వ జయంతి సందర్భంగా ప్రేమసమాజం ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం. సంస్కృతి పురస్కారాల ప్రదానం
- సాయంత్రం 5.30 గంటలకు సమైక్య భారతి సామాజిక, సాంస్కృతిక చైతన్య సంస్థ సారథ్యంలో వన్‌టౌన్‌లోని రీడింగ్ రూమ్ వద్ద గిడుగు రామ్మూర్తి జయంతి.



ఆకాశంలో సగం.. క్రీడల్లో సంపూర్ణం

నగరంలో పలువురు యువక్రీడాకారులు రాష్ట్ర, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ చాటుతున్నారు. కొందరు కుస్తీ పోటీల్లో పట్టుబట్టి పతకాలు సాధిస్తుంటే, మరి కొందరు బాక్సింగ్ పంచ్ విసిరి వన్నె తెస్తున్నారు. ఇంకొందరు కరాటే లో హు...హా అంటూ పతకాలు హారాలుగా మెడలో వేసుకుంటున్నారు.

- గోపాలపట్నం (విశాఖ పశ్చిమ)

క్రీడారంగంలో విశాఖ సత్తా చూపుతోంది. నగర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం పూర్తి స్థాయిలో లేకపోయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతున్నారు. స్పాన్సర్లు మరింత మంది ముందుకు వస్తే విశాఖ ఖ్యాతి ప్రపంచ నలుమూలలా చాటి చెబుతామంటున్నారు మన క్రీడాకారులు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు

బాక్సింగ్‌లో మాణిక్యం అన్నపూర్ణ



వేపగుంట ముత్యమాంబకాలనీకి చెందిన నాగల అన్నపూర్ణ బాక్సింగ్‌లో ఘనాపాటి. వేపగుంట జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదివినప్పటి నుంచే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. తండ్రి ఎన్.అప్పారావు కూలి అయినా బాక్సర్‌గా మంచి పేరుంది. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన తండ్రిని చూసి తానూ పతకాలు సాధించాలని అన్నపూర్ణ తపించింది. హైస్కూల్ దశలోనే బాక్సింగ్‌లో పంచ్ విసరడంలో పట్టు సాధించింది. జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించింది. పాటియాలాలో జరిగిన యూత్ నేషనల్స్ పోటీల్లో వెండి పతకం, పంజాబ్‌లో జరిగిన ఇంటర్‌యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో కాంస్యపతకం, కేరళలో జరిగిన 34 సీనియర్ నేషనల్ గేమ్స్‌లో ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఉత్తరాఖండ్‌లో జరిగిన యూత్‌నేషనల్స్‌లో రెండు మార్లు, జూనియర్‌నేషనల్స్‌లో రెండు మార్లు వెండి పతకాలు సాధించింది. అయితే ఇప్పుడీ విజేతకు కాలం అనుకూలించక ఇంటి కష్టాలు, ఆర్థిక ఇబ్బందులూ అడ్డొచ్చాయి. హటాత్తుగా తండ్రి మరణించారు. తోడబుట్టిన ఇద్దరు అక్కలు, తల్లితో కుటుంబ భారం దయనీయంగా మారింది. దీంతో అన్నపూర్ణ చదువు ఆపేసింది. నగరంలో ఓ కార్యాలయంలో నాలుగువేల జీతానికి చేరింది. చదవాలన్న ఆశ, బాక్సింగ్‌పై ఎంతో ఇష్టం ఉన్నా ఆమె తెచ్చే సంపాదనే ఇపుడు కుటుంబానికి ఆధారమవ్వడం ఆవేదన గొలుపుతోంది. ఇన్ని కష్టాల్లోనూ ఆమె బాక్సింగ్‌లో నేనున్నానని ఆరాటపడుతోంది. సహకరించే వారు ఉంటే సీనియర్ నేషనల్స్‌కు సిద్ధమవ్వాలని తపిస్తోంది.

నూతన్ పంచ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



వేపగుంటకు చెందిన నూతన్‌కుమార్ కరాటే పంచ్‌లతో అంతర్జాతీయ ఖ్యాతి పొందుతున్నాడు. ఆంధ్రాయూనివర్సిటీలో ఎంబీఏ చేశాడు. అంచెలంచెలుగా ఎదిగి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించాడు. 2012 పూనెలో ఎన్‌కేఎఫ్‌టీ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వెండిపతకం, తర్వాత 2015లో విశాఖలో జరిగిన ఏసియన్ కరాటే పోటీల్లో బంగారు పతకం, 2016లో దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సెమీఫైనల్స్‌కి వెళ్లి రన్నర్‌గా నిలిచాడు. 2008, 2009లో మహారాష్ట్రలో జరిగిన జేకేఎస్ జాతీయ కరాటే పోటీల్లో రెండుబంగారు పతకాలు, 2010లో విశాఖలో జరిగిన ఆలిండియా కరాటే పోటీల్లో బంగారు పతకం, 2014లో మహారాష్ట్రలో ఆర్‌జీఎఫ్‌ఐ జాతీయ పోటీల్లో బంగారుపతకం, 2015లో తెలంగాణలో జేకేఎస్ జాతీయ కరాటే పోటీల్లో బంగారుపతకం, 2016లో మధ్యప్రదేశ్‌లో జరిగిన పీఈహెచ్‌వై జాతీయ యూత్‌గేమ్స్‌లో బంగారుపతకం ఇలా యాభైకి పైగానే బంగారువెండి పతకాలు అందుకున్నాడు. ఏడాది క్రితం పంజాబ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెండిపతకం సాధించాడు.

మల్లయుద్ధంలో మేటి సరోజ...



ఇదిగో ఈక్రీడా విజేత పేరు తోట సరోజ. ఊరు ఆరిలోవ. కుటుంబ నేపథ్యం పేదరికం. తండ్రి వాచ్‌మన్. డిగ్రీ ఉత్తీర్ణత సాధించింది. నగరంలో రీడింగ్ రూమ్‌లో పోటీ పరీక్షలకు వచ్చి మరో వైపు ఖాళీ సమయాన్ని క్రీడలకు కేటాయించింది. అలా కమర్షియల్‌టాక్స్ జాయింట్‌కమిషనర్ శివశంకర్రావు ప్రోత్సాహం, జిల్లా అమెచ్యూర్‌రెజ్లింగ్ క్రీడా సంఘం చీఫ్‌కోచ్ పండ్రంగి రుక్మాకర్‌రావు శిక్షణలో రెజ్లింగ్(మల్లయుద్ధం)లో నైపుణ్యం పొంది జిల్లా, రాష్ట్రస్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించింది. ఇపుడు పదిమందికి కోచ్ అయింది. తాను నేర్చుకున్న క్రీడానైపుణ్యాన్ని మరి కొందరికి పంచుతోంది. రీడింగ్‌రూమ్‌లో కోచ్‌గా ప్రశంసలు అందుకుంటోంది. క్రీడా రంగంలో జాతీయ స్థాయి ప్రతిష్ట సాధించి మంచి ఉద్యోగం సాధించాలని ఆరాటపడుతోంది.

మౌనిక ప్రతిభ అద్భుతమే...



బోగా శ్వేతమౌనిక నగరంలో రామ్‌నగర్‌లో ఉంటోంది. తండ్రి చిరుద్యోగి. అయినా ఉన్నత ఆశయాలతో డిగ్రీ చదువుతోంది. ఒక వైపు క్రీడానైపుణ్యాన్ని పెంచుకుంటునే ఇంకో వైపు చదువుల్లో రాణిస్తోంది. రెండేళ్ల క్రితం యువతులకు మల్లయుద్ధం శిక్షణ చూడడానికి వెళ్లి తానూ ఆకర్షితురాలయ్యింది. ఇలా జిల్లా, ఉత్తరాంధ్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయిలో వెండి పతకం సాధించింది. ఇపుడు మౌనిక కూడా కోచ్‌గా అద్భుత ప్రతిభ చాటుతోంది. ఇటీవల ఓ పిల్లల తల్లికి మల్లయుద్ధంలో శిక్షణ ఇచ్చి జిల్లా స్థాయిలో బంగారు పతకాన్ని రప్పించింది. భవిష్యత్తులో ప్రోరెజ్లింగ్‌లో అంతర్జాతీయ స్థాయి పతకాన్ని సాధించాలని ఆశిస్తున్నట్లు చెబుతోంది.

రాకెట్ క్రీడలో రారాజు


పతకాలతో లింగేశ్వరరావు

ఉక్కునగరం(గాజువాక) : జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ పేరు చెబితే గుర్తుకు వచ్చేవారిలో లింగేశ్వరరావు ఒకరు. చిన్నప్పటి నుంచి అన్ని క్రీడల్లో పాల్గొనే లింగేశ్వరరావు తన 15వ ఏట కజిన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ స్వరూప్‌తో కలిసి బ్యాడ్మింటన్ పోటీలు చూడటానికి వెళ్లారు. అక్కడ స్వరూప్ ఆడిన ఆట అతనిలో ఉత్తేజం కలిగించింది. అప్పటి నుంచి ప్రారంభించిన ఆట అతి తక్కువ కాలంలో జిల్లా చాంపియన్‌షిప్ సాధించేలా చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావు యుక్త వయసులో అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించగా నేడు మాస్టర్స్ టోర్నమెంట్‌లో అనేక పతకాలు సాధిస్తూ తన విజయపరంపర కొనసాగిస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..

- ఆలిండియా స్టీల్‌ప్లాంట్ టోర్నమెంట్లలో 10 బంగారు పతకాలు, 5 రజత పతకాలు సాధించారు
- ఆలిండియా పబ్లిక్ సెక్టర్ టోర్నమెంట్‌లో రజత పతకం
- 2012లో హరిద్వార్‌లో జరిగిన సీనియర్ మెన్ డబుల్స్ జాతీయ పోటీల్లో (40+) బంగారు పతకం
- 2013లో ముంబైలో జరిగిన సీనియర్ మెన్ జాతీయ సింగిల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2014లో బోపాల్‌లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ సింగిల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2014లో బోపాల్‌లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో బంగారు పతకం
- 2015లో ధర్మశాలలో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో కాంస్య పతకం
- 2017లో కొచ్చిన్ లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2017లో తిరుపూర్‌లో జరిగిన ఇండియన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ లీగ్ (ఐఎంబీఎల్) చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచారు.

అంతర్జాతీయ పోటీల్లో పతకాలు...

బ్యాడ్మింటన్‌లో లింగేశ్వరరావుకు అంతర్జాతీయ ఖ్యాతి

- 2004లో హైదరాబాద్‌లో జరిగిన ఆసియన్ శాటిలైట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో మెన్ చాంపియన్‌షిప్ సాధించారు.
- 2006లో కొలంబోలో జరిగిన శ్రీలంక శాటిలైట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో మెన్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు.
- 2007లో అడిలైడ్‌లో జరిగిన ఆస్ట్రో ఆసియన్ మాస్టర్స్ పోటీల్లో సింగిల్స్‌లో బంగారు పతకం, డబుల్స్‌లో రజత పతకం సాధించారు.
- 2009లో స్పెయిన్‌లో జరిగిన 4వ బ్యాడ్మింటన్ వర ల్డ్ ఫెడరేషన్ పోటీల్లో సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ గెలుపొందారు.
- 2010లో కౌలాలంపూర్‌లో జరిగిన అపెక్స్ ఎంబీఏ అంతర్జాతీయ ఆహ్వానపు బ్యాడ్మింటన్ పోటీల్లో రజత పతకం
- 2017లో సింగపూర్‌లో జరిగిన హూకూ కీయింగ్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియన్ జట్టు తరపున రజత పతకం గెలుపొందారు.
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఒకేసారి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారునిగా లింగేశ్వరావు అరుదైన ఖ్యాతిని గడించారు.
- ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ ఆశయం...
- 2018లో జరగనున్న మాస్టర్స్ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో 50+ కేటగిరీ పతకం సాధించడం ధ్యేయంగా ప్రాక్టీస్‌కొనసాగిస్తున్నానని లింగేశ్వరరావు తెలిపారు

ఆటల్లో నం.1

- క్రీడల్లో రాణిస్తున్న విశాఖ క్రీడాకారులు
- పతకాల పంట పండిస్తున్న వైనం
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే అయినా సత్తా చాటుతున్న యువతులు

చక్రాలతో పరుగులు... పతకాల్లో మెరుపులు

ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో శ్రీరామ్ జాతీయ స్థాయిలో ప్రతిభ





తల్లి విజయలక్ష్మితో శ్రీరామ్

అక్కయ్యపాలెం(విశాఖ ఉత్తర): జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో నగరంలోని లలితానగర్‌కు చెందిన చనమోలు శ్రీరామ్ అద్భుత ప్రతిభ చూపుతున్నాడు. రోలర్ స్కేటింగ్, ఆర్టిస్టిక్ రోలర్ స్టేటింగ్, ఐస్ స్కేటింగ్ విభాగాలలో సోలో, కపుల్‌డ్యాన్స్‌లో పిన్న వయస్సులో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించాడు. ఏషియన్, ప్రపంచ స్థాయి పోటీల్లో పతకం సాధించడానికి ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు.

స్కేటింగ్‌లో ప్రవేశం ఇలా....

చిన్నప్పుడు టీవీలో సినిమా పాటలను చూస్తూ డ్యాన్స్ వేస్తూండేవాడు. శ్రీరామ్ ఆసక్తిని చూసి అతని తల్లిదండ్రులు ఆరేళ్ల వయస్సులో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీలో వెస్టన్ డ్యాన్స్ నేర్పించారు. అప్పటినుంచి శ్రీరామ్ డ్యాన్సులో చూపించిన అద్భుత ప్రతిభతో ఎన్నో బహుమతులు సాధించాడు. అంతటితో తృప్తి చెందని శ్రీరామ్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌పై దృష్టి పెట్టాడు. స్కేటింగ్ రోలర్స్‌పై వెస్టన్ డ్యాన్స్ చేయడం కోసం శివాజీ పార్కులోని ట్రైనర్స్ పి.సత్యనారాయణ, కె.చిట్టిబాబు వద్ద శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టాడు.

ఎన్నో పతకాలు...

శిక్షణ మొదలుపెట్టిన ఏడాదిలోనే 2015లో ముంబాయిలో జరిగిన జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఆ తర్వాత 2016లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అహ్మదాబాద్‌లో నిర్వహించిన 53వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లోను పతకాలు సాధించాడు. 16 ఏళ్ల పైబడిన విభాగంలో పాల్గొని ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ కపుల్ డ్యాన్స్‌లో సిల్వర్ మెడల్, సోలో డ్యాన్స్‌లో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. అదే ఏడాది ఢిల్లీ, సిమ్లాలో జరిగిన ఐస్ స్కేటింగ్‌లో గోల్డ్, సిల్వర్‌పతకాలు సాధించాడు. ప్రపంచస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. దీని కోసం ప్రత్యేక శిక్షణ కోసం నవంబర్‌లో ఇటలీ వెళ్లనున్నాడు. ఏషియా, వరల్డ్ చాంపియన్ షిప్ సాధించాలన్నదే తన లక్ష్యమని శ్రీరామ్ చెబుతున్నాడు. ప్రస్తుతం బుల్లయ్య కళాశాలలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.

ఇండియన్ క్రికెట్ మేనేజర్ ఎంపిక జాబితాలో కుమార్



ఉక్కునగరం (గాజువాక): స్టీల్‌ప్లాంట్‌లో క్రీడలు అంటే గుర్తుకు వచ్చే మొట్టమొదటి వ్యక్తి ఎం.ఎస్.కుమార్. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, ఉక్కునగరవాసులు, ఉద్యోగుల పిల్లలకు ఆటల్లో ప్రోత్సహించడంలో ఆయనకు ఆయనే సాటి. అందుకే అతనిని ప్లాంట్‌లో స్పోర్ట్స్ కుమార్ అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. స్టీల్‌ప్లాంట్ క్రీడల విభాగం ఎజీఎంగా విధులు నిర్వహిస్తున్న కుమార్ ప్రస్తుతం ఇండియన్ క్రికెట్ జట్టు మేనేజర్ పోస్టుకు ఎంపిక చేసే 12 మంది జాబితాలో ఒకరుగా ఉన్నారు. గత కొన్ని ఏళ్లుగా ఆంధ్రా రంజీ జట్టు మేనేజర్‌గా కూడా భాద్యతలు నిర్వహిస్తున్న కుమార్‌కు చిన్న నాటి నుంచి క్రికెట్‌పై మక్కువ ఎక్కువ. ఆయనకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తి జిల్లా, రంజీ పోటీల్లో పాల్గొనే స్థాయికి తీసుకు వెళ్లింది. అనంతరం ఆయన స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగపర్వం ప్రారంభించినప్పటికీ క్రికెట్‌పై ఆసక్తి కొనసాగుతూనే ఉంది. క్రికెట్‌లో ఆయనకు ఉన్న అపార అనుభవం గుర్తించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆయనను ఆంధ్రా రంజీ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఐదేళ్లుగా ఆయన రంజీ మేనేజర్‌గా కొనసాగుతుండగా అంతకు ముందు బీసీసీఐ రెండేళ్లుగా మ్యాచ్ రిఫరీగా నియమించింది. అదే విధంగా మూడేళ్ల పాటు రంజీ అండర్ 19 సెలక్షన్ కమిటీ సభ్యునిగా, ఏడాది పాటు అండర్ 16 సెలక్షన్ కమిటీ సభ్యునిగా అనేక మంది ఔత్సాహికులను ప్రోత్సహించారు. ప్రస్తుతం కుమార్ విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్(వీడీసీఏ),జిల్లా హాకీ అసోసియేషన్(డీహెచ్ఏ) ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కరాటేలో దుమ్మురేపుతున్న కొండారెడ్డి



సీతమ్మధార (విశాఖ ఉత్తర): కరాటేలో దుమ్మురేపుతున్నాడు కొండారెడ్డి. మద్దిలపాలెంకు చెందిన కొండారెడ్డి వడాకై కరాటే అసోసియేషన్‌లో సౌత్ ఇండియన్ సెక్రటరీ దువ్వి గోవింద్ యాదవ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు అందుకుని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. అంతర్జాతీయ కరాటే పోటీలలో ఓ బంగారుపతకం, జాతీయ స్థాయిలో 4 బంగారు పతకాలు, రెండు సిల్వర్‌లు, రాష్ట్ర స్థాయిలో రెండు గోల్డ్, నాలుగు సిల్వర్ పతకాలు, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. జిల్లా స్థాయిలో ఓ బంగారు పతకం, ఓ సిలవ్వర్ పతకం సాధించాడు.

స్కేటింగ్‌లోనూ..

చిన్నప్పటి నుంచి స్కేటింగ్ అంటే ఇష్టం. దాంతోనే స్కేటింగ్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. రెండేళ్లుగా కరాటే, స్కేటింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నాను. బంగారు పతకాలు చాలా వచ్చాయి. నవంబర్‌లో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ స్థాయిలో రాణించి, విశాఖకు పేరుతేవాలని భావిస్తున్నాను. పదో తరగతి చదువుతూ..శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో డాక్టర్‌గా స్థిరపడాలని ఉందని కొండారెడ్డి చెప్పాడు.

కరాటే, స్కేటింగ్‌లో..



స్కేటింగ్‌లో విశాఖ బాలుడు రికార్డులు సృష్టిస్తున్నాడు. 8వ తరగతి చదువుతున్న సత్యనారాయణ చిన్నతనం నుంచే స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయిలో 4 సిల్వర్ మెడల్స్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు, 3 సిల్వర్, 6 బ్రాంజ్ పతకాలు సాధించాడు. కరాటేలో కూడా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం, సిల్వర్, జాతీయ స్థాయిలో మూడు బంగారు పతకాలు, ఓ సిల్వర్, ఓ బ్రాంజ్, రాష్ట్రస్థాయిలో 2 బంగారు పతకాలు, 4 సిల్వర్, 2 బ్రాంజ్, జిల్లాస్థాయిలో ఓ బంగారు పతకం సాధించాడు.

కిక్‌బాక్సింగ్‌లో మేటి శిరీష

జాతీయ స్థాయిలో రాణిస్తున్న పేదింటి క్రీడా ఆణిముత్యం



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తండ్రిది కూలిపని..అమ్మ గృహిణి..చెల్లెలు ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. తనకు చదువుతో పాటు ఆటపాటలే లోకం. స్కూల్ గేమ్స్‌లోనే ఎన్నో పతకాలు సాధించిన ఆ యువతి ఇంటర్మీడియట్‌లో ఆటల్లో మరింత రాటుదేలింది. డిగ్రీలో చేరి మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్తోంది. ఆ లక్ష్యం జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా రాణించడం, పతకాలు సాధించడం. ప్రస్తుతం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బి.కాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎరాసి శిరీష... పేదింటి ఆణిముత్యంగా చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తోంది.

శిరీష ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. కార్పొరేట్ పాఠశాలలో చదివే స్తోమత లేక, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన శిరీషా అదే కళాశాలలో డిగ్రీ జాయిన్ అయింది. చిన్న నాటి నుంచి క్రీడల పట్ల మక్కువతో పాఠశాల స్థాయిలోనే పలు పతకాలు సాధించింది. అండర్–19లో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు కైవసం చేసుకుంది. ఆరు సార్లు రాష్ట్ర స్థాయి, ఐదు సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి విశాఖ కీర్తిని ఇనుమడింపజేసింది. తండ్రి కూలి పనులు చేస్తూ శిరీషను చదివిస్తున్నాడు. పంజాబ్ లుధియానా, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అండర్–19 గర్ల్స్ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంది.

ఇంటి నిండా పతకాలే..

శిరీష ఇంటి నిండా పతకాలే. ఇంట్లో ఎక్కడ చూసినా షీల్డ్స్ కనిపిస్తుంటాయి. రెండేళ్ల కిందట స్టేట్ ఒలింపిక్స్ బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్–19లో కిక్ బాక్సింగ్, కాటాస్(కరాటే)లో పలు పతకాలు సాధించింది. ఇవి గాక స్టోన్ బ్రేక్, ఐస్ బ్రేక్, తలపై పెంకులు పెట్టుకుని బ్రేక్ చేయించుకోవడం, స్టమక్‌పై బైక్ ఎక్కించుకోవడంతో పాటు అనేక అంశాల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి పలువురి మన్ననలు పొందింది.



ఇవీ గణాంకాలు

నెల రోజుల్లో సిటీ పరిధిలో అమ్ముడైన స్మార్ట్ ఫోన్లు	42,500
రూ.10,000లోపు ఖరీదు గల ఫోన్లు	5,000
రూ.10,000-రూ.20,000 లోపు ఫోన్లు	20,000
రూ.20,000-రూ.35,000 లోపు ఫోన్లు	15,500
రూ.35,000 ఆపైన ఖరీదు ఫోన్లు	2,000

దొంగలపాలైన ఫోన్లు

ప్రతి నెలా సిటీ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్స్	సుమారు 520
మీసేవ ద్వారా ఒక్కో పోలీస్ స్టేషన్‌లో నెలకు నమోదవుతున్న ఫిర్యాదులు	25-30
టూ టౌన్ పరిధిలో నెలకు అందుతున్న ఫిర్యాదులు	35-45
ఏడాది కాలంలో పోలీసులు రికవరీ చేసిన ఫోన్లు	0

సెల్ రేగిపోతున్నారు

అనిల్‌కుమార్ ఇటీవలే రూ. 20 వేల ఖరీదు చేసే మొబైల్ కొన్నాడు. అందులో తన బ్యాంకు ఖాతా వివరాలు, రుణాల మెసేజ్‌లు, ఇతర సమాచారం నిక్షిప్తం చేసుకున్నాడు. అక్కయ్యపాలెంలో వరలక్ష్మీవ్రతం సామగ్రి కొనేందుకు వెళ్లిన కొద్ది సేపటికే జేబులో మొబైల్ మాయమైంది. తన మొబైల్ వెతుకుతూ వెళ్తుండగా ఆయనకు మరో వ్యక్తి రమేష్‌బాబు కంగారుపడుతూ తారసపడ్డాడు. ఏం జరిగిందని అడిగితే ఇటీవలే ముచ్చటగా కొనుకున్న తన రూ.60 వేల విలువచేసే మొబైల్ ఎవరో దొంగిలించారంటూ బాధపడ్డారు. ఆ తరువాత మీసేవలో చెరో పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. రోజూ స్టేషన్‌కు వెళ్తున్నా ఫోన్ దొరకలేదనే సమాధానం వస్తోంది.

ప్రతిమ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యింది. తన తల్లిదండ్రులతో గొడవపడి మరీ రూ.25 వేల విలువ చేసే స్మార్ట్ ఫోన్ కొనుక్కొంది. రోజూలాగే గత నెల 20వ తేదీ ఉదయం బస్‌స్టాప్‌కు వెళ్లి తన కాలేజీ రూట్‌కు వెళ్లే బస్సు రాగానే ఎక్కేందుకు ప్రయత్నించింది. ఒక్కసారిగా గుంపు బస్సు ఎక్కేందుకు చూశారు. అతికష్టమ్మీద బస్ ఎక్కిన ప్రతిమ సీట్‌లో కూర్చొని ఫోన్ తీద్దామని బ్యాగ్ చూస్తే కనిపించలేదు. మీ సేవలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా ఫలితం లేదు.

వారం రోజుల క్రితం ఓ మహిళ తన రూ.5 వేల రూపాయల సెల్‌ఫోన్ పోయిందంటూ మీసేవలో ఫిర్యాదు చేసింది. ఆ మహిళ ఓ మంత్రి కుటుంబానికి దగ్గర బంధువు. ఫోన్ పోయిందన్న విషయం తెలుసుకున్న మంత్రి నేరుగా పోలీస్ ఉన్నతాధికారికి వివరాలు చెప్పారు. అంతే పోలీస్ బృందం జల్లెడ పట్టింది. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపు ఆ ఫోన్ మంత్రి బంధువు చేతిలోకి వచ్చేసింది. సామాన్య ప్రజలైదే ఆశలు వదులుకోవాల్సిందే.

- విశాఖ సిటీ





- నగరంలో రోజుకు 20కి పైగా ఫోన్ల చోరీ
- ఫోన్‌తో పాటు విలువైన డేటా పోగొట్టుకుంటున్న బాధితులు
- మంత్రి బంధువు ఫోన్‌ను 24 గంటల్లో కనిపెట్టిన పోలీసులు
- సామాన్యుల ఫిర్యాదులకు నో రెస్పాన్స్
- ఏడాదిగా ఒక్క ఫోన్ కూడా పట్టుకోని పోలీసులు

నగరంలో సెల్ చోరులు చెలరేగిపోతున్నారు. మొబైల్ దొంగతనాలపై పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు దొంగల పాలిట వరంలా మారింది. దీంతో నిత్యం నగరంలో పదుల సంఖ్యలో ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని మొబైల్ దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కనీస అవసరంగా మారిపోయింది. కాలంతో పోటీపడేందుకు ఖరీదైన స్మార్ట్ ఫోన్లనే ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. అందులో తమ బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు, ఇతర ముఖ్యమైన సమాచారం, వివిధ సంస్థలతో లావాదేవీలకు సంబంధించిన సమాచారం మొదలైనవన్నీ భద్రపరచుకుంటున్నారు. ఫోన్ ఖరీదు కంటే.. అందులో ఉన్న సమాచారమే ఎక్కువ ఖరీదు చేస్తుందని వినియోగదారులు భావిస్తున్నారు. ఇంతటి విలువైన ఫోన్ ఎవరైనా దొంగిలిస్తే దాదాపు సమాచారమంతా చౌర్యానికి గురైనట్టే.

ఏరియాకు ఒక ముఠా

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 నుంచి 4 ముఠాలు కేవలం మొబైల్స్ దొంగతనాలు చేస్తున్నవే ఉన్నట్లు తెలిసింది. ఈ ముఠాలు ముందుగానే మాట్లాడుకొని ఏరియాలు పంచుకుంటారు. ఒకరి ఏరియాను మరొకరు టచ్ చేయరు. వారి పరిధిలో రద్దీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటారు. రద్దీగా ఉన్న ప్రాంతంలో ముందుగా జనాన్ని పరిశీలిస్తారు. వారు వినియోగిస్తున్న ఫోన్లు, ఎక్కడ దాచుతున్నారనే విషయాన్ని గమనించి అందులో ఎక్కువ ఖరీదైన ఫోన్ ఎవరు వాడుతున్నారో వారే టార్గెట్‌గా మారతారు. వారిని ఫాలో అవుతూ వకాశం చిక్కినప్పుడు ఫోన్ మాయం చేస్తారు. ఇలా ఒక్కో ముఠా రోజుకు కనీసం 3 నుంచి 4 ఫోన్లు కొట్టేస్తారు. వీటిని నగరంలో వివిధ ప్రాంతాల్లో సెకెండ్ హ్యాండ్ షాపులు, సర్వీసింగ్ సెంటర్లలో అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఒక్క దొంగనూ పట్టుకోలేదు

ఒకప్పుడు ఫోన్ పోతే.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేవారు. ఆ తర్వాత పోలీసులు జరిపే దాడుల్లో ఎవరైనా దొంగల ముఠా దొరికితే వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలో తమకు వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన ఫోన్లేవైనా ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి ఫిర్యాదుదారుడిని పిలిపించేవారు. ఫోన్ అతనిదని నిర్ధారణ అయితే అప్పజెప్పేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సెప్టెంబర్ 2016 నుంచి ఫోన్ పోతే స్టేషన్‌లో కాకుండా మీసేవ ద్వారా ఫిర్యాదు చెయ్యాలనే నిబంధన పెట్టారు. దీంతో ఫోన్ చోరీలకు ఎఫ్‌ఐఆర్ నమోదు చెయ్యడం లేదు. మీ సేవా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు వారం తర్వాత నాట్ ట్రేసింగ్ పేరుతో ధ్రువపత్రం జారీ చేస్తారు. అంతకు మించి ఏ ఉపయోగం లేదు. దీంతో చాలా మంది ఖరీదైన ఫోన్ పోయినా ఫిర్యాదు చెయ్యడం మానేస్తున్నారు. తమ పాత మొబైల్ నంబర్‌ను తిరిగి పొందేందుకు పోలీస్ స్టేషన్ ఇచ్చే నాట్ ట్రేసింగ్ సర్టిఫికేట్ పనికొస్తుందన్న ఉద్దేశంతో కొందరు మాత్రమే ఫిర్యాదు చేస్తున్నారు. పెద్దల నుంచి ఫిర్యాదు వస్తే మాత్రం 24 గంటల్లో ఫోన్‌ను ట్రేస్ అవుట్ చేస్తున్నారనే అపవాదు మన పోలీసులపై ఉంది. ఏడాది కాలంగా ఒక్క ఫోన్ కూడా పోలీసులు పట్టుకోలేకపోయారంటే సెల్ చోరీలపై ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది మే నెలలో త్రం సెల్‌ఫోన్‌షాపుల్లో కొత్త ఫోన్లు దొంగతనం చేసిన అంతర్రాష్ట్ర ముఠాను మాత్రం పట్టుకున్నారు.

ఐఎంఈఐ నంబర్ అంటే.?

ప్రతి ఫోన్‌కు ఒక ఐఎంఈఐ నంబర్ ఉంటుంది. ఐఎంఈఐ నంబర్ అంటే ఇంటర్‌నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ నంబర్. దీనిలో 15 అంకెలుంటాయి. ప్రతి మొబైల్ హ్యాండ్‌సెట్‌కు ఒక నంబర్ ఉంటుంది. ఈ నంబర్ ఉంటే చాలు ఆ ఫోన్‌లో ఉన్న సిమ్ కార్డుకు ఎక్కడ నుంచి కాల్స్ వస్తున్నాయి, ఎవరికి కాల్స్ చేస్తున్నారనే ప్రతి విషయాన్ని గుర్తించవచ్చు. టెలికం ప్రొవైడర్స్ ఈ ఐఎంఈఐ నంబర్‌ను బేస్ చేసుకొని ఫోన్ ట్రేస్ చేస్తారు. అయితే డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికంకు చెందిన టెలికం ఎన్‌ఫోర్స్‌మెంట్ రిసోర్స్ అండ్ మానిటరింగ్ (టీఈఆర్‌ఎం) ఒక సెల్‌ఫోన్ దొంగతనానికి సంబంధించిన కేసులో విస్తుపోయిన అంశం బయటపడింది. ఆ మొబైల్ ఐఎంఈఐ నంబర్ ఉపయోగించి సెర్చ్ చేయగా.. ఒకే నంబర్‌తో 18 వేల ఫోన్లు ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఐఎంఈఐ నంబర్లు సైతం ట్యాంపరింగ్‌కు గురవుతున్నాయని గుర్తించిన కేంద్రం శిక్షలను కఠినతరం చేసింది.

ప్రతి కేసునూ పరిశీలిస్తున్నాం

సెల్‌ఫోన్ కేసులు తరచూ వస్తున్నాయి. కొంత మంది ఫలానా చోట మరిచిపోయామని, మరికొంత మంది ఫలానా ప్రాంతంలో చోరీకి గురైందని మీసేవ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. ఫోన్‌ను ట్రేస్ చేసే సాంకేతికత ప్రస్తుతం అందుబాటులో లేదు. ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తున్నాం. ఎప్పుడైనా సెల్‌ఫోన్ దొంగలు దొరికితే వారి దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలో కమిషనరేట్ పరిధిలో వచ్చిన ఫిర్యాదుల్లో ఉన్న వారి ఫోన్లతో మ్యాచ్ అయితే వారికి అందిస్తాం.

- జీవీ రమణ,
రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ



తక్కువ ఖర్చుతో ఫిజియోథెరపీ

- విమ్స్‌లో అందుబాటులో ఆధునిక పరికరాలు
- పెరిగిన ఆదరణ.. రోజుకు 50 మంది వరకు రోగులు

ఆరిలోవ (విశాఖ తూర్పు):

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఫిజియోథెరపీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. దీంతో ఈ విభాగానికి రోగుల తాకిడి పెరుగుతోంది. విమ్స్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఈ విభాగంలో సేవలు అందుతున్నాయి. ప్రారంభంలో రోజుకు ఇద్దరో ముగ్గురో వచ్చేవారు. ఇప్పుడు వారి సంఖ్య 50 వరకు చేరింది. ఇక్కడ ఇటీవలఫిజియోథెరపీలో పూర్తిస్థాయి విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి కావాల్సిన పరికరాలన్నీ ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు. కీళ్ల నొప్పులు, మూతి వంకర, పక్షవాతం తదితర వాటితో బాధపడుతున్నవారు ఎక్కువగా వస్తున్నారు. నెలల పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇక్కడ సేవలు పొందుతున్నారు. తక్కువ ఖర్చుతోనే ఇక్కడ మంచి ఫలితం వస్తుండటంతో దూర ప్రాంతాల నుంచి సైతం రోజూ వచ్చి ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు. వీరి కోసం అల్ట్రా సౌండ్స్ థెరపీ పరికరాలు, వాక్స్ థెరపీ పరికరాలు, స్టాటిస్ సైకియార్స్, ఐఆర్‌ఆర్ ల్యాంప్స్, టెన్స్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో ఇక్కడ ఫిజియోథెరపీ సేవలందించడంలో వైద్య నిపుణుడు డాక్టర్ శివకోటేశ్వరరావుకు నగరంలో సెయింట్ లుక్స్ నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సహకరిస్తున్నారు. ఇక్కడికి ఆరిలోవ, పెందుర్తి, గోపాలపట్నం, గాజువాక, మధురవాడ, ఆనందపురం, తగరపువలస, భీమిలి ప్రాంతాల నుంచి ఎక్కువగా రోగులు వస్తున్నారు. ఐదు గదుల్లో దీని సేవలు విస్తరించి వాటిలో పరకరాలు అమర్చి థెరపీ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ రోజుకు రూ.50 ఫీజు తీసుకుంటున్నారు.

అందుబాటులో ఉన్న పరికరాలు.. సేవలు

మజిల్స్ స్టిమ్యులేటర్: ఈ పరికరాన్ని పక్షవాతం వచ్చిన వారికి థెరపీ అందించడానికి ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ముఖ పక్షవాతం వచ్చిన రోగులకు దీన్ని ఉపయోగించి వైద్యం అందిస్తున్నారు.

అల్ట్రాసౌండ్ థెరపీ: అన్ని రకాల జాయింట్ నొప్పులకు ఈ పరికరాన్ని వినియోగిస్తున్నారు.

వేక్స్ థెరపీ: పోస్టు ఆపరేటివ్ కేసులకు దీన్ని ఉపయోగిస్తారు. జాయింట్ నొప్పులను కూడా దీన్ని ఉపయోగించి నయం చేస్తారు.

ట్రాక్షన్ మిషన్: చేతిలో తిమ్మిర్లు వచ్చినవారికి, సయాటికా సమస్యతో బాధపడుతున్నవారికి ఈ మిషన్‌ను వాడుతున్నారు.

ఎక్సర్‌సైజ్ థెరపీ: దీనిద్వారా మోకాళ్ల నొప్పులకు చికిత్స ఇస్తున్నారు.

స్టాటిక్ సైక్లర్: మోకాలు బిగుసుకుపోయినవారికి ఈ పరికరం ద్వారా నయం చేస్తున్నారు.

ఫింగర్ లేడర్: చేతి వేళ్లు సరిగా పనిచేయకపోవడం, మనిషి ఆధీనంలో లేకపోవడం లాంటివారికి ఈ పరికరం ద్వారా థెరపీ ఇస్తున్నారు. దీంతో పాటు ఐఆర్‌ఆర్ ల్యాంప్‌లు, టెన్సీ మిషన్లు, వెరబేన్లు, వాకర్లు, నడక కోసం పేల్‌రాల బార్, చిన్న పిల్లల కోసం స్వంగ్‌బాల్ అందుబాటులో ఉన్నాయి.




పరికరాల సహకారంతో ఫిజియోథెరపీ పొందుతున్న పేషెంట్లు



మెడ నిలవని 10 నెలల బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

రోగుల సంఖ్య పెరుగుతోంది



సయాటికా బ్రేక్ సర్జరీ పేషెంట్ రాంబాబుతో థెరపీ చేయిస్తున్న డాక్టర్ శివకోటేశ్వరరావు

ఫిజియోథెరపీకి రోగుల సంఖ్య పెరిగింది. రోజుకు 50 మంది వరకు వస్తున్నారు. దూర ప్రాంతాలైన పెందుర్తి, గోపాలపట్నం, గాజువాక, మధురవాడ నుంచి ఇక్కడికి పక్షవాతం, బాగా కీళ్ల నొప్పులతో నడవలేనివారు, చిన్న పిల్లలు వివిధ కీళ్ల సమస్యలతో బాధపడుతూ వస్తున్నారు. ఇక్కడ ఉన్న పరికరాలను వినియోగించి వారికి తగిన వైద్యం అందిస్తున్నాము. చెయ్యి చచ్చుబడటం, భుజాలు బిగుసుకుపోవడం, మోకాళ్లు బిగుసుకుపోవడం, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, పక్షవాతం తదితర సమస్యలతో ఇక్కడ ఎక్కువగా వస్తున్నారు. వారికి తగిన వైద్యం అందించడానికి ఇక్కడ అన్ని రకాల పరికరాలు ఉన్నాయి.

–డాక్టర్ శివకోటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్, విమ్స్

సయాటికాతో ఇబ్బంది పడ్డాను..



నాకు సయాటికా సమస్య ఉంది. దీనికి సంబంధించిన సర్జరీ జరిగింది. అయినా సమస్య తీరలేదు. ఇక్కడ నెల రోజులుగా ఫిజియోథెరపీ కోసం వస్తున్నాను. రోజూ ఇక్కడ వైద్య సిబ్బంది పరికరాలను ఉపయోగించి థెరపీ చేస్తున్నారు. రానురాను నా పరిస్థితి మెరుగుపడుతోంది. చేయి కూడా కదపలేక నా పనులు చేసుకోలేకపోయేవాడిని. ఇప్పుడు నా పనులు నేను చేసుకోగలుగుతున్నాను.

–బి.వి రవీంద్ర, గోపాలపట్నం,

పక్షవాతంతో నడవలేననుకున్నాను..

నాకు పక్షవాతం వచ్చింది. దీంతో నడవలేని పరిస్థితి వచ్చింది. ప్రైవేట్ ఆస్పత్రిలో సర్జరీ చేయించుకున్నాను. కాని నడవలేకపోతున్నాను. ఇక్కడ నెల రోజుల నుంచి రోజూ ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. దీంతో కొద్దికొద్దిగా కాలు, చేతులు కదిలి, నెమ్మదిగా నడవగలుగుతున్నాను.

–శ్రీనివాస్, ఆరిలోవ

రైల్వే పోలీసులతో ఎస్పీ సమావేశం



రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న ఎస్పీ (జీఆర్పీ) మోహనరావు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తరం): రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మోహనరావు (విజయవాడ) సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌ను, రైల్వే పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి విశాఖపట్నం వచ్చి గవర్నమెంట్ రైల్వే పోలీసులతో సమావేశమయ్యారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఎస్పీ జి.బి.ఆర్.మధుసూదనరావు, సీఐ ఎస్.లక్ష్మణమూర్తి, లైన్స్ ఇన్‌స్పెక్టర్ ఆరంగి దాశరథి, రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'డేటా సైన్స్'లో ఉపాధి అవకాశాలు

అగనంపూడి (గాజువాక): డేటా సైన్స్ రంగంలో ప్రావీణ్యత సాధించే వారికి చక్కటి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రొ ఎడ్జ్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ సంస్థ ఇన్‌చార్జ్ విశ్వేశ్వరన్ చెప్పారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులకు డేటా సైన్స్ ఫర్ ఇంజినీర్స్ అనే అంశంపై ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా విశ్లేషణ రంగంలో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విజ్ఞాన్ డీన్ (పరిపాలన) కె.మధుసూదనరావు మాట్లాడుతూ డేటా విశ్లేషణ ప్రాముఖ్యత, ప్రయోజనాలు, ఉద్యోగావకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఎడ్జ్ ప్రతినిధి శ్రీకాంత్, కార్యక్రమ కోఆర్డినేటర్లు ఊర్మిళ, లావణ్య, సంతోష్‌కుమారి, ముదిర్, బాలవర్ధన్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు



మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్

పెదవాల్తేరు (విశాఖ తూర్పు): మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఈపీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్ చెప్పారు. ఎంవీపీ ఐఐఏఎంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో మేనేజ్‌మెంట్ విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. మంచి లక్ష్యాలతో విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్బోధించారు. శ్రావణి షిప్పింగ్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, పోటీ ప్రపంచంలో రాణించేందుకు అన్ని రంగాలలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విద్యార్థులు పాల్గొన్నారు.

నాప్‌కిన్స్‌పై జీఎస్టీ రద్దు చేయాలంటూ 31న ధర్నా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విజయగౌరీ

అనకాపల్లి టౌన్: నాప్‌కిన్స్‌పై జీఎస్టీ పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు నేషనల్ విమెన్ టీచర్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.విజయగౌరీ అన్నారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం కరపత్రాన్ని విడుదల చేశారు. జీఎస్టీవల్ల అన్ని రంగాలపై భారం పడిందని.. సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. విద్యారంగంపై జీఎస్టీవల్ల పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తోందన్నారు. 16 నెలలుగా పాఠశాలలు, సంక్షే మ హాస్టళ్లకు సర్కారు నాప్‌కిన్స్ సరఫరా నిలిపివేశారని.. తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఈఎన్‌సీలో డీసీసీ ప్రారంభం




ప్రసంగిస్తున్న వైస్ అడ్మిరల్ అతుల్‌కుమార్ జైన్, డీసీసీ శిక్షణలో పాల్గొన్న కరస్పాండెంట్లు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణం): తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో విశాఖపట్నం మారిటైం వార్‌ఫేర్ సెంటర్ (ఎండబ్ల్యుఎస్)లో ఏర్పాటుచేసిన డిఫెన్స్ కరస్పాండెంట్స్ కోర్స్ (డీసీసీ)–2017ను వైస్ అడ్మిరల్ అతుల్‌కుమార్ జైన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 34 మంది జర్నలిస్టులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని చెప్పారు. డీసీసీని ఏటా డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ నేతృత్వంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ డిఫెన్స్‌కు సంబంధించి జర్నలిస్ట్‌లను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతుందన్నారు. అడిషినల్ డైరెక్టర్ జనరల్ (మీడియా అండ్ కమ్యూనికేషన్) నితిన్ వాకంకర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు కొనసాగే శిక్షణలో వివిధ అంశాలలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఒక రోజు జలాంతర్గామి, యుద్ధ నౌకలోని వివిధ అంశాలను తెలుసుకుంటారని అన్నారు. నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబరేటరీ (ఎన్‌ఎస్‌టీఎల్)ను సందర్శించి పలు విషయాలు నేర్చుకుంటారని తెలిపారు. శిక్షణలో భాగంగానే అంబాలా, తేజ్‌పూర్‌లలోని వాయు విభాగాన్ని, అరుణచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతాన్ని సందర్శించి రక్షణ రంగ వ్యవస్థను అధ్యయనం చేస్తారని అన్నారు.

కొత్తగా 10 డీసీసీబీ శాఖలు

సాక్షి, విశాఖపట్నం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖలు కొత్తగా మరో పది ఏర్పాటు చేస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ తెలిపారు. డీసీసీబీ 47వ మహాజనసభ సోమవారం కేంద్ర కార్యాలయంలో జరిగింది. 2016–17లో బ్యాంకు సాధించిన ప్రగతి, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆడిట్ నివేదికను సభ ఆమోదించింది. డీసీసీబీ ఉద్యోగులకు పదవీ విరమణ వయసును మరో రెండేళ్ల పాటు పొడిగించుటకు తీర్మానించింది. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ ఇప్పటికే డీసీసీబీకి చెందిన ఆరుశాఖల్లో ఏటీఎంలు ఏర్పాటు చేశామని.. మిగిలిన అన్ని బ్రాంచీల్లో కూడా దశల వారీగా ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. బ్యాంకు ద్వారా వర్తించే మెడిక్‌లెమ్ సహకార సంఘాలు, ఉద్యోగులు, అధ్యక్షులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. పీఏసీఎస్ లు రుణ మంజూరుకై పరిమితి కాకుండా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది కేంద్రాల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. డీసీసీబీలో గతేడాది కంటే వ్యాపార లావాదేవీలు పెరిగాయని.. గతేడాది రూ.853కోట్ల లావాదేవీలు జరపగా ఈ ఏడాది రూ.1140 కోట్ల టర్నోవర్ సాధించినట్టు చెప్పారు. గతేడాది రూ.4.5 కోట్ల లాభాలు ఆర్జించగా, ఈ ఏడాది టర్నోవర్ పెరిగినప్పటికీ లాభాలు మాత్రం రూ.1.40 కోట్లు వచ్చినట్టు చెప్పారు. పే రివిజన్ అమలులోకి రావడంతో సిబ్బంది జీతభత్యాలు గణనీయంగా పెరగడం వల్ల లాభాలు కాస్త తగ్గాయన్నారు. సభలో రాష్ట్ర సహకార యూనియన్ అధ్యక్షుడు డీవీ సూర్యనారాయణ, డీసీఎంఎస్ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మీ నాయుడు, డైరెక్టర్లు,సీఈవో డీవీఎస్ వర్మ పాల్గొన్నారు.



మధురవాడ - రామునాయుడు: 9010275754
పీఎంపాలెం-సత్యనారాయణ: 9505507672
పద్మనాభం-బంగారునాయుడు: 9640947827
కొమ్మాది-ఎంవీఎస్ బాపూజీ: 9666203555

హఠాత్తుగా బడ్డీలు తొలగిస్తే ఎలా?

- వ్యాపారుల ఆవేదన
- అధికారులకు విన్నపం
- దక్కని ఫలితం
- బడ్డీల తొలగింపు

సాయిరాం కాలనీ(మధురవాడ): 'హఠాత్తుగా వచ్చి బడ్డీలు తీసేయమంటే ఏం చేస్తాం బాబూ.. కనీసం అందులో సామగ్రి తీసుకోవడానికై నా ఒకటి, రెండు రోజులు గడువు ఇవ్వండి' అంటూ రోడ్డు పక్క వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. హైవే నుంచి సాయిరాం కాలనీకి వెళ్లే రోడ్డులో 8 బడ్డీలకు చెందిన వారంతా వైఎస్సార్ సీపీ 4వ వార్డు ప్రధాన కార్యదర్శి గుమ్మడి మధు, బాత కృపారావు సారధ్యంలో జెడ్సీ పీఎం సత్యవేణి, ఏసీపీ మధుసూదనరావులను సోమవారం సాయంత్రం వేర్వేరుగా కలిశారు. తమ ఆవేదన వెలిబుచ్చారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నామని, జీవీఎంసీకి పన్ను కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. అర్థంతరంగా రోడ్డున పడేయవద్దని, తమకు ఉపాధి లేకుండా చేయవద్దని విన్నవించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ వీటిపై ఫిర్యాదు వచ్చిందని, ప్రధాన కమిషనర్ ఆదేశాలు పాటించాల్సిందేనని తేల్చి చెప్పడంతో వీరు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. జీవీఎంసీ సిబ్బంది ఇక్కడ ఉన్న బడ్డీలను తొలగించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కన్నీరుమున్నీరయ్యారు.



ఏసీపీకి సమస్య వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మధు





కొమ్మాది జేఎన్ఎన్‌యూఆర్ఎం 25,26,27 బ్లాకుల్లో నెలకొల్పిన గణనాథునితో యువకుల సెల్ఫీ

ఆర్‌జీకే కాలనీ సమస్యలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డులోని రాజీవ్ గృహకల్ప కాలనీల సమస్యలపై బీజేపీ 5వ వార్డు అధ్యక్షుడు బండారు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కాలనీ వాసులు కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు ఇచ్చారు. వారు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ గ్రైనేజీ, పారిశుధ్య సమస్యపై జీవీఎంసీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన తాత్కాలికంగా కంటి తుడుపు పనులు చేస్తున్నారని, గట్టిగా అడిగితే తమకు హౌసింగ్ బోర్డు ఈ కాలనీ అప్పగించలేదని చెబుతున్నారని వాపోయారు. డంపింగ్ యార్డుతో తరచూ ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. కనీసం వీధిలైట్లు, బ్లాకుల మధ్య లైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తమ్మినేని జగన్నాధం, పడమటి భవానీ, కొత్తల అరుణ్‌ప్రసాద్, యండ అప్పారావు, గుడివాడ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి

తగరపువలస: విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు టి.ఎన్.రాజు అన్నారు. స్థానిక శ్రీబాసర జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఏబీవీపీలో విద్యార్థుల భాగస్వామ్యం పెరగాలన్నారు. అనంతరం భీమిలి డివిజన్‌కు చెందిన ఆరు కళాశాలలకు సంబంధించి టౌన్ కమిటీకి ఎన్నికల నిర్వహించారు. కన్వీనర్‌గా ఎల్.అచ్చిబాబు, కార్యదర్శిగా కనకరాజు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీను, వినయ్, మహిళా కన్వీనర్‌గా ఎం. వెంకటలక్ష్మి, కో–కన్వీనర్లుగా శ్రావణి, అపర్ణ, ఎస్ఎఫ్‌డీ గా బి.సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సాయి, ఆనంద్, వెంకటేష్, శ్యామ్ పాల్గొన్నారు.



కమిటీతో సమావేశమైన రాజు

మహిళా రైతులకు సాగు శిక్షణ

తగరపువలస: వ్యవసాయశాఖ సిబ్బంది సహకారంతో మహిళా రైతులు సాగులో మెలకువలు నేర్చుకోవాలని, ఆదాయాన్ని పెంచుకోవాలని అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఉప సంచాలకురాలు ఎన్.గీతాశైలజ కోరారు. భీమిలి మండలం మజ్జిపేట, శింగనబంద, టి.నగరపాలెం పంచాయతీలలో మహిళా రైతులకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా మహిళలు ఆధునిక వ్యవసాయ పోకడలు తెలుసుకోవాలన్నారు. వరినాట్లు, రసాయన ఎరువులు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపి ప్రజలకు విషరహిత ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎమ్.ఎస్.వసంత కుమారి, జి.పద్మజ, టి.దాసు, ఏవోలు కె.ధనలక్ష్మి, పద్మశోభ, బి.నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతాశైలజ

బదిలీ అయిన ఉపాధ్యాయుడికి సన్మానం

పద్మనాభం: మండలంలోని తునిపాలం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పాండ్రంగి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయిన కె.సన్యాసిరావును సోమవారం ఘనంగా సన్మానించారు. తునిపాలం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్ సన్యాసిరావును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మద్ది ఉప సర్పంచ్ కె.జోగినాయుడు, యువజన సంఘం నాయకుడు ప్రకాష్, ఉపాధ్యాయులు పి.వి.రమణ, బి.చిన్నారావు, ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.



సన్యాసిరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు



వడ్డన చేస్తున్న నిర్వాహకులు



కోరాడలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

వినాయకచవితిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మంటపాల వద్ద అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు.

కోరాడలో ఐదువేల మందికి..

పద్మనాభం: కోరాడలో సోమవారం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ప్రారంభించారు.

వాంబే కాలనీలో ...

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు వాంబేకాలనీ 26,27,28 బ్లాకుల వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. దీనికి సహాయ సహకారాలు అందించిన వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నదానాన్ని ప్రారంభించారు. ఇందులో నాయకులు వేగి మహేశ్వరరావు, వైద్యుడు కాంతారావు, ఎల్లాజీ, రాము నాయుడు, మాధవ్, నాగభూషణం, సుబ్రహ్మణ్యం, రాజు, సుబ్బు, నాగ తదితరులు పాల్గొన్నారు.

రెండు వేల మందికి అన్న దానం

కొమ్మాది: జీవీఎంసీ నాలుగో వార్డుసాయిరాం కాలనీలోని పదో సెక్టారు వద్ద వినాయక చవితి నవరాత్రి సందర్భంగా సోమవారం అన్న సంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జై గణేష్ యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో కంచు సత్యనారాయణ, రమణ బ్రదర్స్ సహకారంతో రెండువేల మందికి అన్న సంతర్పణ చేశారు. వైఎస్సార్‌సీపీ నాలుగోవార్డు ప్రధానకార్యదర్శి గుమ్మడి మధు, రామకష్ణ, శ్రీనివాస్ నాయుడు, మన్మథరావు, జగదీశ్వరరావు, అప్పలనాయుడు, సూరిబాబు పాల్గొన్నారు.

చంద్రంపాలెం గణపతికి ప్రత్యేక పూజలు

మధురవాడ: చంద్రంపాలెంలో కొలువైన స్వచ్ఛ గణపతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిళ్లా పాపారావు సోమవారం పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నాగోతి తాతారావు, ఉత్సవ కమిటీ సభ్యులు నరేష్, లోకేష్, వెంకటరావు, వినోద్, రమేష్, పి.సురేష్, ఆర్.సురేష్, అచ్యుత్, సాయి, కృష్ణ పాల్గొన్నారు.



వాంబే కాలనీలో అన్నదానం చేస్తున్న పోతిన

అక్రమ నిర్మాణం అడ్డగింత



విచారణ నిర్వహిస్తున్న వీఆర్వో అప్పారావు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వే నంబరు.27లో జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది కూడలి వద్ద అక్రమంగా చేపడుతున్న ఓ భవన నిర్మాణ పనులను వీఆర్వో కె. అప్పారావు సోమవారం తన సిబ్బందితో వచ్చి అడ్డగించారు. ఇక్కడ 150 గజాల విస్తీర్ణంలో గల ప్రభుత్వ భూమిలో పట్టా, ఏ విధమైన హక్కులు లేకుండా నిర్మాణం చేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. శ్లాబ్ సగంలో పనులు నిలిపివేయించారు. లక్షలు విలువ చేసే స్థలంలో క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసిన రసీదుతో పనులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీఆర్వో వెంట చిన్నారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

టీడీపీ మండల ఉపాధ్యక్షునిగా రమణ

పద్మనాభం: టీడీపీ మండల ఉపాధ్యక్షునిగా విలాస్కాన్‌పాలెం గ్రామానికి చెందిన బాయి వెంకట రమణ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇండస్ట్రియల్ పార్కుల జాడేదీ?

ఇండస్ట్రియల్ పార్కుల జాడే లేదు. పరిశ్రమల ఊసే కనిపించడం లేదు. ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కాన రావడం లేదు. 'నియోజకవ ర్గానికో ఇండస్ట్రియల్ పార్కు' ప్రతిపాదన కాగితాలకే పరిమితమవుతోంది తప్పితే ఆచరణకు నోచుకోవడం లేదు.



- స్థలాల గుర్తింపునకే పరిమితం
- ఆసక్తి చూపని పారిశ్రామిక వేత్తలు



తలారివానిపాలెంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రతిపాదించిన స్థలం

సాక్షి, విశాఖపట్నం : పారిశ్రామికీకరణ అనేది ఏదో ఒక ప్రాంతంలో కేంద్రీకృతం కాకూడదన్న తలంపుతో ప్రతీ నియోజకవర్గంలోనూ 'మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ (ఎంఎస్ఎంఈ) పార్కుల'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. మూడేళ్ల క్రితమే ఈ ప్రతిపాదనలను తెరపైకి తీసు కొచ్చినా నేటికీ అది కార్యరూపం దాల్చలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 15 నియోజక వర్గాలుండగా..12

ఎంఎస్ఎంఈ పార్కు నమూనా

నియోజకవర్గాల్లో 14 పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తొలిదశలో కనీసం ఐదు నియోజక వర్గాల్లో నియోజకవర్గానికో పార్కయినా ఏర్పాటు చేయాలని సంకల్పిం చారు. ప్రతీ పార్కును కనీసం వంద ఎకరాల్లో ఏర్పాటు చేయాలని, కనీసం వంద పరిశ్రమలనైనా ఇక్కడ ఏర్పాటు చేయాలని తలంచారు. ప్రతీ నియోజకవర్గంలోనూ కనీసం 10వేల మందికి ఉపాధి కల్పించాలని భావిం చారు. ఆ దిశగా పలు దఫాల్లో సమీక్షలు నిర్వహించారు.

ఆర్నెల్లకోసారి జరిగిన కలెక్టర్ల కాన్ఫ రెన్స్‌ల్లో కూడా సీఎం చంద్రబాబు నేరుగా ఈ ప్రాజెక్ట్‌పైనే సమీక్షించారు. అయినా సరే ఈ ప్రాజెక్ట్‌కు అతీగతి లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపో యింది. విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షి ణ నియోజకవర్గాల్లో స్థలాభావం కారణంగా పార్కుల ఏర్పాటు ప్రతిపాదన పక్కన పెట్టే శారు. ఒక్కో నియోజక వర్గంలో కనీసం 15 సెంట్ల భూమి కూడా అందుబాటులో లేని పరిస్థితి. దీంతో ఈ నాలుగు నియోజకవర్గా లకు ట్రై జంక్షన్ కింద గాజువాక, సబ్బవరం, పరవాడ మండలాల పరిధిలో 100ఎక రాలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు.

ప్రతీ నియోజకవర్గ కేంద్రంలోనూ కనీసం వంద ఎకరాల్లో ఈ పార్కు ఏర్పాటు చేయాలని తలపెట్టినప్పటికీ అందుబాటులో ఉన్న స్థలాలను బట్టి అత్యధికంగా పాయకరావుపేట నియోజకవర్గంలో రెండు చోట్ల పార్కుల ఏర్పాటుకు స్థలాలు గుర్తించారు.

పాయకరావు పేట మండలం కుమారపురం వద్ద 300 ఎకరాలు, కేశవరం వద్ద 245.06 ఎకరాలను గుర్తించారు. నియోజకవర్గ కేంద్రమైన యలమం చిలిలో 432 ఎకరాలను గుర్తించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్. అమర్‌నాథ్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఈ పార్కుల ఏర్పాటుపై ఇటీవల ప్రత్యే కంగా సమీక్షించారు. పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లోనూ ఈ పార్కులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

ప్రతిపాదించిన ఎంఎస్ఎంఈ పార్కులు

నియోజకవర్గం	మండలం	గ్రామం	గుర్తించిన భూములు (ఎకరాల్లో)
నర్సీపట్నం	మాకవరపాలెం	రాచపల్లి	104.74
అనకాపల్లి	అనకాపల్లి	కుంచంగి	100
అనకాపల్లి	అనకాపల్లి	కోడూరు	249.31
భీమిలి	పద్మనాభం	పెంట-అనంతవరం	600
పెందుర్తి	పెందుర్తి	గుర్రంపాలెం	129.99
గాజువాక	గాజువాక	తలారివానిపాలెం, అగనంపూడి, దువ్వాడ	120
పాయకరావుపేట		పాయకరావుపేట, కేశవరం	245.06
పాయకరావుపేట		పాయకరావుపేట కుమారపురం	300.00
చోడవరం		రావికమతం గుడ్డిప	300.82
యలమంచిలి	యలమంచిలి	యలమంచిలి	432.05
పాడేరు	జి.మాడుగుల	గుడ్డబుసులు	74.10
పాడేరు	జి.మాడుగుల	సింగర్బ	49.40
అరకు	డుంబ్రిగుడ	గతరాగిల్లేడు	100

భూముల గుర్తింపు పూర్తయింది

దాదాపు 13 నియోజకవర్గాల్లో భూముల గుర్తింపు పూర్తయింది. అయితే ఈ భూములు పార్కుల స్థాపనకు ఈ అనువైనవా? కావా? అన్న విషయా ల్ని పరిశీలిస్తున్నాం. పార్కుల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు అందుకున్న వెంటనే తదుపరి చర్యలు చేపడతాం. అయితే ఈ పార్కుల్లో పరిశ్ర మల ఏర్పాటుకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు..

– రామలింగరాజు, జనరల్ మేనేజర్
జిల్లా పరిశ్రమల కేంద్రం

'సంక్షేమ' పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖలకు సంబంధించి సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఇందుకు సంబంధించి జిల్లాకు 18,494 లబ్ధిదారుల లక్ష్యం కాగా, 9884 మందిని బ్యాంకులకు పంపించారన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారు లకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులు, వర్క్ ఫైళ్లు, రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వ హించాలన్నారు. పూర్తి డేటా పొందుపర్చి ఆయా నివేదికలను ఎప్పటిక ప్పుడు తమకు పంపించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మహాలక్ష్మి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ప్రభాకరర్, ఎల్‌డీఎం శరత్‌బాబు పాల్గొన్నారు.

1న 'క్యూట్ డెవిల్ షాలిని' ప్రీ రిలీజ్ ఫంక్షన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న షాలిని చిత్ర బృందం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : స్వర్ణ ప్రొడక్షన్స్ పతాకంపై అయోద్ దేశ్ పతి, అర్చన, శ్రేయ వ్యాస్ హీరో హీరోయిన్లుగా 'పార్సిల్' ఫేం షిరాజ్ దర్శకత్వంలో లయన్ సాయి వెంకట్ సమర్పణలో, పీవీ సత్యనారాయణ నిర్మించిన 'ఏ క్యూట్ డెవిల్ షాలిని' హర్రర్ సినిమాకు సంబంధించి వచ్చే నెల 1న ప్రీ రిలీజ్ ఫంక్షన్ విశాఖలో నిర్వహించనున్నట్టు లయన్ సాయి వెంకట్, నిర్మాత సత్యనారాయణ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు షిరాజ్ సినిమా విశే షాలు వివరించారు. 'ది క్యూట్ డెవిల్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చే షాలిని మంచి హర్రర్ సినిమా అని పేర్కొన్నారు. ఆడియోకు మంచి స్పందన వచ్చిందని, బిచ్చగాడు సినిమాకు పాటలు రాసిన భాష్యశ్రీ రాసిన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయన్నారు. నిర్మాత సత్యనారాయణ మాట్లాడుతూ తానో వ్యాపారవేత్తనని, షీరాజ్ తొలి సినిమా తనను ఎంత గానో ఆకట్టుకుందని, ఈ సినిమాకు కూడా ప్రజల్లో మంచి పేరు రానుంద న్నారు. లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ 300 సినిమాలకు తాను తెర వెనుక సహకారమందించానని, ప్రీ రిలీజ్ ఫంక్షన్ కోసం ఇక్కడకొచ్చాన న్నారు. సమావేశంలో చిత్ర యూనిట్ పాల్గొంది.

విద్యార్థి దశ నుంచే న్యాయ సలహాలు అందించాలి

న్యాయ విజ్ఞన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి దామోదరరావు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి దామోదరరావు

సబ్బవరం (పెందుర్తి) : న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు న్యాయవాద వృత్తిలో రాణించాలంటే విద్యార్థి దశ నుంచే న్యాయ సలహలు అందించడం, న్యాయ సహాయం చేయ డం వంటి విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. దామోదరరావు అన్నా రు. గొటివాడలోని దామోదరం సంజీ వయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాల యంలో సోమవారం లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్వర్యంలో 'భారత రాజ్యాంగంలో–న్యాయ సహాయం పాత్ర' అనే అంశంపై న్యాయ విద్యా ర్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మా ట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన విధం గా న్యాయం ముందు అంతా సమానులే, పేద, ధనిక అనే బేధం లేకుండా సమన్యాయం అం దించడమే మన లక్ష్యంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్టికల్ 39ఏ ఇండియన్ కాన్సి ట్యూషన్ ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్ర మంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. వి.కే శవరావు, రిజిస్ట్రార్ దయానందమూర్తి, డీన్ ప్రొ. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌పీవీ విలీనానికి నాలుగేళ్లు



భెల్ (హెచ్‌పీవీపీ) పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : బీహెచ్‌పీవీ–భెల్‌లో విలీనమై మంగళవారం (ఆగస్టు 29)నా టికి నాలుగేళ్లు పూర్తయి ఐదో ఏట అడుగుపెడుతోంది. ఎన్నో సవాళ్లు, ప్రతిసవాళ్లతో భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ కొనసాగుతోంది. అయిల్, పవర్ సెక్టార్ రంగా లకు వర్క్ ఆర్డర్లతో పాటు ఇతర మరికొన్ని సంస్థలకూ వర్క్ ఆర్డర్లతో ప్రస్తుతం సంస్థ నడుస్తోందని ఉద్యోగులు, కార్మికులు చెబుతున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు

- విలీనమై నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటి వరకు వేతన సవరణ సమస్య అలాగే ఉంది. గ్రేడ్ల కుదింపు సమస్య ప్రధానం లక్ష్యంగా ఉంది.
- దేశంలో ఉన్న 16 యూనిట్ల వేతనాలు మాదిరి విశాఖ యూనిట్‌లోనూ కార్మికులకు వేతనాలు వర్తించడం లేదని యూనియన్ వర్గాల ఆరోపణ.
- ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగకపోవడంతో కార్మికులపై ఒత్తిడి.
- ఉద్యోగాల భర్తీ విషయంలో స్థానికులకూ అవకాశం కల్పించాలన్నది ఇక్కడి వారి డిమాండ్.
- కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేత నాల చెల్లింపు జరగడం లేదు. మహారత్నగా మారిన తరువాత పరిస్థితి కొద్దిగా మారింది.

– కార్మికులు, ఉద్యోగులు నివసిస్తున్న క్వార్టర్ల పరిస్థితి దారుణంగా ఉంది.


విలీనం తర్వాత లాభాలు

- కార్మికులు, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత కూడా వైద్య సౌకర్యం వర్తింపు,
- బీహెచ్‌పీవీగా ఉన్నప్పుడు కార్మికులు, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయస్సు 58ఏళ్లు గా ఉండేది. భెల్‌గా అవతరించాగ అది 60కి పెరిగింది. కార్మికులు, ఉద్యోగులు తమ శక్తి మేరకు విధులు నిర్వర్తిస్తూ సంస్థను కాపాడు కుంటూ వస్తున్నారని యూనియన్ నేతలు అభిప్రాయపడుతున్నారు. కార్మికుల సమ స్యలపై ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఎప్ప టికప్పుడు ఢీల్లీ కార్పొరేట్ కార్యాలయం లోనూ, యాజమాన్యంతోనూ చర్చలు జరు పుతున్నారంటున్నారు. యూనియన్ గౌర వాధ్యక్షుడు జి.సంజీవరెడ్డి నేతృత్వంలో యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికు లకు వివిధ హక్కులు వర్తించేలా కృషి చేస్తు న్నట్టు చెబుతున్నారు.

వారెవ్వా.. వారాల గణేశా!



ఆంజనేయస్వామి అవతారంలో ఏకదంతుడు



మహాశివునిగా..



వేంకటేశ్వర స్వామిగా..



ఇంటిని తలపిస్తున్న ఏడు గుళ్ల సెట్

నగరంలోని కొబ్బరితోట విఘ్నేశ్వర వాడబలిజ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన వారాల గణపతులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వినాయక చవితి అనగానే భారీ విగ్రహాలు.. మండపాల సెట్‌లతో పాటు పలు రూపాల్లో గణనాథుడిని రూపొందించి పూజలు చేస్తుంటారు. అయితే ఇక్కడ ప్రతిరోజు (వారానికో దేవుడు) ఒక్కో దేవుడి రూపంలో వినాయకుడ్ని రూపొందించి ప్రతిష్టించారు. ఆదివారం సూర్యనారాయణుడిగా, సోమవారం మహాశివునిగా, మంగళవారం ఆంజనేయస్వామిగా, బుధవారం అయ్యప్ప స్వామిగా, గురువారం షిర్డీ సాయినాథుడిగా, శుక్రవారం కుమారస్వామిగా, శనివారం వేంకటేశ్వరస్వామిగాపలు అవతారాల్లో విఘ్నేశ్వరుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. వినాయక మండపం కూడా ఏడు గుళ్లు ఆకారంలో నెలకొల్పారు. దీంతో వీటిని చూసేందుకు భక్తులు పోటీ పడుతున్నారు.

– అల్లిపురం (విశాఖ దక్షిణ)



కుమారస్వామిగా..



షిర్డీ సాయిబాబాగా..



సూర్యనారాయణుడి అవతారంలో



అయ్యప్పస్వామిగా..

బొగ్గు శ్రీను జన్మదినం సందర్భంగా

యువత రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు



శ్రీనుకు అభినందనలు

కంచరపాలెం (విశాఖ ఉత్తర): సంఘ సేవకుడు బొగ్గు శ్రీను జన్మదినం సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నగర జాయింట్ కమిషనర్ నాగేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ మాట్లాడుతూ నిస్వార్థంతో సేవ చేస్తే సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. సుమారు 275 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, చీరలు, బియ్యం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ లీగల్ అడ్వైజర్ నాగరఘు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాజీ కార్పొరేటర్లు జియ్యాని శ్రీధర్, వెంగళరావు, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్‌మూర్తి పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో చోరీ

పెందుర్తి : జీవీఎంసీ 70వ వార్డు పరిధి లక్ష్మీపురంలో సోమవారం చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి 3.5 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, ఒక ల్యాప్‌టాప్ అపహరించుకుపోయారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా నివసిస్తున్న గుళ్లిపల్లి శ్రీనివాసరావు తన ఇంటి తలుపు గ్రిల్‌కి తాళం వేసి డోరు వేయడం మరిచిపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, ల్యాప్‌టాప్ దొంగిలించారు. ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు కుటుంబసభ్యులు దొంగతనం జరిగిందని తెలుసుకుని పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలవిలయం

- పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ
- జలదిగ్బంధంలో గిరిజన గ్రామాలు
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన వరిపొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



ధ్వంసమైన జి.మాడుగుల–చింతపల్లి రోడ్డు

పాడేరు: అల్పపీడనం ప్రభావంతో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని నదులు, వాగులు, కొండగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాల్లోకి ఎగువ నుంచి భారీ ఎత్తున వరదనీరు వచ్చి చేరుతోంది. ముఖ్యంగా మన్యంలో మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. జి.మాడుగుల నుంచి పాడేరు, పెదబయలు మండలాల మీదుగా సాగుతున్న ఈ గెడ్డ నిండుకుండలా ప్రవహిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సోమవారం 15.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మన్యంలో జి.మాడుగుల మండలంపై ఉపరితల ఆవర్తన ప్రభావం ఎక్కువగా ఉంది. ఇక్కడ భారీ వర్షం కురిసింది. మత్స్యగెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో పాడేరు మండలంలోని ఇ.కొత్తూరు వద్ద, పెదబయలు మండలంలోని పెదకోడాపల్లి వద్ద కాజ్‌వేలపై నుంచి ఉధృతంగా మత్స్యగెడ్డ ప్రవహిస్తుండటంతో ఈ ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించాయి. మారుమూల ప్రాంతాలైన కించూరు, కుంతుర్ల పంచాయతీ గ్రామాల్లోనివారికి బాహ్యప్రపంచంతో సంబంధాలు లేకుండాపోయాయి. పెదబయలు వారపు సంతకు వాహనాలు వెళ్లలేకపోయారు. పెదకోడాపల్లి వద్ద కాజ్‌వేపై మత్స్యగెడ్డ ప్రవహిస్తుండటంతో గెడ్డ అవతల పాఠశాల విద్యార్థులు చిక్కుకున్నారు. మత్స్యగెడ్డ పరీవాహక ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. వరద ఉధృతికి పొలం గట్లు తెగిపోయి వరిపంట నీటమునిగిపోయింది.

ఏజెన్సీలో వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీలలో)
పాడేరు	88.4
జి.మాడుగుల	158.8
చింతపల్లి	21.8
జీకేవీధి	08.4
కొయ్యూరు	26.0
హుకుంపేట	48.6
పెదబయలు	29.2
డుంబ్రిగుడ	12.0
అరకులోయ	25.6
ముంచంగిపుట్టు	49.2
అనంతగిరి	09.4

దిగ్బంధంలో 50 గ్రామాలు

కొయ్యూరు: భారీ వర్షాలతో వాగులు, కొండగెడ్డలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొయ్యూరు, కాకరపాడు, వట్టిగెడ్డ, తీగలమెట్ట, తాండవ ఇన్‌ఫ్లో కాలువలు పొంగుతున్నాయి. దీంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎం బీమవరం, యూ.చీడిపాలెం, బూదరాళ్లలో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. పొలాల్లో భారీగా నీరు చేరింది. వరినాట్లు నీట మునిగాయి.

ప్రమాద స్థాయిలో పెద్దేరు



పెద్దేరు జలాశయం

మాడుగుల: పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలతో పెద్దేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెద్ద ఎత్తున వచ్చిపడుతోంది. నాలుగు రోజులుగా వానలతో ఒక్క సారిగా రెండు మీటర్ల నీరుపెరిగి ప్రమాద స్థాయికి చేరింది. దీంతో రెండువేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు. ప్రస్తుతం 135.50 మీటర్లకు నీరు చేరింది. గేట్లు ఎత్తి ఆదివారం రాత్రి రెండువేల క్యూసెక్కులు విడిచిపెట్టారు. ప్రస్తుతం జలాశయంలోకి 600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని జలాశయం జేఈ రమేష్ తెలిపారు. ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో ఏ క్షణంలోనైనా వరద నీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాలైనా, సత్యవరం, జంపెన, వీరనారాయణం, వీరవిల్లి, గోటివాడ అగ్రహారం గ్రామ ప్రజలుతోపాటు రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేషశైలజ హెచ్చరించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో దండోరా వేయించారు.

స్టెతస్కోప్‌లో శబ్దం పెద్దగా వినిపించడానికి కారణం?



డా. శెట్టెం ఆంజనేయులు

సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

ప్రత్యేకం



మాదిరి ప్రశ్నలు

1. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ కింది వాటిలో ఏ ఆవిష్కరణలో భాగస్వామి?
   1) కాస్మిక్ కిరణాలు 2) డైనమైట్
   3) డైనమో 4) పెన్సిలిన్
2. భూ స్థిరమైన ఉపగ్రహ పరిభ్రమణ కాలం ఎంత?
   1) 365 రోజులు 2) 30 రోజులు
   3) ఒక రోజు 4) 12 గంటలు
3. 'గ్రీన్ హౌస్ ప్రభావం' ఏర్పడటానికి కారణం?
   1) కింది వాతావరణం చల్లబడటం
   2) ఉపరితల వాతావరణం వేడెక్కడం
   3) ఉపరితల వాతావరణం చల్లబడటం
   4) కింది వాతావరణం వేడెక్కడం
4. జడత్వం ఏ భౌతికరాశి ధర్మం?
   1) బలం 2) గాఢత
   3) ద్రవ్యరాశి 4) ఘనపరిమాణం
5. కణాల వ్యవస్థపై బాహ్య బలాలు పనిచేయకపోతే, ఆ వ్యవస్థ ద్రవ్యరాశి కేంద్రం..?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) శూన్యంగా ఉంటుంది
   4) స్థిరంగా ఉంటుంది
6. కంప్యూటర్లలోని సమాకలన(integrated circuit) వలయాల్లో ఉపయోగించే మూలకం ఏది?
   1) ఇనుము 2) మెగ్నీషియం
   3) అల్యూమినియం 4) సిలికాన్
7. 'దృశా తంతువులు' (Optical fiberes) కింది వాటిలో ఏ సూత్రంతో పనిచేస్తాయి?
   1) వక్రీభవనం
   2) సంపూర్ణాంతర పరావర్తనం
   3) వికిరణం 4) వివర్తనం
8. 'కాస్మాలజీ' దేనికి సంబంధించిన అధ్యయనం?
   1) చర్మ సౌందర్య సాధన ద్రవ్యాలు
   2) విశ్వం 3) నేరం
   4) రాత ప్రతులు
9. ఘర్షణ..?
   1) గతి త్వరణాన్ని పెంచుతుంది
   2) కదిలే సమూహాన్ని పూర్తిగా ఆపుతుంది
   3) గతి వేగాన్ని తగ్గిస్తుంది
   4) గతిపై ఎలాంటి ప్రభావం చూపదు
10. ఒక ఖగోళ శాస్త్రవేత్త చంద్రుడిపై నుంచి ఆకాశాన్ని చూస్తే అది ఏ రంగులో కనిపిస్తుంది?
    1) ఎరుపు 2) నలుపు
    3) నీలం 4) తెలుపు
11. 'డయోడ్'(Diode) ఉపయోగం ఏమిటి?
    1) ధన ఆవేశాన్ని రుణావేశంగా మారుస్తుంది
    2) విద్యుద్విశ్లేషణకు (Electrolysis)
    3) ఏకాంతర విద్యుత్‌ను (AC)ను ఏకముఖ విద్యుత్‌గా (DC) మారుస్తుంది
    4) విద్యుత్ ఉత్పత్తి చేయడానికి
12. 'న్యూక్లియర్ బాంబ్'లో ట్రిగ్గర్‌గా ఉపయోగించేది ఏది?
    1) క్రిట్రాన్ 2) MOSFET
    3) ఘనస్థితి రిలే 4) సాలినాయిడ్
13. వజ్రం దేని రూపాంతరం?
    1) సిలికాన్ 2) కార్బన్
    3) హైడ్రోజన్ 4) సోడియం
14. శిలలు, ఖనిజాల్లో ఎక్కువ భాగం ఉండే మూలకం ఏది?
    1) ఇనుము 2) కార్బన్
    3) సిలికాన్ 4) సోడియం
15. కండరాల నొప్పులు, పక్షవాతం వ్యాధుల చికిత్సలో ఉపయోగించే వికిరణం?
    1) అతినీలలోహిత కిరణాలు
    2) మైక్రో తరంగాలు
    3) పరారుణ వికిరణం
    4) రేడియో పౌనఃపున్య వికిరణాలు
16. డయాలిసిస్, రక్త మార్పిడికి ఉపయోగించే నాళికలను ఏ పదార్థంతో చేస్తారు?
    1) పాలి ఇథిలిన్ 2) పాలి సిలికాన్
    3) పాలి వినైల్ క్లోరైడ్
    4) పాలి బ్యుటెన్
17. 'గన్ కాటన్'గా పిలిచే శక్తిమంతమైన విస్ఫోటనకారి ఏది?
    1) పొటాషియం క్లోరైడ్
    2) సెల్యూలోజ్ నైట్రేట్
    3) పొటాషియం నైట్రేట్
    4) సెల్యూలోజ్ అసిటేట్
18. బావి నుంచి నీటి బకెట్‌ను తీస్తున్నప్పుడు, బకెట్ గురించి ఏం అనుకుంటాం?
    1) నీటి పై భాగంలో బకెట్ తేలికగా ఉన్నట్లు
    2) నీటి పై భాగంలో బకెట్ బరువుగా ఉన్నట్లు
    3) నీటి నుంచి బయటకు వస్తున్నప్పుడు సాంద్రత తగ్గినట్లు
    4) నీటి నుంచి బయటకు వస్తున్నప్పుడు ద్రవ్యరాశి పెరిగినట్లు
19. 'గాలిలో ఎగురుతున్న పక్షి' న్యూటన్ ఎన్నో సూత్రానికి ఉదాహరణ?
    1) 1 2) 2 3) 3 4) 2, 3
20. ఆటోమొబైల్స్‌లో హైడ్రాలిక్ బ్రేక్‌లు వేసే విధానం దేని ప్రత్యక్ష అనువర్తనం?
    1) బెర్నొల్లీ సిద్ధాతం
    2) టోరిసెల్లియన్ సిద్ధాంతం
    3) పాస్కల్ సూత్రం
    4) ఆర్కిమెడిస్ సూత్రం
21. సోనోగ్రఫీలో ఉపయోగించే తరంగాలు?
    1) మైక్రో తరంగాలు
    2) పరారుణ తరంగాలు
    3) శబ్ద తరంగాలు
    4) అతిధ్వని తరంగాలు
22. డాక్టర్ స్టెతస్కోప్‌లో శబ్దం పెద్దగా వినిపించడానికి కారణం?
    1) అనునాద శబ్దం
    2) సంపోషక వ్యతికరణం
    3) తరంగాల అధ్యారోపణ సిద్ధాంతం
    4) శబ్ద పరావర్తనం
23. ఎరుపు గాజు పలక నుంచి ఒక పుస్తకం అట్టను చూసినప్పుడు అది ఎరుపుగా కనిపిస్తే, వాస్తవానికి దాని రంగు?
    1) ఎరుపు 2) తెలుపు
    3) ఆకుపచ్చ 4) ఎరుపు లేదా తెలుపు
24. రేడియో ద్వారా మనం వింటున్న తరంగాలు ఏవి?
    1) అనుదైర్ఘ్య తరంగాలు
    2) తిర్యక్ తరంగాలు 3) స్థిర తరంగాలు
    4) అనుదైర్ఘ్య, పురోగామి తరంగాలు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 4
6) 4	7) 2	8) 2	9) 3	10) 2
11) 3	12) 1	13) 2	14) 3	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 3
21) 4	22) 4	23) 4	24) 4	

Use Euclid's division algorithm to find..



యార్లగడ్డ వనంరాజు

స్కూల్ అసిస్టెంట్, జీహెచ్‌ఎస్, నందికొట్కూరు

పదో తరగతి

మ్యాథమెటిక్స్ (ఇం.మీ.)

ప్రత్యేకం

Real Numbers

Euclid's Divisadfion Lemma

Let 'a' and 'b' any two positive integers. Then there exist two unique whole numbers q, r such that

$a = bq + r, o \le r \le b$

Here 'a' is called the dividend, b is called the divisor, q is called the quotient, r is called the remainder.

Alternatively

Dividend = Divisor × Quotient + Remainder

1. Use Euclid's division algorithm to find the HCF of 135, 225.

Sol: Given numbers are 135, 225.

Start with the larger integer, that is 225.

Apply the division lemma to 225, 135, $225 = 135 \times 1 + 90$

Since the remainder $90 \neq 0$, we apply the division lemma to 135 and 90, to get $135 = 90 \times 1 + 45$

We consider the new divisor 90, the new remainder 45, apply the division lemma to get $90 = 45 \times 2 + 0$

The remainder has now become zero, so our procedure stops.

Since the divisor at this stage is 45.

∴ The HCF of 225, 135 is 45.

2. Use Euclid's division lemma to show that the square of any positive integer is of the form 3m or 3m+1 for some integer m.

Sol: Let 'a' be any positive integer.

We apply the division lemma with a, b= 3

Since $o \le r < 3$, the possible remainders are 0, 1, 2. i.e. 'a' can be 3p or 3p+1 or 3p+2, where 'p' is the quotient. Now$(3p)^2 = 9p^2 = 3(3p^2)$

Which can be written in the form 3m

Again $(3p+1)^2 = 9p^2 + 6p+1 = 3(3p^2+2p)+1$

Which can be written in the form 3m+1.

Lastly $(3p+2)^2 = 9p^2 + 12p + 4$

$= (9p^2 + 12p + 3) + 1$

$= 3(3p^2 + 4p + 1) + 1$

Which can be written in the form 3m+1.

∴ The square of any positive integer is either of the form 3m or 3m+1 for some integer m.

Model Problems

- Use Euclid's division algorithm to find the HCF of 1651, 2032.
- Show that any positive odd integer is of the form 4q+1 or 4q+3, where q is some integer.
- Use Euclid's division lemma to show that the cube of any positive integer is of the form 9m, 9m+1 or 9m+8.
- Using Euclid's division algorithm find whether the pair of numbers 847, 2160 are coprime or not.

The Fundamental Theorem of Arithmetic

Every composite number can be expressed (Factored) as a product of primes, this factorization is unique, apart from the order in which the prime factors occur.

In general, given a composite number *x*, we factorize it as

$x = p_1p_2...p_n$, where $p_1, p_2, ... p_n$ are primes and written in ascending order. i.e. $p_1 \le p_2 \le ... \le p_n$

Ex: $156 = 2 \times 2 \times 3 \times 13$

$= 2^2 \times 3^1 \times 13^1$

$3825 = 3 \times 3 \times 5 \times 5 \times 17$

$= 3^2 \times 5^2 \times 17$

1. Express each of the following number as a product of its prime factors.

i) 5005 ii) 7429 *(Communication)*

Sol: i) $5005 = 5 \times 7 \times 11 \times 13$

ii) $7429 = 17 \times 19 \times 23$

2. Check whether 6^n can end with the digit '0' for any natural numbers n. *(Reasoning proof)*

Sol: n is any natural number.

If n = 1, then $6^n = 6^1 = 6$


If n = 2, then $6^n = 6^2 = 36$

If n = 3, then $6^n = 6^3 = 216$ ....

From the above, we can say that 6^n can be end with 6 only.

∴ For any natural number n, 6n cannot end with the digit '0'.

3. Find the value of x, y, z in the given factor tree



(Visualization & Representation)

Sol: From the factor tree.

$z = 5 \times 7 = 35$

$y = 2 \times z = 2 \times 35 = 70$

$x = 2 \times y = 2 \times 70 = 140.$

How many persons live between..



Y. Arunveera Kumar
Subject Expert
IACE, Nellore

MODEL QUESTIONS

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below:

Seven persons namely P, Q, R, S, T, U and V are planning to go for vacation in different months i.e. July, May, August, September, June, February and December, but not necessarily in the same order also each of them want to see different-different temples of India i.e. Akshardham, Somnath temple, Shiridi temple, Trimbakeshwar temple, Konark Sun temple, Kapaleeshwarar temple and Simhachalam temple, but not necessarily in the same order. All persons are arranged in an order from top to bottom.

There are two persons sit between the person who wants to see Konark Sun temple and the one who is immediate above the one, who is planning to go on December. The person, who is planning to go on December, is not immediate above the person, who is planning to go on May. Four persons sit between R and S. Neither V nor T is planning to go on December and May. The person who wants to see Somnath temple is planning to go on June. The person, who wants to see Kapaleeshwarar temple is is above the person, who wants to see Trimbakeshwar temple (but not immediate above). Q sits below R and one person sits between Q and U. Only One person sits between the person, who wants to see Akshardham and the person, who wants to see Konark Sun temple, who is planning to go on July. There are three person sit between the one who is planning to go on June and V. The person, who wants to see Shiridi temple is planning to go on May and sits immediate above the person, who wants to see Konark Sun temple. U wants to see Kapaleeshwarar temple and he is not planning to go on August and September. V is planning to go on September and he does not want to see Akshardham. Two persons sit between U and T. T does not want to see that location, which is immediate below the person, who is planning to go on July.

1. How many persons are between the person, who is planning to go on July and the person, who wants to see Trimbakeshwar temple?
a) Five b) Four c) Two
d) None e) Three

2. Who among the following persons is immediate above the person, who wants to see Akshardham?
a) T b) R c) S
d) Q e) None of these





3. Which of the following location P wants to see?
a) Akshardham
b) Kapaleeshwarar temple
c) Konark Sun temple
d) Trimbakeshwar temple
e) None of these

4. Four of the following five are alike in a certain way and hence they form a group. Which one of the following does not belong to that group?
a) Trimbakeshwar temple
b) June c) U d) T
e) Shiridi temple

5. The person, who wants to see Simhachalam temple, is planning to go on which of the following month?
a) August b) February
c) July d) September
e) None of these

Directions (Q.No. 6 - 7): In each group of questions below are three/four/ five set of statements followed by two conclusions. You have to choose the correct set of statements that does logically satisfies given conclusions separately. Assume the given statements to be true even if they seem to be at variance from commonly known facts.

6. ***Statements:***
1: No L is B. No B is a C. Some C are P.
2: All L are B. All B are C. No C is P.
3: All L are B. No B is a C. Some C are P.
4: All L are B. No B is a C. No C is P.
5: All L are B. All B are C. Some C are P.
Conclusions:
I: No L is a C II: Some P is C.
a) Only Statements 1 and statement 2
b) Only Statement 2
c) Only Statement 3
d) Only Statement 4
e) Only Statement 5

7. ***Statements:***
1: All Debug are copy. All copies are Bugs. No copy is Virus. No Virus is computer.
2: Some Debugs are copy. All copies are Bugs. Some copies are Virus. All Viruses are computer.
3: All Debugs are copy. All copies are Bugs. No copy is computer. All Viruses are Bugs
4: All Debugs are copy. All copies are Bugs. No Virus is copy. Some Viruses are Computers
5: Some Debugs are copy. All copies are Bugs. No copy is Computer. Some Viruses are Computers.
Conclusions:
I: Some Viruses are Debug is a possibility.
II: Some Bugs are not Computers
a) Only Statements 1 and statement 2
b) Only Statements 2 and statement 3
c) Only Statements 3 and statement 5
d) Only Statements 4 and statement 5
e) Only Statement 5

Directions (Q.No. 8-10): In the questions below are given some conclusions followed by five set of statements. You have to choose the correct set of statements that logically satisfies given conclusions definitely. Assume the given statements to be true even if they seem to be at variance from commonly known facts.

8. ***Conclusions:***
I: Some T is R. II: Some U is P.
Statements:
a) Some Q is P. All Q is R. No S is Q. All S is T. Some S is U.
b) Some R is P. All R is Q. No S is R. Some S is T. All T is U.
c) All S is Q. Some P is S. No S is R. Some R is T. All T is U.
d) All U is Q. All P is U. No U is R. Some R is S. All S is T.
e) None of these.

9. ***Conclusions:***
All F are G. Some C is Q
Statements:
a) All F is R. Some G is Q. All R is G. All Q is C. No Q is S.
b) All F is R. Some G is C. No R is G. Some Q is G. All Q is S.
c) All F is E. Some G is Q. All E is G. All S is Q. No C is G.
d) Some S is F. All G is E. No F is C. All E is F. Some Q is C.
e) None of these.

10. ***Conclusions:***
I: Some B is E. II: No E is F.
Statements:
a) All B is D. Some A is C. All C is D. No D is E. All B is F.
b) Some A is F. All F is C. No C is D. Some B is C. All E is B.
c) All F is C. Some A is E. All E is B. No D is B. Some D is F.
d) Some A is D. All D is F. No F is E. Some E is C. All C is B.
e) None of these.

Directions (Q.No.11-15): Study the following information carefully and answer the below questions.

Eight persons A, B, C, D, E, F, G and H live in an 8 storeyed building. They have different professions engineer, lawyer, teacher, doctor, chef, banker, businessman and manager not necessarily in the same order. The floors are numbered 1-8 from bottom to top.

The banker lives just above B who lives at a gap of 4 floors from the manager. Not more than 2 persons live above the manager.

G lives 2 floors below the manager's floor. G and the doctor live at a gap of 3 floors. F lives at a gap of 2 floors from the doctor. E is the engineer and lives just below C. A lives 3 floors above D. The businessman lives just above the lawyer who lives at a gap of one floor from the teacher. B is not the teacher and D is not the lawyer.

11. On which of the following floors does the engineer live?
a) Floor 7 b) Floor 6 c) Floor 3
d) Floor 2 e) Floor 1

12. Who among the following is the chef?
a) D b) B c) A
d) C e) H

13. How many persons live between H and the Lawyer?
a) One b) Two c) Three
d) Four e) More than four

14. Who among the following lives just above the doctor?
a) Teacher b) Manager
c) Chef d) Engineer
e) Nobody, he lives on the top floor

15. What is the profession of the person who lives on floor 6?
a) Engineer b) Manager
c) Businessman
d) Lawyer e) Chef

Key with Solutions


(1-5)

Person	Month	Temple
R	May	Shiridi temple
T	July	Konark Sun Temple
Q	June	Somnath temple
P	August	Akshardham
U	February	Kapaleeshwarar Temple
S	December	Simhachalam Temple
V	September	Trimbakeshwar temple


1) b 2) d 3) a 4) d 5) e

(6-10)


6) c;
From statement 3,




7) c;
From statement 3,




From statement 5,




8) d;



9) a;



10) d;



(11-15)

8	H	Manager
7	A	Teacher
6	G	Businessman
5	F	Lawyer
4	D	Banker
3	B	Chef
2	C	Doctor
1	E	Engineer

11) e 12) b 13) b 14) c 15) c


కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి






దారి కనుక్కోండి

మధ్యలో ఉన్న తాళంచెవితో ఒక డోర్ ఓపెన్ చేసుకుని బయటికి వచ్చే మార్గం కనుక్కోండి. తాళంచెవితో ఒక డోర్ మాత్రమే ఓపెన్ అవుతుంది.



నాన్నా చెప్పవా?

కైపర్ మండలాన్ని ఎప్పుడు కనుగొన్నారు?



సౌరమండలంలో సూర్యుడి నుంచి 1200 కోట్ల కిలోమీటర్ల నుంచి 1500 కోట్ల కిలోమీటర్ల దాకా (300 కోట్ల కి.మీ.ల దూరం) విస్తరించి ఉన్న ప్రాంతాన్ని కైపర్ వృండలం (కైపర్ బెల్ట్) అని అంటారు. సౌరమండలపు అంతిమ సరిహద్దు ప్రాంతంగా భావించబడుతున్న ఈ మండలంలో లెక్కలేనన్ని ఖగోళ పదార్థాలు ఉండటమే గాక, అవి కూడా గ్రహాలలాగే సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. 1930లో ప్లూటోని కనుగొన్నాక, దానికి అవతల కూడా అనేక ఖగోళ శకలాలతోను, నక్షత్ర ధూళితోనూ నిండిన ప్రదేశం ఒకటి ఉండి ఉండవచ్చునని శాస్త్రజ్ఞులు భావించసాగారు. అయితే దీనికి సరైన ఆధారమేమీ లభించకపోవడంతో కొన్ని దశాబ్దాలదాకా ఇది కేవలం ఊహలకే పరిమితమైపోయింది. 1992లో తొలిసారిగా కైపర్ బెల్ట్‌లో 150మైళ్ల వ్యాసంతో ఉండే ఖగోళ రాశి కనిపించింది. ఆ తరువాత అతి తక్కువ కాలంలోనే దాదాపు అదే సైజులో ఉండే మరెన్నో ఖగోళ రాశులను కనుగొన్నారు. దాంతో కైపర్‌బెల్ట్ అనేది వాస్తవమే అని తేలింది. 2002లో ఈ మండలంలో కనిపించిన 'క్వవార్' ఖగోళ రాశి దాదాపు ప్లూటోలో సగం వ్యాసంతో (1300కి.మీ.లు) ఉంటూ, దాని నుంచి 100 కోట్లకి.మీ.ల దూరంలో ఉండటం విశేషం. ఆస్టరాయిడ్ మండలంలోలాగానే కైపర్ మండలంలోనూ కోట్లాది ఖగోళ శకలాలు ఉన్నప్పటికీ, అవి చిన్నగాను, భూమి నుంచి చాలా దూరంగాను ఉన్నందువల్ల, ఇప్పటిదాకా కేవలం 500కుపైగా శకలాల గురించి మాత్రమే శాస్త్రజ్ఞులు సమాచారాన్ని సేకరించగలిగారు. అన్నట్లు ప్లూటో కూడా ఈ మండలంలోని ఖగోళ పదార్థమే.

ఔరా!

భూమి నుంచి చంద్రునికి దారి ఉంటే..
కారులో 100కి.మీ వేగంతో వెళితే
6 నెలల్లోగా చేరుకోవచ్చు.



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి


moth
palm
nail
raft
bridge
tongue
booties
feather



y	u	r	k	v	h	t	x	n
u	b	f	l	a	g	i	t	e
e	r	y	m	s	t	m	i	b
u	e	n	o	e	m	r	p	b
g	h	n	t	i	i	a	a	r
n	t	b	h	t	n	f	l	i
o	a	k	l	o	a	t	m	d
t	e	e	e	o	i	x	z	g
d	f	i	v	b	l	x	j	e

నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో రంగులలో ఉన్న డైనోసార్ నీడ ఏదో గుర్తించండి




కనుక్కోండి

పక్కన ఉన్న బొమ్మల్లో రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అవేమిటో కనుక్కోండి.



కింద ఇచ్చిన ఎలుగుబంటి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి



ఉత్సాహంగా విలువిద్య, రైఫిల్ పోటీలు



ఆర్చరీలో నిమగ్నమైన క్రీడాకారులు



రైఫిల్ షూటింగ్‌లో క్రీడాకారులు

పరవాడ (పెందుర్తి)/ అగనంపూడి (గాజువాక) :

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పి.బొనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి విలు విద్య, రైఫిల్ షూటింగ్ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో నిషాంత్ సోమవారం ప్రారంభించారు. పోటీలను 14, 17 విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సతీష్ పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను డీఈవో నాగమణి, పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి, ప్రిన్స్‌పాల్ సీతాలక్ష్మిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి పండా, కోఆర్డినేటర్ రామలక్ష్మి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ మధుబాబు, కోచ్‌లు సూరిబాబు, రామ్మోహన్ పాల్గొన్నారు. అబ్జర్వులుగా అహ్మద్‌పాషా, కె.శ్రీదేవి వ్యవహరించారు.

విజేతలు వీరే..

విలువిద్యలో ఎల్.అరుణ్‌కుమార్, తమన్న, చిన్మయ్ శ్రీజా, బి.నరేంద్ర, ఎం.దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా రైఫిల్ షూటింగ్‌లో డి.కేతన్, రస్మీమిట్టల్, ఆర్.గౌతమ్, ఆశీష్, విశ్వ విదయ్ ప్రథమస్థానంలో నిలిచారు.

నేడు జరగాల్సిన ఎంపికలు వాయిదా


29న నిర్వహించాల్సిన కబడ్డీ (బాలికలు–14, 17), వెయిట్ లిఫ్టింగ్, హాజీ, ఫెన్సింగ్ జట్ల ఎంపిక ఎంపిక వర్షాలు కారణంగా వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ సంయుక్త కార్యదర్శి సతీష్ తెలిపారు. 30వ తేదీ నుంచి మిగిలిన ఎంపికలు యథావిధిగా కొనసాగనున్నాయి.

30న విజలింగ్ గోపాలపట్నం హైస్కూల్‌లో, హ్యాండ్‌బాల్ తోటగరువు పాఠశాలలో, జిమ్నాస్టిక్స్ పాండురంగాపురంలోని స్టేడియంలో, 31న బాక్సింగ్ స్వర్ణభారతి స్టేడియంలో, 31న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో, వచ్చే నెల 1న లాన్ టెన్నిస్ ఏయూ లాన్ టెన్నిస్ కోర్టు, యోగా దేవరాపురం మండలంలోని కాశీపురం హైస్కూల్‌లో, ఫుట్‌బాల్ (అండర్–14) చిట్టివలస హైస్కూల్‌లో నిర్వహించనున్నారు.

2వ తేదీన షటిల్ బ్యాడ్మింటన్ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో, ఫుట్‌బాల్ (అండర్–17) చిట్టివలస పాఠశాలలో, 4వ తేదీన స్విమ్మింగ్ ఆర్కే బీచ్‌లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, స్కేటింగ్ వుడా స్కేటింగ్ రింగ్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 6వ తేదీన క్రికెట్ (అండర్ –14) వైఎస్‌ఆర్ వుడా స్టేడియం, పోతినమల్లయ్యపాలెంలోనూ, జూడో జట్లు ఎంపిక బీచ్‌రోడ్డులోన వైఎంసీఏలో, చెస్ పెదగంట్యాడ మండలం నడుపూర్ లో, 7వ తేదీన క్రికెట్ (అండర్–17) ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియమ్ అనకాపల్లి, టేబుల్ టెన్నిస్ లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఎంవీపీకాలనీ, 8వ తేదీన వాలీబాల్ కణితి ఉన్నత పాఠశాల ఆవరణలో, త్వైకాండో చంద్రపాలెం హైస్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

9వ తేదీన సాఫ్ట్ బాల్ (బాలికలకు మాత్రమే) మాకవరపాలెం హైస్కూల్‌లో, 10వ తేదీన (బాలురు) మాకవరపాలెం హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. ఎస్ఏ–1 పరీక్షలు, దసరా సెలవులు తరువాత అక్టోబర్ 4న టెన్నీకాయిట్ కృష్ణాపురంలోని ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో, 5వ తేదీన ఖోఖో మున్సిపల్ హైస్కూల్ గవరపాలెం, అనకాపల్లిలో, 6వ తేదీన కబడ్డీ (బాలురు) నడుపూర్ పాఠశాలలో, 7వ తేదీన త్రోబాల్ గాజువాక హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు అన్ ఎయిడెడ్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

సింహగిరికి మేఘమాల





సింహగిరిని సోమవారం మేఘాలు కమ్మేశాయి. ఎటు చూసినా మేఘాలు కనువిందు చేశాయి. రాజగోపురం, బస్టాండ్, ఘాట్‌రోడ్డు, హిల్‌టాప్‌రోడ్డు, టివి టవర్ హిల్ తదితర ప్రాంతాలన్నీ మేఘాలతో నిండుకున్నాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు సింహగిరిని ఈ దృశ్యాన్ని చూసి ఆనందభరితులయ్యారు.
సింహాచలం (పెందుర్తి)

విద్యాగణపతిగా..



విద్యా గణపతి

ద్వారకానగర్(విశాఖ దక్షిణ): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయంలో సోమవారం విద్యా గణపతిగా స్వామివారు దర్శనమిచ్చారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఉపకలెక్టర్, కార్యనిర్వాహణధికారి ఎస్.జె.మాధవి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ గురుస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 వరకు డాక్టర్ కదిమిళ్ల వరప్రసాద్, నరసాపూర్ వారిచే ' సుందరకాండ వైభవం'పై ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు.

శివబాల గణపతిగా..

సీతంపేట (విశాఖ ఉత్తర):

సీతంపేటలోని దుర్గాగణపతి సోమవారం శివబాల గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నటరాజన్ పర్యవేక్షణలో పండితుల వేద మంత్రాల మధ్య ఉదయం గణపతి హోమం, మహాభిషేకం, సహస్రనామార్చన జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయల వద్ద ఏర్పాటుచేసిన గయోపాఖ్యానం పౌరాణిక నాటకం అలరించింది. మంగళవారం స్కంద గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో శేఖర్‌బాబు తెలిపారు.



శివబాల గణపతిగా దర్శన మిచ్చిన దుర్గాగణపతి

రేపు జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్ : స్టేట్ అంతర జిల్లాల సబ్ జూనియర్ బాలుర హ్యాంబాల్ చాంపియన్‌షిప్ కృష్ణా జిల్లా కొండూర్‌లో సెప్టెంబర్ 2,3వ తేదీల్లో జరగనుంది. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టును బుధవారం ఎంపిక చేయనున్నామని వైజాగ్ హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి గోపికృష్ణ తెలిపారు. 2002 జనవరి 1న గాని తర్వాత గాని జన్మించిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికల్లో జననధ్రువకరణ పత్రంలో హాజరుకావాలన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కవితాజైన్, రాహుల్ రాయ్

8న కాసా ఫ్యాషన్ షో

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు) : సెప్టెంబరు 8వ తేదీన పార్క్ హోటల్‌లో కాసా ఫ్యాషన్ షో వాక్ ఫర్ ఏ కాజ్ సీజన్–2 నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కవితాజైన్ తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కార్యక్రమం వివరాలను మీడియాకు వివరించారు. ఆనాథ ఆశ్రమాలకు నిధులు సమకూర్చాలనే ఉద్దేశ్యంతో ఈ ఫ్యాషన్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో సీజన్–1ను హైదరాబాద్‌లో నిర్వహించామని దానికి మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో బాలివుడ్ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ షో ఆ రోజు రాత్రి 7 గంటలకు ప్రారంభవుతుందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో బాలీవుడ్ నటుడు రాహుల్‌రాయ్, సదానాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకాశంలో సగం.. క్రీడల్లో సంపూర్ణం

నగరంలో పలువురు యువక్రీడాకారులు రాష్ట్ర, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ చాటుతున్నారు. కొందరు కుస్తీ పోటీల్లో పట్టుబట్టి పతకాలు సాధిస్తుంటే, మరి కొందరు బాక్సింగ్ పంచ్ విసిరి వన్నె తెస్తున్నారు. ఇంకొందరు కరాటే లో హు...హా అంటూ పతకాలు హారాలుగా మెడలో వేసుకుంటున్నారు.

- గోపాలపట్నం (విశాఖ పశ్చిమ)

బాక్సింగ్‌లో మాణిక్యం అన్నపూర్ణ



వేపగుంట ముత్యమాంబకాలనీకి చెందిన నాగల అన్నపూర్ణ బాక్సింగ్‌లో ఘనాపాటి. వేపగుంట జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదివినప్పటి నుంచే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. తండ్రి ఎన్.అప్పారావు కూలి అయినా బాక్సర్‌గా మంచి పేరుంది. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన తండ్రిని చూసి తానూ పతకాలు సాధించాలని అన్నపూర్ణ తపించింది. హైస్కూల్ దశలోనే బాక్సింగ్‌లో పంచ్ విసరడంలో పట్టు సాధించింది. జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించింది. పాటియాలాలో జరిగిన యూత్ నేషనల్స్ పోటీల్లో వెండి పతకం, పంజాబ్‌లో జరిగిన ఇంటర్‌యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో కాంస్యపతకం, కేరళలో జరిగిన 34 సీనియర్ నేషనల్ గేమ్స్‌లో ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఉత్తరాఖండ్‌లో జరిగిన యూత్‌నేషనల్స్‌లో రెండు మార్లు, జూనియర్‌నేషనల్స్‌లో రెండు మార్లు వెండి పతకాలు సాధించింది. అయితే ఇప్పుడీ విజేతకు కాలం అనుకూలించక ఇంటి కష్టాలు, ఆర్థిక ఇబ్బందులూ అడ్డొచ్చాయి. హటాత్తుగా తండ్రి మరణించారు. తోడబుట్టిన ఇద్దరు అక్కలు, తల్లితో కుటుంబ భారం దయనీయంగా మారింది. దీంతో అన్నపూర్ణ చదువు ఆపేసింది. నగరంలో ఓ కార్యాలయంలో నాలుగువేల జీతానికి చేరింది. చదవాలన్న ఆశ, బాక్సింగ్‌పై ఎంతో ఇష్టం ఉన్నా ఆమె తెచ్చే సంపాదనే ఇపుడు కుటుంబానికి ఆధారమవ్వడం ఆవేదన గొలుపుతోంది. ఇన్ని కష్టాల్లోనూ ఆమె బాక్సింగ్‌లో నేనున్నానని ఆరాటపడుతోంది. సహకరించే వారు ఉంటే సీనియర్ నేషనల్స్‌కు సిద్ధమవ్వాలని తపిస్తోంది.

నూతన్ పంచ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



వేపగుంటకు చెందిన నూతన్‌కుమార్ కరాటే పంచ్‌లతో అంతర్జాతీయ ఖ్యాతి పొందుతున్నాడు. ఆంధ్రాయూనివర్సిటీలో ఎంబీఏ చేశాడు. అంచెలంచెలుగా ఎదిగి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించాడు. 2012 పూనెలో ఎన్‌కేఎఫ్‌టీ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వెండిపతకం, తర్వాత 2015లో విశాఖలో జరిగిన ఏసియన్ కరాటే పోటీల్లో బంగారు పతకం, 2016లో దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సెమీఫైనల్స్‌కి వెళ్లి రన్నర్‌గా నిలిచాడు. 2008, 2009లో మహారాష్ట్రలో జరిగిన జేకేఎస్ జాతీయ కరాటే పోటీల్లో రెండుబంగారు పతకాలు, 2010లో విశాఖలో జరిగిన ఆలిండియా కరాటే పోటీల్లో బంగారు పతకం, 2014లో మహారాష్ట్రలో ఆర్‌జీఎఫ్‌ఐ జాతీయ పోటీల్లో బంగారుపతకం, 2015లో తెలంగాణలో జేకేఎస్ జాతీయ కరాటే పోటీల్లో బంగారుపతకం, 2016లో మధ్యప్రదేశ్‌లో జరిగిన పీఈహెచ్‌వై జాతీయ యూత్‌గేమ్స్‌లో బంగారుపతకం ఇలా యాభైకి పైగానే బంగారువెండి పతకాలు అందుకున్నాడు. ఏడాది క్రితం పంజాబ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెండిపతకం సాధించాడు.

మల్లయుద్ధంలో మేటి సరోజ...



ఇదిగో ఈక్రీడా విజేత పేరు తోట సరోజ. ఊరు ఆరిలోవ. కుటుంబ నేపథ్యం పేదరికం. తండ్రి వాచ్‌మన్. డిగ్రీ ఉత్తీర్ణత సాధించింది. నగరంలో రీడింగ్ రూమ్‌లో పోటీ పరీక్షలకు వచ్చి మరో వైపు ఖాళీ సమయాన్ని క్రీడలకు కేటాయించింది. అలా కమర్షియల్‌టాక్స్ జాయింట్‌కమిషనర్ శివశంకర్రావు ప్రోత్సాహం, జిల్లా అమెచ్యూర్‌రెజ్లింగ్ క్రీడా సంఘం చీఫ్‌కోచ్ పంద్రంగి రుక్మాకర్‌రావు శిక్షణలో రెజ్లింగ్(మల్లయుద్ధం)లో నైపుణ్యం పొంది జిల్లా, రాష్ట్రస్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించింది. ఇపుడు పదిమందికి కోచ్ అయింది. తాను నేర్చుకున్న క్రీడానైపుణ్యాన్ని మరి కొందరికి పంచుతోంది. రీడింగ్‌రూమ్‌లో కోచ్‌గా ప్రశంసలు అందుకుంటోంది. క్రీడా రంగంలో జాతీయ స్థాయి ప్రతిష్ట సాధించి మంచి ఉద్యోగం సాధించాలని ఆరాటపడుతోంది.

మౌనిక ప్రతిభ అద్భుతమే...



బోగా శ్వేతమౌనిక నగరంలో రామ్‌నగర్‌లో ఉంటోంది. తండ్రి చిరుద్యోగి. అయినా ఉన్నత ఆశయాలతో డిగ్రీ చదువుతోంది. ఒక వైపు క్రీడానైపుణ్యాన్ని పెంచుకుంటునే ఇంకో వైపు చదువుల్లో రాణిస్తోంది. రెండేళ్ల క్రితం యువతులకు మల్లయుద్ధం శిక్షణ చూడడానికి వెళ్లి తానూ ఆకర్షితురాలయ్యింది. ఇలా జిల్లా, ఉత్తరాంధ్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయిలో వెండి పతకం సాధించింది. ఇపుడు మౌనిక కూడా కోచ్‌గా అద్భుత ప్రతిభ చాటుతోంది. ఇటీవల ఓ పిల్లల తల్లికి మల్లయుద్ధంలో శిక్షణ ఇచ్చి జిల్లా స్థాయిలో బంగారు పతకాన్ని రప్పించింది. భవిష్యత్తులో ప్రోరెజ్లింగ్‌లో అంతర్జాతీయ స్థాయి పతకాన్ని సాధించాలని ఆశిస్తున్నట్లు చెబుతోంది.

క్రీడారంగంలో విశాఖ సత్తా చూపుతోంది. నగర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం పూర్తి స్థాయిలో లేకపోయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతున్నారు. స్పాన్సర్లు మరింత మంది ముందుకు వస్తే విశాఖ ఖ్యాతి ప్రపంచ నలుమూలలా చాటి చెబుతామంటున్నారు మన క్రీడాకారులు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు



- క్రీడల్లో రాణిస్తున్న విశాఖ క్రీడాకారులు
- పతకాల పంట పండిస్తున్న వైనం
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే అయినా సత్తా చాటుతున్న యువతులు

చక్రాలతో పరుగులు... పతకాల్లో మెరుపులు

ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో శ్రీరామ్ జాతీయ స్థాయిలో ప్రతిభ





తల్లి విజయలక్ష్మితో శ్రీరామ్

అక్కయ్యపాలెం(విశాఖ ఉత్తర): జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో నగరంలోని లలితానగర్‌కు చెందిన చనమోలు శ్రీరామ్ అద్భుత ప్రతిభ చూపుతున్నాడు. రోలర్ స్కేటింగ్, ఆర్టిస్టిక్ రోలర్ స్టేటింగ్, ఐస్ స్కేటింగ్ విభాగాలలో సోలో, కపుల్‌డ్యాన్స్‌లో పిన్న వయస్సులో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించాడు. ఏషియన్, ప్రపంచ స్థాయి పోటీల్లో పతకం సాధించడానికి ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు.

స్కేటింగ్‌లో ప్రవేశం ఇలా....

చిన్నప్పుడు టీవీలో సినిమా పాటలను చూస్తూ డ్యాన్స్ వేస్తూండేవాడు. శ్రీరామ్ ఆసక్తిని చూసి అతని తల్లిదండ్రులు ఆరేళ్ల వయస్సులో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీలో వెస్టన్ డ్యాన్స్ నేర్పించారు. అప్పటినుంచి శ్రీరామ్ డ్యాన్సులో చూపించిన అద్భుత ప్రతిభతో ఎన్నో బహుమతులు సాధించాడు. అంతటితో తృప్తి చెందని శ్రీరామ్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌పై దృష్టి పెట్టాడు. స్కేటింగ్ రోలర్స్‌పై వెస్టన్ డ్యాన్స్ చేయడం కోసం శివాజీ పార్కులోని ట్రైనర్స్ పి.సత్యనారాయణ, కె.చిట్టిబాబు వద్ద శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టాడు.

ఎన్నో పతకాలు...

శిక్షణ మొదలుపెట్టిన ఏడాదిలోనే 2015లో ముంబాయిలో జరిగిన జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఆ తర్వాత 2016లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అహ్మదాబాద్‌లో నిర్వహించిన 53వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లోను పతకాలు సాధించాడు. 16 ఏళ్ల పైబడిన విభాగంలో పాల్గొని ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ కపుల్ డ్యాన్స్‌లో సిల్వర్ మెడల్, సోలో డ్యాన్స్‌లో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. అదే ఏడాది ఢిల్లీ, సిమ్లాలో జరిగిన ఐస్ స్కేటింగ్‌లో గోల్డ్, సిల్వర్‌పతకాలు సాధించాడు. ప్రపంచస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. దీని కోసం ప్రత్యేక శిక్షణ కోసం నవంబర్‌లో ఇటలీ వెళ్లనున్నాడు. ఏషియా, వరల్డ్ చాంపియన్ షిప్ సాధించాలన్నదే తన లక్ష్యమని శ్రీరామ్ చెబుతున్నాడు. ప్రస్తుతం బుల్లయ్య కళాశాలలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.

రాకెట్ క్రీడలో రారాజు



పతకాలతో లింగేశ్వరరావు

ఉక్కునగరం(గాజువాక) : జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ పేరు చెబితే గుర్తుకు వచ్చేవారిలో లింగేశ్వరరావు ఒకరు. చిన్నప్పటి నుంచి అన్ని క్రీడల్లో పాల్గొనే లింగేశ్వరరావు తన 15వ ఏట కజిన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ స్వరూప్‌తో కలిసి బ్యాడ్మింటన్ పోటీలు చూడటానికి వెళ్లారు. అక్కడ స్వరూప్ ఆడిన ఆట అతనిలో ఉత్తేజం కలిగించింది. అప్పటి నుంచి ప్రారంభించిన ఆట అతి తక్కువ కాలంలో జిల్లా చాంపియన్‌షిప్ సాధించేలా చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావు యుక్త వయసులో అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించగా నేడు మాస్టర్స్ టోర్నమెంట్‌లో అనేక పతకాలు సాధిస్తూ తన విజయపరంపర కొనసాగిస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..

- ఆలిండియా స్టీల్‌ప్లాంట్ టోర్నమెంట్లలో 10 బంగారు పతకాలు, 5 రజత పతకాలు సాధించారు
- ఆలిండియా పబ్లిక్ సెక్టర్ టోర్నమెంట్‌లో రజత పతకం
- 2012లో హరిద్వార్‌లో జరిగిన సీనియర్ మెన్ డబుల్స్ జాతీయ పోటీల్లో (40+) బంగారు పతకం
- 2013లో ముంబైలో జరిగిన సీనియర్ మెన్ జాతీయ సింగిల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2014లో బోపాల్‌లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ సింగిల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2014లో బోపాల్‌లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో బంగారు పతకం
- 2015లో ధర్మశాలలో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో కాంస్య పతకం
- 2017లో కొచ్చిన్ లో జరిగిన సీనియర్ మెన్ జాతీయ డబుల్స్ పోటీల్లో (45+)లో రజత పతకం
- 2017లో తిరుపూర్‌లో జరిగిన ఇండియన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ లీగ్ (ఐఎంబీఎల్) చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచారు.

అంతర్జాతీయ పోటీల్లో పతకాలు...

బ్యాడ్మింటన్‌లో లింగేశ్వరరావుకు అంతర్జాతీయ ఖ్యాతి

- 2004లో హైదరాబాద్‌లో జరిగిన ఆసియన్ శాటిలైట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో మెన్ చాంపియన్‌షిప్ సాధించారు.
- 2006లో కొలంబోలో జరిగిన శ్రీలంక శాటిలైట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో మెన్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు.
- 2007లో అడిలైడ్‌లో జరిగిన ఆస్ట్రో ఆసియన్ మాస్టర్స్ పోటీల్లో సింగిల్స్‌లో బంగారు పతకం, డబుల్స్ లో రజత పతకం సాధించారు.
- 2009లో స్పెయిన్‌లో జరిగిన 4వ బ్యాడ్మింటన్ వర ల్డ్ ఫెడరేషన్ పోటీల్లో సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ గెలుపొందారు.
- 2010లో కౌలాలంపూర్‌లో జరిగిన అపెక్స్ ఎంబీఏ అంతర్జాతీయ ఆహ్వానపు బ్యాడ్మింటన్ పోటీల్లో రజత పతకం
- 2017లో సింగపూర్‌లో జరిగిన హాకూ కీయింగ్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ జట్టు తరపున రజత పతకం గెలుపొందారు.
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఒకేసారి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారునిగా లింగేశ్వరావు అరుదైన ఖ్యాతిని గడించారు.
- ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ ఆశయం...
- 2018లో జరగనున్న మాస్టర్స్ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో 50+ కేటగిరీ పతకం సాధించడం ధ్యేయంగా ప్రాక్టీస్‌కొనసాగిస్తున్నానని లింగేశ్వరరావు తెలిపారు.

ఇండియన్ క్రికెట్ మేనేజర్ ఎంపిక జాబితాలో కుమార్



ఉక్కునగరం (గాజువాక): స్టీల్‌ప్లాంట్‌లో క్రీడలు అంటే గుర్తుకు వచ్చే మొట్టమొదటి వ్యక్తి ఎం.ఎస్.కుమార్. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, ఉక్కునగరవాసులు, ఉద్యోగుల పిల్లలకు ఆటల్లో ప్రోత్సహించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆందుకే అతనిని ప్లాంట్‌లో స్పోర్ట్స్ కుమార్ అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. స్టీల్‌ప్లాంట్ క్రీడల విభాగం ఎజీఎంగా విధులు నిర్వహిస్తున్న కుమార్ ప్రస్తుతం ఇండియన్ క్రికెట్ జట్టు మేనేజర్ పోస్టుకు ఎంపిక చేసే 12 మంది జాబితాలో ఒకరుగా ఉన్నారు. గత కొన్ని ఏళ్లుగా ఆంధ్రా రంజీ జట్టు మేనేజర్‌గా కూడా భాద్యతలు నిర్వహిస్తున్న కుమార్‌కు చిన్ననాటి నుంచి క్రికెట్‌పై మక్కువ ఎక్కువ. ఆయనకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తి జిల్లా, రంజీ పోటీల్లో పాల్గొనే స్థాయికి తీసుకు వెళ్లింది. అనంతరం ఆయన స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగపర్వం ప్రారంభించినప్పటికీ క్రికెట్‌పై ఆసక్తి కొనసాగుతూనే ఉంది. క్రికెట్‌లో ఆయనకు ఉన్న అపార అనుభవం గుర్తించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆయనను ఆంధ్రా రంజీ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఐదేళ్లుగా ఆయన రంజీ మేనేజర్‌గా కొనసాగుతుండగా అంతకు ముందు బీసీసీఐ రెండేళ్లుగా మ్యాచ్ రిఫరీగా నియమించింది. అదే విధంగా మూడేళ్ల పాటు రంజీ అండర్ 19 సెలక్షన్ కమిటీ సభ్యునిగా, ఏడాది పాటు అండర్ 16 సెలక్షన్ కమిటీ సభ్యునిగా అనేక మంది ఔత్సాహికులను ప్రోత్సహించారు. ప్రస్తుతం కుమార్ విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్(వీడీసీఏ),జిల్లా హాకీ అసోసియేషన్(డీహెచ్‌ఏ) ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కరాటేలో దుమ్మురేపుతున్న కొండారెడ్డి



సీతమ్మధార (విశాఖ ఉత్తర): కరాటేలో దుమ్మురేపుతున్నాడు కొండారెడ్డి. మద్దిలపాలెంకు చెందిన కొండారెడ్డి వడాకై కరాటే అసోసియేషన్‌లో సౌత్ ఇండియన్ సెక్రటరీ దువ్వి గోవింద్ యాదవ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు అందుకుని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. అంతర్జాతీయ కరాటే పోటీలలో ఓ బంగారుపతకం, జాతీయ స్థాయిలో 4 బంగారు పతకాలు, రెండు సిల్వర్‌లు, రాష్ట్ర స్థాయిలో రెండు గోల్డ్, నాలుగు సిల్వర్ పతకాలు, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. జిల్లా స్థాయిలో ఓ బంగారు పతకం, ఓ సిల్వర్ పతకం సాధించాడు.

స్కేటింగ్‌లోనూ..

చిన్నప్పటి నుంచి స్కేటింగ్ అంటే ఇష్టం. దాంతోనే స్కేటింగ్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. రెండేళ్లుగా కరాటే, స్కేటింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నాను. బంగారు పతకాలు చాలా వచ్చాయి. నవంబర్‌లో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ స్థాయిలో రాణించి, విశాఖకు పేరుతేవాలని భావిస్తున్నాను. పదో తరగతి చదువుతూ..శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో డాక్టర్‌గా స్థిరపడాలని ఉందని కొండారెడ్డి చెప్పాడు.

కరాటే, స్కేటింగ్‌లో..



స్కేటింగ్‌లో విశాఖ బాలుడు రికార్డులు సృష్టిస్తున్నాడు. 8వ తరగతి చదువుతున్న సత్యనారాయణ చిన్నతనం నుంచే స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయిలో 4 సిల్వర్ మెడల్స్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు, 3 సిల్వర్, 6 బ్రాంజ్ పతకాలు సాధించాడు. కరాటేలో కూడా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం, సిల్వర్, జాతీయ స్థాయిలో మూడు బంగారు పతకాలు, ఓ సిల్వర్, ఓ బ్రాంజ్, రాష్ట్రస్థాయిలో 2 బంగారు పతకాలు, 4 సిల్వర్, 2 బ్రాంజ్, జిల్లాస్థాయిలో ఓ బంగారు పతకం సాధించాడు.

కిక్‌బాక్సింగ్‌లో మేటి శిరీష

జాతీయ స్థాయిలో రాణిస్తున్న పేదింటి క్రీడా ఆణిముత్యం



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తండ్రిది కూలిపని..అమ్మ గృహిణి..చెల్లెలు ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. తనకు చదువుతో పాటు ఆటపాటలే లోకం. స్కూల్ గేమ్స్‌లోనే ఎన్నో పతకాలు సాధించిన ఆ యువతి ఇంటర్మీడియట్‌లో ఆటల్లో మరింత రాటుదేలింది. డిగ్రీలో చేరి మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్తోంది. ఆ లక్ష్యం జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా రాణించడం, పతకాలు సాధించడం. ప్రస్తుతం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బి.కాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎరాసి శిరీష... పేదింటి ఆణిముత్యంగా చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తోంది.

శిరీష ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. కార్పొరేట్ పాఠశాలలో చదివే స్తోమత లేక, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన శిరీషా అదే కళాశాలలో డిగ్రీ జాయిన్ అయింది. చిన్న నాటి నుంచి క్రీడల పట్ల మక్కువతో పాఠశాల స్థాయిలోనే పలు పతకాలు సాధించింది. అండర్-19లో జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు కైవసం చేసుకుంది. ఆరు సార్లు రాష్ట్ర స్థాయి, ఐదు సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి విశాఖ కీర్తిని ఇనుమడింపజేసింది. తండ్రి కూలి పనులు చేస్తూ శిరీషను చదివిస్తున్నాడు. పంజాబ్ లుథియానా, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అండర్-19 గరల్స్ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంది.

ఇంటి నిండా పతకాలే..

శిరీష ఇంటి నిండా పతకాలే. ఇంట్లో ఎక్కడ చూసినా షీల్డ్స్ కనిపిస్తుంటాయి. రెండేళ్ల కిందట స్టేట్ ఒలింపిక్స్ బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్-19లో కిక్ బాక్సింగ్, కాటాస్(కరాటే)లో పలు పతకాలు సాధించింది. ఇవి గాక స్టోన్ బ్రేక్, ఐస్ బ్రేక్, తలపై పెంకులు పెట్టుకుని బ్రేక్ చేయించుకోవడం, స్టమక్‌పై బైక్ ఎక్కించుకోవడంతో పాటు అనేక అంశాల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి పలువురి మన్ననలు పొందింది.